# ఆధ్యాత్మికపు మెఱుపులు



పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామి ఓంకార్

# ఆధ్యాత్మికపు మెఱుపులు



ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదుచ్యతే,
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే

ఓం శాన్తి శ్శాన్తి శ్శాన్తిః

లోకాస్సమస్తా స్సుఖినోభవన్తు.

హరిః ఓమ్ తత్సత్


ప్రకాశకులు :

**శ్రీ శాంతి ఆశ్రమము**

శాంతి ఆశ్రమము పోస్టు, పిన్ : 533 458.
వయా : శంఖవరం, తూర్పు గోదావరి జిల్లా, ఆంధ్రప్రదేశ్.

# "ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ"

ఓ మిత్యేకాక్షరం బ్రహ్మ ధ్యేయం సర్వముముక్షుభిః

తాత్పర్యము : ఓం అనెడి ఒకటే అక్షరమగు బ్రహ్మమును మోక్షము పొందగోరు వారందరును ధ్యానము చేయదగినది.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

...ఓమ్...

**"ప్రణవోధనుః శ్శరోహ్యాత్మా**
**బ్రహ్మతల్లక్ష్య ముచ్యతే,**
**అప్రమత్తేన వేధవ్యమ్**
**శరవత్త న్మయో భవేత్."**

"ఓం" అను ప్రణవము ధనుస్సు, ఆత్మ బాణము, ఆ బాణమునకు లక్ష్యము బ్రహ్మము, ఆత్మ నిగ్రహపరునిచే నది కొట్టబడవలయును. లక్ష్య వస్తువుతో బాణమెట్లు కలియునో, బ్రహ్మముతో ఆత్మ అట్లు సమైక్యతను జెందును.

**- ముండకోపనిషత్తు,**



# మీ శాంతియే నా శాంతి

మీ హృదయములలో శాంతి నెలకొల్పుకొని ఆ శాంతిని మీ గృహములలో వ్యాపింపజేసి మీ గృహములను స్వర్గధామములుగా జేయుటలో మీకు సహకరించుటకు నన్ను తోడ్పడనిండు.

మీరు మనోవాక్కాయ కర్మలయందు శాంతినే వ్యక్తపరచెదరుగాక! మీ యొక్క శాంతియుతమయిన ఆదర్శ జీవితములవలన, మీరు శాంతిని ప్రతి హృదయమునకును, ప్రతి జాతికిని, ప్రపంచమంతటను వ్యాపింపజేసినపుడే విశ్వమందు ప్రత్యణువునందును శాంతి నెలకొల్పబడును, గాన ఇప్పుడే ఇచ్చటనే శాంతి మీ హృదయములలో స్థిరము జేయుదురుగాక! ఇదియే మీ సోదరుడైన ఓంకారుని హృదయపూర్వకమయిన ప్రార్థన.

ఓం! ఓం! ఓం!

# మ న వి

శ్రీ శాంతి ఆశ్రమము స్వర్గధామము. శాంతి కాముకులకు ప్రశాంత నిలయము. ప్రేమమయులకు వికాసాలయము, భూతల స్వర్గమగు ఈ శాంతి ఆశ్రమమునందుపవిష్టులై-భవబంధనలోలురై అశాంతి, అసహనములచే పీడించబడుచున్న సర్వ మానవాళిని, "శాంతి" "ప్రేమ" యను రెండు "శ్వాస" సూత్రములచే బంధవిముక్తులను చేయుటకు తన జీవన సర్వస్వమును ధారపోసిన మహనీయులు "పూజ్య ఓంకార స్వామీజీ" జిజ్ఞాసాపరులైన మానవులకందించిన మహత్తర కానుక ఈ "ఆధ్యాత్మికపు మెఱుపులు".

పూజ్య ఓంకార స్వాములవారు నలుబది దినములు ఉపవాస వ్రతమాచరించినప్పుడు వారికి కలిగిన దివ్యానుభూతులను, స్వీయానుభూతులను 108 ఆధ్యాత్మిక ముత్యములుగా అందించిరి. ఇవి ప్రతివారు సులభముగా అర్థము చేసుకొనుటకు వీలుగా రచించబడినవి, ఇందు ఉపనిషత్తుల, భగవద్గీత సారాంశము ఇమడ్చబడెను. ఇందు ఏ ఒక్క అధ్యాయమును జీవితములో ఆచరించినను జీవిత గమ్యమును చేరుట తథ్యమనుట అతిశయోక్తి కానేరదు.

ఈ శాంతి ఆశ్రమములోను, వివిధ శాఖలలోను ప్రతి నిత్యము జరుగు సత్సంగములలో ప్రతి నిత్యము ఈ గ్రంథము నుండి 3 అధ్యాయములు చదివి వాటిని ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించవలెనని కోరుట జరుగును. కావున

ఈ పుస్తకమును పొందిన ప్రతి ఒక్కరూ కూడ ఈ గ్రంధము నుండి రోజునకు ఒక అధ్యాయమైనను పఠించిన యెడల ప్రతివారు ఆంతర్య దివ్య తేజస్సును గ్రహించి ముక్తిని పొందగలరు.

ఆధ్యాత్మికపు మెఱుపులు, దైవబిడ్డలనందరిని దివ్య తేజస్సుతో నూతన శక్తితో నింపి, ఆత్మశాంతి నొసంగగలదన్న పూజ్య ఓంకారస్వాములవారి ఆశయము నెరవేరుగాక!

**ప్రకాశకులు : శ్రీ శాంతి ఆశ్రమము**

# ఉపోద్ఘాతము

(1952 సం॥రములో వ్రాసినదానికి ఆంధ్రానువాదము)

ఈ పుస్తకము రెండేండ్ల క్రితము నలుబది దినములు జరిగిన ఉపవాస దీక్షా సమయములో శ్రీ ఓంకారస్వాములవారు వ్రాసినది.

శ్రీ ఓంకారస్వాములవారు రహస్యవాది (mystic) రహస్యవాదుల అనుభూతికిగల విలువను గురించిగాని, ప్రామాణ్యతను గురించిగాని నేనిప్పుడు విచారించతలచలేదు. కాని శ్రీ ఓంకారస్వాములవారి రహస్యవాదము - రహస్యవాదము యుక్తి యుక్తముగా ఉండుటకు వీలైనంత వరకు శక్తివంతము, యుక్తి యుక్తమనే చెప్పవలసియున్నది. వారు తమకు ప్రత్యేక విధములైన సాక్షాత్కారములు గాని, విచిత్రములైన స్వప్నములుగాని కలిగినవని ఎన్నడూ చెప్పలేదు. అయితే ఒకటియేయైన సత్పదార్థమందు ఆత్మయందు వారు విశ్వము యొక్క ఏకత్వమును అనుభవించినారు. ఏవిధమైన సిద్ధాంతములందుగాని, సంప్రదాయములందుగాని వారు ఆసక్తులుగారు : వారి యొక్క ప్రేమ, మైత్రి ఏదో ఒక దేశమునకుగాని, జాతికిగాని, పరిమితము గాదు. మానవుని మానవునిగా అవగాహన చేసికొను విశ్వదృష్టి వారిది, ఆవిధముగానే వారు ఆరాధించు ఈశ్వరుడు ఈ మతమందో, ఆ మతమందో, ఘోషించబడిన "ఈశ్వరుడు" గాకుండా ప్రతి మతములోను ప్రకాశపరచబడినాడని చెప్పబడినప్పటికి, ఏ మతమందుగూడ పూర్ణముగా ప్రకాశపరచబడనట్టి ఈశ్వరుడు.

వారి వారి సంకుచిత పథములలో పాతుకుపోయినవారు వారిని అపార్థము చేసికొనవచ్చును. స్పినోజా సమకాలికులైన యూదులు ఆయనను వెలివేసిరి. హెగెల్ అనుయాయులైన (ట్రాయల్ట్చ్) మొదలగు ఈశ్వర మీమాంసకులు క్రైస్తవ మతమే పరమతము కాదనినప్పుడు, విమర్శకులు లేకపోలేదు. ఇతర మతములకు చెందినవారు కూడ వారి వారి మత

గ్రంథములలో గూడ అశేష జ్ఞానము లేదని చెప్పిన, ఆ విధముగనే ఉద్రిక్తులగుదురనుటలో సంశయము లేదు. ఇది అనివార్యము. ఒక మూక వెంటవచ్చునటులచేసికొనవలయుననిన, పలుకుబడి కావలెననిన, ఒక జండాను ఎగురవేయుటయో, నినాదమును లేవదీయుటయో, బాజాలు వాయించుటయో చేయవలసినదేగదా? నిర్భయులైన శ్రీ ఓంకారస్వాములవారు ఎవరికిగాని, ఏ సిద్ధాంతమునకుగాని దాసుడు కాదలచరు. వారు ఏకాకిగా నిలిచి, తాను స్వయముగా కనిపెట్టినట్టి లేక అవగతము చేసుకొనునట్టిదానినే సత్యముగ ఎంచువారు వారు వాస్తవముగా "ఆత్మనిష్ఠితః" నేను వారిలో గౌరవించునది. వ్యక్తిత్వములో నన్ను ఆకర్షించునది యిదియే.

నేనెంతో మంది క్రైస్తవ సాధువులతో, హిందూ సాధువులతో సన్నిహితుడను, కాని వారెవరిలో కూడ ఒకానొక సిద్ధాంతమునకు సాంప్రదాయమునకు దాసుడు గాకుండెడి స్వాతంత్ర్యమును కనుగొనలేదు. బైబిలు యొక్క గాని, వేదము యొక్క గాని, సంప్రదాయము నర్థము చేసికొని అందలి సత్యమును జీర్ణింపజేసికొనిన మంచిదే. కానీ, యిది శూన్యము. తరచుగా శంకరుడు బోధించినాడు కాబట్టి అద్వైతము ననుసరించుటయో, ఎక్వినాస్ వాదించినాడు కాబట్టి "బాహ్య జగత్తు సత్యమను చెప్పు" సిద్ధాంతమును అవలంబించుటయో జరుగుచున్నది. శంకర, ఎక్వినాస్‌లు చెప్పినదానిని అర్థము చేసికొని, మన బుద్ధితో వివేకించి జీర్ణము చేసికొనుట, బుద్ధికి యుక్తి యుక్తముగా తోచనట్టి ప్రతిదానిని తోసివేయుట మనవిధి కదా! మత విషయములందు కూడ అపవాదము లేకుండా ప్రతిచోట బుద్ధికి, తర్కమునకు స్థానముండవలసినదే, శ్రీ ఓంకారస్వాములవారియందు యిది కానవచ్చుచున్నది.

భారతదేశమందు, విదేశములందు కూడ అనేకులు శ్రీ ఓంకారస్వాములవారి నెరుగుదురు. వారు యూరప్, అమెరికాలలో

విస్తారముగా పర్యటన చేసినారు. తోటపల్లి, వాల్తేరులలోని వారి ఆశ్రమములు విశృతములు. దాదాపు ముప్పది యేండ్ల నుండి సమస్త జాతుల మధ్య మానవ సౌభ్రాతృత్వము, శాంతి అను భావముల ప్రచారమునకు వారి ఆశ్రమము పాటుపడుచున్నది. సంభాషణల ద్వారాను, వ్రాతల ద్వారాను, కరపత్రముల, పత్రికల ద్వారాను శ్రీస్వామివారు ఇట్టి ఆశయ సాఫల్యమునకై యత్నించుచున్నారు. అట్లాంటిక్ సముద్రపు అవతలివైపున, గోథే, హెథెల్ దేశములలో కూడ వారి ఆశ్రమ శాఖలు గలవు. ఇదంతా బాగానే యున్నది గాని ఫలితములు మాత్రము విశేషముగా లేవు. ఇది తప్పదు. ఎందుకనగా, పరిశ్రమ చేయువారా కొలదిమంది, పంటయు విస్తారము. శ్రీ ఓంకారస్వాములవారు గత రెండేండ్ల నుండి మౌనమందున్నారు. ఇక ముందు కూడ ఉండదలచిరి. మౌనములో వారికొక బలము, నూతన ఆధ్యాత్మిక ఉత్సాహము లభించుచున్నవి. కాని, వారు ప్రపంచమునకు దూరులు కాలేదు. ప్రపంచమందు,దాని సమస్యలందు, వాటి పరిష్కారమందు శ్రీ స్వామీజీ ఆసక్తులే తమకు చేతనైన విధముగా సహాయమును ప్రపంచమునకు శ్రీ స్వామీజీ చేయుచున్నారు. బహుశా అది సరియైన సహాయము కావచ్చును. శాంతి ఆశ్రమము "శాంతి" (తెలుగు) "పీస్" (ఇంగ్లీషు) అనే విజ్ఞాన ప్రదమైన మాస పత్రికలను నడుపుచున్నది.

**ఇకను యీ పుస్తకము సంగతి :** ఇది అద్భుతముగా నున్నదని చెప్పక తప్పదు. ఈ గ్రంథములోని 108 అధ్యాయములు, 108 "మననములను" మనకందించుచున్నది. పాస్కల్ వ్రాసిన "చింతనములు" అను పుస్తకమువంటిది యీ గ్రంథము. ఆ గ్రంథములోని ఉత్తమమైన సాహితీ సౌందర్యము, ఆ గొప్ప ఫ్రెంచి దేశీయుని అసిధారవంటి తీక్షణత ఇందులో అంతగా కనబడకపోయినప్పటికి శ్రీ ఓంకారస్వాములవారు సూక్ష్మములో స్థిరతరముగా నుండగలుగునటుల వ్రాసిన ఈ పుస్తకములో ప్రదర్శించిన వాస్తవికమైన బుద్ధ్యౌదార్యము సహనశీలత ఆ కేథోలిక్ దార్మికునిలో కనబడునా? ఇందలి

గ్రంథస్థ విషయము మీలోని ఆధ్యాత్మిక తేజమునకు దోహదమును కలుగజేయు ఉత్తేజమును సర్వదా యివ్వగలిగి యున్నదనియు, గంభీరార్థము కలదనియు నిశ్చయము.


దాక్టరు కె. సచ్చిదానందమూర్తి

తత్త్వశాస్త్రశాఖ ప్రధాన అధ్యాపకులు,

ఆంధ్ర విశ్వవిద్యాలయము, వాల్తేరు.


.... ఓమ్ ....

ఓం తద్బ్రహ్మా, ఓం తద్వాయుః, ఓం తదాత్మా,
ఓం తత్సత్యం, ఓం తత్సర్వమ్, ఓం తత్పురోర్నమః
అంత శ్చరతి భూతేషు గుహాయాం విశ్వమూర్తిషు
త్వం యజ్ఞస్త్వం వషట్కారస్త్వ మిన్ద్రస్త్వగ్ం రుద్రస్త్వం
విష్ణుస్త్వం బ్రహ్మత్వం ప్రజాపతిః, త్వం తదాప
ఆపో జ్యోతిరసోమృతం బ్రహ్మభూర్భువస్సువరోమ్.

సర్వేజనా స్సుఖినోభవంతుః

ఓం తత్సత్ ఓం

# వి ష య సూ చి క

మనవి
ఉపోద్ఘాతము
తొలిపలుకు


| | | పుట |
|---|---|---|
| 1) | శాంతిని ఉచ్ఛ్వసింపుము - శాంతినే విశ్వసింపుము | 1 |
| 2) | మతము, జీవితము ఒకటియే | 2 |
| 3) | సచ్చిదానందము | 3 |
| 4) | రజ్జు సర్ప భ్రాంతి | 4 |
| 5) | అంతయు దైవమే | 5 |
| 6) | ఆదివారము : సూర్యుని ప్రకాశమైన దినము | 6 |
| 7) | అన్యపదార్థ బంధవిముక్తి | 7 |
| 8) | నీ ఆంతరంగమును దైవభావముతో నింపుము | 8 |
| 9) | సమిష్టి చైతన్యము | 9 |
| 10) | సూర్యులకు సూర్యుడు మేఘములను చెదరగొట్టుగాక! | 10 |
| 11) | శరీరమనెడి పంజరము నుండి వెలుపలికి రమ్ము! | 11 |
| 12) | ప్రపంచమంతయు ఒక భ్రాంతి | 12 |
| 13) | అమూల్యనిధి - నేనే | 13 |
| 14) | నీవు నిరంతరము భగవంతునియందే ఉంటివి | 14 |
| 15) | శక్తి - త్రివిధము | 15 |
| 16) | ఆత్మ సర్వసాక్షి | 16 |
| 17) | సూర్యులకు సూర్యుడగు దేవుని కిరణములే తలంపులు | 17 |
| 18) | భగవంతుని గురించి మఱపు యుండదు | 18 |
| 19) | వ్యక్తిగతమగు సమాధి స్వార్థపూరితము | 19 |
| 20) | శ్వాస - జీవ సూత్రము | 20 |
| 21) | పూర్ణత్వమునకు కలుపదగినది ఏదియు లేదు అందుండి తీసివేయకలిగినదియు లేదు. | 21 |
| 22) | పవిత్రమగు శ్వాస అహంకారమును నశింపజేయును | 22 |
| 23) | కొన్ని పనులను నీవే స్వయముగా చేసుకొనవలెను | 23 |
| 24) | ఏకైక విశ్వశక్తి | 24 |

25) ఆత్మ ఆలోచన కతీతమైనది 25
26) వేయిమైళ్ళ ప్రయాణమైనను మొదటి అడుగుతోనే ప్రారంభమగును 26
27) చిట్టచివరకు సహజ సమాధి - భగవత్సాక్షాత్కారము 27
28) ఆత్మ ఒక మహాసముద్రము 28
29) అవిభక్తమైన శ్వాస 29
30) అగాథము నుండి నూతనశక్తి 30
31) అహంకారము 31
32) ప్రపంచమంతయు బ్రహ్మమే 32
33) అష్టావక్ర గీత - జ్ఞానమే నీవు 33
34) క్లిష్ట పరిస్థితులలో గూడ నీవు ఆత్మవే 34
35) నీవే ఆత్మవు, మాధుర్యముగ నుండుము 35
36) ఈ క్షణము 36
37) ప్రేమయే దివ్యౌషధము 37
38) భగవంతుని మరచుట అసంభవము 38
39) పరాపర తత్త్వములు 39
40) దైవసాన్నిధ్యము మరపునకతీతము 40
41) నీ కేంద్రమును లోపలనే యుండనిమ్ము 41
42) కారణము నీ లోపలనే యున్నది 42
43) సహజ స్థితిలో నుండుము 43
44) ఇక మఱపునకు తావులేదు 45
45) దైవ సాక్షాత్కారమైన లోకము 46
46) భగవత్సాక్షాత్కారము ఇప్పుడే, ఇక్కడనే 47
47) ఆనందానుభవమే మతము 48
48) విశ్రాంతి లేని బిడ్డ 49
49) అనేకత్వములో ఏకత్వము 51
50) మనస్సు సంకల్ప వికల్పాత్మకము 52
51) సంపూర్ణమైన సాక్షాత్కారము 53
52) కష్టములు వచ్చినను నీవెందుకు ఆనందింపవు? 54
53) అధిక భుజ శక్తికై ప్రార్థింపుము 56
54) శాంతి ఆంతర్యముననే యున్నది 58

55) సాన్నిధ్యము, అనుభూతి 59
56) పరిమితములో అపరిమితి 60
57) ఉత్సాహ నిరుత్సాహ సమయములు 61
58) పని-వ్యాకులతను పారద్రోలును 63
59) ఆనందము బ్రహ్మైక్యమునందే కలదు 65
60) యదార్థమగు సర్దుబాటు, లోపలనే యున్నది 67
61) మానవుడు సహజముగా సింహమే 69
62) భ్రమ వట్టి రెల్లుపుల్ల వంటిది 70
63) క్రీనీడలకు భయపడుట 71
64) అదృష్టము 72
65) దివ్య క్షణమును శాశ్వతముగా నిలుపుకొనుము 73
66) నన్ను (నా ఆత్మను) నేను మరువలేను 74
67) విశ్వ దృశ్యము 75
68) ఖండమైన ఏర్పాట్లకు పరంజ్యోతి అతీతము 76
69) శుభ శుక్రవారము - పాడుచున్న పక్షులు 77
70) ధన్యమగు ఈష్టరు పండుగ 79
71) దైవమునకు నీ శరీరము తప్ప ఈ భూలోకమందు వేరు శరీరము లేదు 80
72) పునర్జీవితుడగు క్రీస్తు ప్రభువు 81
73) ప్రేమకొఱకు భగవంతుని ప్రేమింపుము 82
74) స్తుతికిని, నిందకును, అతీతముగ నుండుము 84
75) భగవంతుని నిష్కామముగా ప్రేమింపుము 86
76) సమస్తమును లోపలి నుండియే వచ్చును 88
77) ప్రతి క్షణము అమూల్యము 89
78) ఈష్టరు - భానువారము 90
79) ఎన్నడును ఫిర్యాదు చేయకుము 91
80) మౌనము బంగారము, వాక్కు వెండి 93
81) తనమీద తానే యాధారపడుట 95

82) తన అపజయమును ఒప్పుకొనినవాడే యోడిపోయినవాడు 96
83) అంతరంగము నుండి సూర్యోదయము 97
84) ప్రకృతితో ఏకత్వము 98
85) మిక్కిలి భాగ్యవంతుఁడెవఁడు? 100
86) ఉపవాసదీక్ష పూర్తియైనది 102
87) అతిశయోక్తి 104
88) చరిత్ర మరల మరల సంభవించును 106
89) భగవంతుడొక్కడే ఆశాభంగము చేయడు 108
90) అనంతమగు శక్తి నీలోనే యున్నది 110
91) అందరికంటెను భాగ్యవంతుడను నేనే! 112
92) సముద్రముతో పక్షుల పోరాటము 114
93) భావనాశక్తి 116
94) చిన్న తుఫాను 118
95) నిమ్మ చెట్టు 119
96) జడ పదార్థములయెడల అనురాగము 120
97) రెండు పవిత్ర పక్షులు 122
98) భగవంతుడు చైతన్య స్వరూపుడు 124
99) నా ఉఱుములు మెఱుపులు 126
100) తోటపల్లి ఆశ్రమ సందేశములు 128
101) వికృతి రూపమందును భగవంతుని చూడుము 130
102) నీ కత్యంతాప్తమిత్రుడెవరు? 131
103) మంచిని చేయునపుడు, నీదే పైచేయిగా నుంచుము 133
104) సత్య మార్గము ఎగుడు దిగుడుగా నుండును 134
105) రక్తము కారుచున్న మండూకము యొక్క కథ 135
106) నీకు ఏమి కావలయును? 137
107) నీకు నీవే మిత్రుడు 138
108) ఎవరో ఒకరు 140

# తొ లి ప లు కు

ఈ పుస్తకమునకు ఉపోద్ఘాతము వ్రాసిన ప్రసిద్ధిగాంచిన రచయితయు, తత్త్వవేత్తయునగు శ్రీ సచ్చిదానందమూర్తి గారికి కృతజ్ఞుడను. వారికి నా యెడల గల అమిత ప్రేమచేత ఈ ఆధ్యాత్మికపు మెఱుపులను గూర్చి యింత శ్లాఘనీయంగా వ్రాసియుందురని ఊహించుచున్నాను. ఈ 108 సందేశములలోను ఒక స్వల్ప భావనయందలి సారాంశమునైనను మా పాఠకులు చదివి అర్థము చేసుకొని అనుభవములోనికి తెచ్చిరేని, ఈ నా భావరచన యొక్క శ్రమ వ్యర్థముగాదని ఆశించుచున్నాను.

మనుజులయొక్క స్వభావములు వేరువేరు విధములుగ నుండును. కావున ఈ సందేశములన్నియు అందరకు నచ్చకపోవచ్చును. అయినను ప్రతీ వ్యక్తికిని ఏదోనొక సందేశము వారి హృదయమునకు హత్తుకొని అభ్యాసయుక్తమై, సహకారిగా నుండగలదని నా నమ్మకము. ఈ సామాన్య సందేశములు విద్యావంతులకును, గొప్ప పండితులకును ఆకర్షణీయము కాకపోవచ్చును. నిజముగా జీవన్ముక్తులకును, ముక్త జీవులకును ఏ సందేశములును, ఎవరి యొద్ద నుండి గూడ అవసరముండదు. దైవపరితాపనతో నిండియున్న సత్యాన్వేషకులకు మాత్రము ముఖ్యముగా తోడ్పడును.

నా చిన్నతనమున, ఏసు ప్రభువు అడవులలో నలువది దినములు ఉపవసించెనని బైబిలులో చదివియుంటిని. అది చదివినప్పుడు ఆ దివ్య ప్రభువువలె నేను గూడ ఎప్పుడైననూ నలుబది దినములు ఉపవసింపవలెనని ఆశించి యుంటిని. దైవానుగ్రహముచేత తోటపల్లి కొండలయొక్క అడవులలో సలిపిన ఈ నలువది దినములు ఉపవాస వ్రతము ద్వారా నా యీ చిన్న కోరిక ఫలించెను.

ఈ ఆధ్యాత్మికపు మెఱుపులను అచ్చునకు పంపక పూర్వము ఒకనాటి ప్రాతఃకాలమున కైలాసములో మహావిశాల సముద్రము ఒకవైపునను, నీలి పర్వత శిఖరము లొకవైపునను వెలయుచుండ, నాకు నేనే వీటిని చదివి ఆనందించగలిగితిని. ఆ సందేశములు వర్ణింపతరము కాని ఒకవిధమైన ఆనంద తన్మయత్వముచే నన్ను నింపెను. ఎవరో ఒకరిని గూర్చిన చిన్న పద్యముతో పూర్తి చేయబడిన నూట ఎనిమిదవ అధ్యాయము కడకు వచ్చునప్పటికి, ఈ ఆధ్యాత్మికపు మెఱుపుల (**Cosmic Flashes**) యొక్క ప్రియమైన పాఠకులకు ఆ ఎవరో ఒకరుగా, నేనై యుండవలెననెడి సంకల్పము నాకు కలిగినది.

ప్రియమైన పాఠకులారా! కైలాసము నుండి నిశ్శబ్దముగా మీకు సేవచేయుటకు ఆ దివ్యమైన సావకాశము నాకు అనుగ్రహించెదరా! జ్ఞానులకును, విజ్ఞానాపేక్ష గలవారికిని హెచ్చు మాటలు అనవసరము. కావున ఈ ఆధ్యాత్మిక మెఱుపులు మీ జీవితములను పరివేష్టించి, మీ యొక్క ప్రతి జీవకణమునందును ప్రవేశించి మౌనములో నిశ్శబ్దముగా, మీరందరూ దైవ సాన్నిధ్యమును నిరంతరము అనుభవించుటకు కోరుచుంటిని.

ఓం అసతోమా సద్గమయ,
ఓం తమసోమా జ్యోతిర్గమయ,
ఓం మృత్యోర్మా అమృతంగమయ.
ఓం శాంతి; శ్శాంతి; శ్శాంతిః

**- గ్రంథకర్త.**

కైలాసము, వాల్తేరు
1వ సెప్టెంబరు 1953.

# శాంతిని ఉచ్ఛ్వసింపుము.
# శాంతినే విశ్వసింపుము.

* మంజరి. "ఉచ్ఛ్వాస నిశ్వాస మోంకారనిబిడ
సర్వవిశ్వవ్యాప్త శాంతోఽ యమాత్మ"
యని జపియించగా, నవికల్ప శాంతి
యమరు సౌఖ్యోపేతమై యహరహమ్ము.

శాంతి ప్రతివానియొక్క జన్మ హక్కు. అంతేగాదు శాంతియే వాని ఆత్మ. 'శాంతోఽ యం మాత్మా' అని ఉపనిషత్తు చెప్పుచున్నది. ఈ మంత్రమును ఎవరైతే పఠింతురో వారికి భగవత్ సాక్షాత్కారము ఎప్పుడో భవిష్యత్తునందుగాక యిప్పుడే యిక్కడనే కలుగును. నీ యొక్క ప్రతి ఉచ్ఛ్వాసముతోను శాంతిని పీల్చుటకు ప్రయత్నింపుము. ప్రతి నిశ్వాసముతోను శాంతినే విడుచుటకు ప్రయత్నింపుము. ఈవిధముగా నీ జీవితమే శాంతి కావలయును. ఇట్లు సర్వవ్యాపకమైన శాంతిని అనుభవించువారు తమ హృదయాంత రాళమునందును తమ శల్యాంతరాళము నందునుగాక బాహ్యముననున్న ప్రతిస్థానమునందును దానిని అనుభవింతురు. అట్టివారికి ప్రపంచమంతయు ఒక నిశ్చలమైన విస్తీర్ణమగు శాంతి సరస్సు అగును. మనము సర్వత్రా చూచుచున్న కష్టములు, విరోధములు, దుఃఖములు, ద్రోహములు, పాపములు, లోపములు వారికి ఉండవు. అట్టివారికి సమత, దృఢత శాశ్వతముగా నేర్పడును. ఈవిధముగా శాంతి ననుభవించువారు భగవత్ సాక్షాత్కారము పొందగలరు. నిజమునకు శాంతియు, దైవమును వేరు వేరుగావు ఒక్కటియే.

... ఓమ్ ...

# మతము, జీవితము ఒక్కటియే

* తే. "అద్వితీయము" బ్రహ్మ ; తదర్చనంబ
మతము; మత జీవితంబులు మౌని కొకటె ;
ప్రేమమయ సత్పథైక జీవితమె మతము;
ధన్యు డాతఁడీ దివ్య సత్యము నెఱింగి

భగవంతుడు ఒక్కడే. అతడు అద్వితీయుడు. "ఏకమ్ ఏవ అద్వితీయమ్" అంతయు అతడే. మతమనగా భగవత్పూజ. అందఱిని పూజించుటయే మతము. మతము, జీవితము రెండు కావు ఒకటియే. జ్ఞానికి మతమే జీవితము. జీవితమే మతము. పటిమతో కూడిన జీవితమే మతసమ్మతమైనది. భగవంతుడు ప్రేమయే. కావున మత సమ్మతమైన జీవనము ప్రేమదాయకమైనది. ఈ సత్యము తెలిసినవారే ధన్యులు.

... ఓమ్ ..

# సచ్చిదానందము

* తే. "బ్రహ్మము" మహోబ్ధి; ధీగభీరం బమేయ
ముచ్చల తరంగములు సృష్టి; బుద్బుదాళి
జీవముల్, సచ్చిదానంద సేవధి, యును
నప్రమేయము; కర్త తదర్థపరుఁడు.

కర్తయెవఁడు, భోక్త యెవఁడు, కానబడవు
శక్తి మంతముల్ తెలుఁపగా జాలు శబ్ద
ముల్ ; సమాధిలో నైశ్శబ్దమున లయించు
ద్రష్ట, దృశ్యము, ద్వైత యతండె బ్రహ్మ.

పరబ్రహ్మము మహా సముద్రము వంటిది. అది అపారము, అగాధమైనది. సృష్టి అందు ఒక అల. వ్యక్తులు బుద్బుదములు. ఆ మహా సముద్రములో సత్తు, చిత్తు ఆనందము తప్ప మరేమియులేవు; ఆ బుద్బుదము అంతరించినపుడు అది సచ్చిదానంద సముద్రములో లీనమగును. అపుడు అంతము లేని ఆనందము. అనంతమైన చైతన్యము ఆ బుద్బుద లక్షణములగును. అంతియే కాదు. అది బ్రహ్మమే అగును. పొందేది ఏది? పొందువారెవరు? ఇది మౌనమునందు అనుభవైక వేద్యము, ఇది వాక్కున కతీతము. ధ్యానమందును, కర్మలయందును సాధించినగాని సంపూర్ణతను చెందదు, ఏలయన బ్రహ్మము గోచరాగోచరము, వ్యక్తావ్యక్తము అటులై యుండియు, నా రెండింటికి అతీతమైనది.

... ఓమ్ ...

# రజ్జు సర్ప భ్రాంతి

*    ఆ.    ఒందు బ్రహ్మ; మఱియొకం డెన్నడును లేదు
సర్ప రజ్జు బుద్ధి చాలునింక;
నెండ మావులcబడి యేల విభ్రమ మొంద
సౌమ్య! తొల్లి యొండె సత్తునొండె!

సత్యము, అసత్యము ఎన్నడును కలిసియుండలేదు. ఇప్పుడు కలిసి లేవు. ఇటుపై కూడ కలియవు. ఆదిలో ఒక్కటియే యుండెను. అదియే సత్యము. ఇపుడు ఉండునది, ఇక ముందు ఉండబోవునది అదియే "సదేవ సౌమ్య ఇదమగ్ర అసీత్" అసత్ ఎన్నడును లేదు. ఇప్పుడును లేదు. ఇటుపైన ఉండబోదు. పరమాత్మయే ఎప్పుడూ ఉండునది. ఆ పరమాత్మను మించి వెలుపలగాని, ప్రత్యేకమైనదిగాని మరియేదియు లేదు.

నీవు భగవంతుడవా లేక శూన్యమవా? శూన్యము ఉండుట అసంభవము. కనుక నీవే భగవంతుడవు. భ్రమలు ఇంక చాలించుము. ఎందుకంటే మానవుల నన్వేషించుట మానుము. త్రాడో, పామో తెల్సుకొనుము. సర్పభ్రాంతికి నేటితో స్వస్తి చెప్పుము. దానివలన చాల కష్టపడితివి. ఇప్పుడు త్రాడును గుర్తింపుము. ఆ సత్ పదార్థమే భగవంతుడు.

... ఓమ్ ...

# అంతయు దైవమే

* తే. దశదిశాపరీవ్యాప్తము "తద్వి" భూతి;
జ్ఞాన మజ్ఞాన మాతఁడె; జప తప నియ
మోపవాస కృచ్ఛ్రములేల! యొందు విడిచి
ఈవు సర్వాత్మనా సమర్పించుకొమ్ము

అంతయు భగవంతుడే. నీ దృష్టిని ఎటు త్రిప్పినను, తూర్పు, దక్షిణము, పడమర, ఉత్తరములందు భగవంతునే నీవు చూచునది. మీదను, క్రిందను, ప్రతివైపునను దైవత్వమే నిన్నావరించి యున్నది.

"బ్రహ్మేవ ఇదం అమృతం పురస్తాత్ ।
బ్రహ్మపశ్చాత్, బ్రహ్మ దక్షిణాచ్చ, ఉత్తరాశ్చ ॥"

ఈశ్వరుని నుండియే జ్ఞానాజ్ఞానములు ఉద్భవించును. అట్లయినచో ఈ ప్రార్థనలేల? ఈ ధ్యానములేల? ఈ ఉపవాసములు మంత్రోచ్చారణములేల? ఈ ప్రయాసయంతయును భ్రమయే! యదార్థమునకు సాధకుడెవరు? ఎవని కొరకు ఈ సాధన? ఈ సాధన ఎందులకు? కావున ఈ సాధనలన్నిటిని వదలి ఈశ్వరుని శరణుజొచ్చి మౌనములో నుండుము.

... ఓమ్ ...

# ఆదివారము; సూర్యుని ప్రకాశమైన దినము

* తే. సర్వకార్య విరామ విశ్రాంతి దిన మొ
కండె! భానువాసరమేల! కలదినాలు
సకలముల్ - దివ్యదర్శన శాంతిదములు
కావలయు; తత్త్వసంధాత ఖమణి యగుత.

నేడు ఆదివారము. అతి తేజోవంతమైన భాస్కరుని దినము. ఆదివారము విశ్రాంతి దినము కావున నేనా రోజున సదా ఆనందముగ నుందును. ఆ దినమున ప్రాపంచిక విషయములను దూరముగ నుంచుదును. అయితే ఈ భానువారము వారమునకొకసారి మాత్రమే యుండనేల? ప్రతి దినము తేజస్సు, ప్రార్థన, శాంతి విరామములతో కూడిన భానువారముగ నుండరాదా? జ్ఞాన సూర్యుని ప్రభావమును ప్రకాశించనిమ్ము, సూర్యుని మరుగుపరచునట్టి మేఘములు తొలగనిందు. "తత్త్వంపూషన్నపా వృణు, సత్యధర్మాయ దృష్టయే" మనము సూర్యుని హృదయ మధ్యమందు నిరంతరము స్థిరులమై ఉందుముగాక!

... ఓమ్ ...

# అన్యపదార్థ బంధవిముక్తి

*　　తే.　　ఉదర పోషణారాటము నొందు విడిచి
　　　　　　యున్న చిత్త వృత్తి యచల యోగమూను
　　　　　　వలదు ప్రార్థన; ధ్యానమ్ము వలదు; భవ్య
　　　　　　భావ బాలవికాసంబె స్వర్గ సృష్టి.

నేను ఆహార పానీయములు తీసికొని ఎన్నో దినములు గడచినవి. నాకు నీరసముగానున్నను, స్వేచ్ఛగాను, తేలికగాను ఉన్నది. యదార్థముగా మనస్సు విషయములవెంట పరుగిడక, శరీరము ఆహారమును, దుస్తులను కోరనప్పుడు మాత్రమే ధ్యానము సాధ్యమగును. మనస్సు నిశ్చలముగాను, చెదరకుండగను, ప్రశాంతముగను ఉన్నప్పుడే అది సత్యముతో నిండియుండును. యోగమనగా చిత్త వృత్తి నిరోధము. ఆ నిరోధ స్థితియందు, ఏ ప్రార్థనగాని, ధ్యానముగాని ఆవశ్యకత లేదు. ఏ యత్నము కూడ అక్కరలేదు. నీవు నిశ్చలముగాను, ప్రశాంతముగాను, నిర్మలముగాను మాత్రము కూర్చుండుము. పరలోక ప్రాప్తి అట్టి అమాయకమైన పసిబిడ్డలవంటివారికే లభించును.

... ఓమ్ ...

# నీ అంతరంగమును దైవముతో నింపుము.

*  తే.  అఖిల విజ్ఞాన చైతన్య మాత్మశక్తి
నిత్య ముత్సాహమిచ్చు; వినీతమతిని
స్వాత్మగుప్త శక్త్య న్వేషణాత్త బుద్ధి
నీవు నీయందె గని వెల్గునింద వలయు.

మానవుడు బ్యాటరీ (Battery) యంత్రమువంటివాడు. అతడు దైవభావముతో నిండియున్నచో బ్యాటరీ శక్తివంతముగ నుండును. లేనిచో వ్యయమైన బ్యాటరివలె అతడు నిర్జీవియే అగును. కాని ఈ ఉపమానము పూర్తిగా వర్తింపబడదు. బ్యాటరీ శక్తి కావలసియున్నచో దానిని వెలుపల నుండి సంపాదింపవలెను. కాని మానవుని చైతన్యునిగా చేయుశక్తి తనలోనే యున్నది. అతడు చేయవలసినది, తన శాశ్వత ప్రభావమును జ్ఞప్తిలోనికి తెచ్చుకొనుట మాత్రమే. అతడు కండ్లు తెరచినతోడనే తాను సదా తేజస్సుతోను, ప్రేమతోను చైతన్యముతోను నిండియున్నట్లు చూడగలడు.

... ఓమ్ ...

# సమిష్టి చైతన్యము

*  తే.  "మోక్ష" మన క్లేశ బాధా విమోచనమ్ము;
అంతదనుక ప్రమేయమైనట్టి బ్రహ్మ
మౌను నప్రమేయ ము క్రొత్తదైన స్థితి
కాదు; స్మృతివీడి తెలివొంది కనుట తక్క

వైషమ్యములు, తగవులు, సాధకబాధలు వీటి నుండి ఉపరమణమే ముక్తి. ఆ ముక్తియందు అంతముగలదంతయు అనంతమగును. కాని ఈ స్థితి నూతనముగా పొందవలసినది కాదు. అది ప్రతియాత్మయందు శాశ్వతముగా ఉండియున్నదే! కాని జీవాత్మ తన సహజ మహిమను మఱచి, మాయలో వసించుచున్నది. మనుజుడు తన చేతినున్న గడియారమును తాను మరచి ఇతర స్థలముల వెదకి అది దొరకనందున విచారము నొందినటుల. జీవాత్మయు తనలోనే యిమిడియున్న ఆనందమును మఱచి దాని కొరకు యితర స్థలములందు వెదకుచున్నది.

... ఓమ్ ...

# సూర్యులకు సూర్యుడు మేఘములను చెదరగొట్టుగాక

* ఆ. సంజ ప్రొద్దు; ఇరులు సడలిపోలేదు; భా
స్కరుఁడు పొలుచు; నిఁక నుషస్సు నెగడు;

* తే. ఆత్మభానూదయంబయి యలముకొన్న
మౌఢ్య జీమూతముల దృష్టి మలఁగఁ గొట్టు

* తే. క్రౌర్య మీర్ష్యయనెడు తటాకంపు జలము
శుష్కముగఁజేసి, సద్భావ శుద్ధ మధుర
సౌఖ్య సస్య సంపదను పుష్కల మొనర్చి
ఇబ్బడిని ఆత్మఘృణి ప్రకాశించుగాక.

ఇప్పుడు ఉషఃకాలము, చీకటి పూర్తిగా అంతరించలేదు. సూర్యుడింకను ఉదయించలేదు. కాని ఆయన ఉదయించబోవుచున్నాడు. ఆయన రాకను తెలియజేయు చిహ్నములు కాన్పించుచున్నవి. ఈ ఉషస్సులు ఆయన రాకను తెలియజేయుచున్నవి. నీ ఆత్మ సూర్యుని కూడ ఉదయింపనిమ్ము? అజ్ఞానము, స్వార్థము అను కారుమబ్బులను, ఆ సూర్యుడు తొలగించునుగాక! ఆయన తన మహిమచే మురుగుగుంటలవంటి ఈర్ష్య, ద్వేషము, క్రూరత్వము మొదలగు వాటిని తపింపచేయుగాక! ఆనందము ప్రీతి, మాధుర్యము అను పంటలను అభివృద్ధిచేయుగాక!

... ఓమ్ ...

# అమూల్యనిధి - నేనే

*    తే.    నిజము ధన్యుఁడ నేను పెన్నిధి లభించె
భూమికాదు; పుత్రయుకాదు పొన్ను కాదు
ఏది దొరికిన నెల్ల ఫలించు; నద్ది
'ఆత్మ' ధనము; సర్వదము; స్వాయత్తమయ్యె.

అమూల్యనిధిని కనుగొంటిని, గాన నే నదృష్టవంతుడను. ఆ నిధి భూములు, సౌధములు, ధనము, వస్తువులయందు లేదు. అది నాలోనే యున్నది. నేను ఆత్మను కనుగొంటిని, దానివల్లనే సమస్తమును కనుగొంటిని. ఇహపరలోకములందు ఆత్మయే అమూల్యమగు నిధి. సమస్తము ఆత్మకొఱకే కోరబడుచున్నది. "ఆత్మనస్తు కామాయ". ఆదియందు, అంతమందును ఆత్మయే. నేను దానిని కనుగొంటిని. అందుచేత నేను సమస్తమును కనుగొంటిని.

... ఓమ్ ...

# నీవు నిరంతరము భగవంతునియందే ఉంటివి

*   తే.   అద్వితీయ బ్రహ్మమున నీవహరహంబు
నుంట సత్యము విస్మృతియున్నెయెందు;
ఏది యేది నీ వెట నాచరింప, తెలియు
మీ! పరంధాముకొఱ; కతడెందులేఁడొ!

నీవు భగవంతుని మఱచితివా? అది సాధ్యమే! నీవెట్లు ఆయనను మఱువగలవు? నీవు ఆయనలోనే జీవించుచు, ఉచ్ఛ్వాస నిశ్వాసలను జరుపుచుంటివి. నీవు ఆయనలోనే పనిచేయుచు చింతించుచుంటివి. ఏలయనగా నిజముగా స్వర్గనరక భూలోకములయందు భగవంతుడు దక్క నన్యమేదియు లేదు. అట్టి భగవంతుని మఱచుటయా? నీవేది తలచినను, చేసినను, పలికినను, సర్వము భగవంతునిదే ! కాబట్టి ఆయనను జ్ఞప్తి యందుంచుకొనుటకు ప్రత్యేక ప్రయత్నము అక్కర లేదు. అట్టి ప్రయత్నమును, శ్రమను విడువుము. నీ ఇష్టము వచ్చినట్లు చేయుము. తోచినట్లు తలంపుము. లేదా నిశ్చలముగా కూర్చొండి నిర్వ్యాపారముగా ఉండుము. ఏమి చేసినను ఒక్కటే! ఏలయనగా అద్వితీయుడైన భగవంతునియందే నీ యునికి.

... ఓమ్ ...

# శరీరమనెడి పంజరమునుండి వెలుపలికి రమ్ము

* తే. కుశలమయి, చీకు చీఁకటి కోణమైన
రక్తమాంస పంజర శరీరమ్మునందు
స్వేచ్ఛ లేకుండఁ దలచెఁద వెంతవరకు?
నిగళముల త్రెంచుకొని పైకి నెగుర వలదె!

* ఆ. దేహబద్ధ శోక తీవ్రవేదన తోడ
నైక్యమేల నీవు నందవలయు?
తనువు నిత్యమన్న తలఁపు దుఃఖపునిధి,
భౌమము బృహదాత్మ భావమూను.

ఈ చిన్న అంధకారమయమగు చెరసాలవంటి రక్తమాంసములతో కూడిన శరీరము అనగా ఈ భౌతిక శరీరమునందు శాశ్వతముగా నిర్బంధింపబడుటకు నీవు ఇష్టపడుదువా? స్వేచ్ఛ నపేక్షింపవా? ఆనందమను ఆకాశమున ఎట్టి యాటంకములు లేక స్వేచ్ఛగా విహరింపగోరవా? అట్లయినచో వెలుపలికి రమ్ము. నీవు అనంత స్వరూపునితో తాదాత్మ్యము నొందుము. భౌతికమైన పరిమిత సౌఖ్యములు నీకు అపరిమితమైన ఆనందము నెట్లు యిచ్చును? నిన్నావరించియున్న వ్యష్టియైన అహంకారమును భేదించుకొని సమిష్టి చైతన్యము పొందుము. శరీరము, సుఖదుఃఖములను నీవేయని ఏల భావించుకొనెదవు. దేహాత్మ బుద్ధియే దుఃఖములన్నిటికిని మూలకారణము. ఇట్టి జడదేహమును అంటిపెట్టుకొని యుండకుము, నీవు విశ్వవ్యాప్తుడవని గ్రహింపుము. నీవే బృహత్, నీవే భౌమవు.

... ఓమ్ ...

# ప్రపంచమంతయు ఒక భ్రాంతి

*　ఆ.　బంధమోక్షణములు బహుదుఃఖ సంగతుల్
కల్పితమ్ము లూహ కలన చేసి;
నిర్వికల్ప బ్రహ్మ నిజమైన దొక్కటి
శిష్టమెల్ల మిథ్య కష్ట వితతి.

బంధమోక్షములు మనః కల్పితములు. ఉన్నతియందు బంధువెక్కడ? స్వేచ్ఛ యెక్కడ? సర్వమానందమై యుండ నిన్ను బాధించుటకు చెడుగు, క్లేశము బాధయనునవెక్కడగలవు? ప్రపంచములో గల కష్టములు, లౌకిక చింతలు–శారీరక తాపములను గూర్చి యనుచుంటివా! అవి ఎక్కడ నున్నవి. నీ యంతట నీవు సృష్టించుకొనిన కల్పనలు కావా! బంధమోక్షములు – మంచి చెడ్డలు – దేహ జగత్తులు – అన్నియు నూహాకల్పితములే? పరస్పర విరుద్ధములగు నీ ద్వంద్వములలో విహరించుట మనో లక్షణము. అవన్నియు అసత్యములు. భావములకు అతీతమైన అన్నిటికిని మూలమైనదియే సత్యము. ఆ సత్యమే నీవు. అదియే నీ అంతరాత్మ. అది అగోచరము. మార్పు చెందనిది. నీ ఆత్మ సంస్థ యందే నిలచియుండుము.

... ఓమ్ ...

# శక్తి - త్రివిధము

* తే. పనులు త్రైగుణ్యమై యుండు; పనులయందు
నెవ్వఁడకర్మచూచు, నకర్మ నెవ్వఁడు కర్మఁ
గను, నతండు బాహ్యాంతరాఖండ శాంతి
నొందు; తత్థితి చైతన్య మొసఁగుచుండు.

సోమరిగానుండకుము, ఉపయోగమగు పనిని చేయుచుండుము. చురుకుగా నుండుమని అన్నివైపుల నుండి నీకు చెప్పుచుందురు. నీవు చురుకుదనము శక్తి గలిగి యుండవలెను. కాని అది ఎట్టి చురుకుదనము? ఎట్టి శక్తి? అది ఆధునిక యంత్ర యుగమునందలి అతిసందడిగా యుండునట్టి చురుకుదనము లేక చిరుతపులి, అడవి మనుష్యునివలె మొదట మెల్లగా నుండి పిదప చటాలున ఉరుకునట్టి చురుకుదనమా? రెండును కాదు. ఏలయనగా మొదటిది రాజసము, రెండవది తామసము. నిశ్చలము, ప్రశాంతమైనట్టి శక్తినే నీవు సాధింపవలెను.

"కర్మ ణ్య కర్మ యః పశ్యేత్ అకర్మణి చ కర్మయః"

నీవు సదా స్వచ్ఛమైన అంతః శ్శాంతిలో నిమగ్నమై యుండవలెను. చురుకుగా కూడ ఉండవలయును. గాని నీ "అహం" కొఱకు గాదు! దైవములో నుండియు, దైవము కొఱకు నీవు పాటు పడుచుండవలయును. ఆ భగవంతుని నుండియే నీ శక్తి ఉత్పన్నమగుచున్నది.

... ఓమ్ ...

# ఆత్మ సర్వసాక్షి

*   తే.   సర్వకర్మల కధ్యక్ష సాక్షి బ్రహ్మ;
"తస్య భాసా విభాతి - ఇదం జగత్తు"
పొందు మతని శరణు; శబ్దముల సమర్థ
ముల్ తలంపు చాల దతని మూర్తి పొగడ !

నీవేపనినైనను చేయునపుడు నీవే దానిని చేయుచున్నావని తలంచుచున్నావా? నీవు ఒక భావము నాలోచించినచో నీవే దాని కర్తవని నమ్ముచున్నావా? నీవు నిద్రించునపుడు నీవేనా నిద్రపోవునది? కాదు. ఈ కార్యములకంతకును కారకుడు దేవుఁడు. అనగా ఈ కర్మలకు యజమాని (కర్మాధ్యక్షుడు). అతడు లేనిది ఇసుమంతయు గాలి వీవదు. నిప్పు రగులదు. సూర్యుడు ప్రకాశింపడు. "తస్య భాసా సర్వ మిదం విభాతి" నీవాలోచించునపుడు ఆయనే తలంచుచున్నాడు. నీవు పని చేయునపుడు ఆయనే చేయుచున్నాడు. కావున ఆ పరమాత్మను ధ్యానించి ఆయనలోనే లీనమగుము. ఆయనకు వాక్కునకును, తలంపునకును అతీతుడు. అయినచో అపుడు మానవుడు చేయవలసినదేమి ? ఏమియును లేదు. ఆయన నీవు సర్వార్పణము కావలెను. "ఏకం శరణం వ్రజ".

... ఓమ్ ...

# సూర్యులకు సూర్యుడగు దేవుని కిరణములే తలంపులు.

* తే. వచ్చు సూర్య కిరణ రాజి, భానుఁడేగ
నెందుపోవును; వానిలోనందు లయము;
ఉదధి కల్లోలములణంగు నుదధియందె
అట్లె యూహలన్నియు బ్రహ్మమందె పుట్టు

* తే. ఊహలకు పుట్టువతఁడు; తదూహలకును
దూరుఁడు నతండె, ఇనసముద్రుల విధాన
అన్నియు నతండు కాడు, వాడన్ని; అతని
"యోగమైశ్వర్యము" కనును యోగి యొకఁడె.

సూర్య భగవానుడు తన కాంతికిరణములను విరివిగా అన్నివైపులను ప్రసరింపజేయుచున్నాడు కాని ఆయన అస్తమించునపుడు ఆ కిరణములు ఏమగును? అవి ఆయనతో వెడలవా? సముద్రము ఎడతెగని తరంగములను సృష్టించును. అందులో ఒక అల అయినను సముద్రము నుండి వేరై నష్టపోవుచున్నదా? లేదు. తరంగములు సముద్రములోనే యుండి అలల రూపమున బయటకు కనిపించుచున్నవి. అట్లే తలంపులు, కర్మలు ఆత్మ నుండియే వెలువడుచున్నవి. కాని అందులోని ఒక్క తలంపుగాని, కర్మగాని ఆత్మకు వేరై ప్రత్యేకముగా నుండుటలేదు. వాని ఉత్పత్తి స్థానము ఆత్మయే. అది సదా ఆత్మలోనే యుండునుగాని కిరణములే సూర్యభగవానుడెట్లుకాడో, తరంగములే సాగరమెట్లుకాదో అట్లే తలంపులును, కర్మలును ఆత్మకానేరవు. ఆత్మ వ్యక్తము - అవ్యక్తము కూడ. అది రెండింటికిని అతీతమైనది. "పశ్య మే యోగమైశ్వర్యం".

... ఓమ్ ...

# భగవంతుని గురించి మఱపు యుండదు

*    తే.    ఆత్మకును నాత్మ సర్వస్వమైన వాని
విస్మరణకూడఁ దద్భ్రహ్మ సంస్మరణమె;
వలదు పొమ్మన్న నీయింటి పజ్జవిడఁడు;
అతని మరచితి నన్మాట మరచిపొమ్ము.

నా ప్రాణమునకు ప్రాణమై, యాత్మకు నాత్మయగు భగవంతుని నేను మఱువగలనా? కాని నేనాయనను మఱుచుచున్నాను. అయినను నా మఱపునందైనను, నేను ఆయనను జ్ఞప్తియందుంచుకొనుట లేదా? నేనాయనకు ఉపచారములు జరిపినను జరుపకపోయినను, భగవంతుడు నా ఆత్మగుహయందు అనాహూతుడగు నతిథివలె వచ్చి కూర్చొనియుండలేదా? కావున నేను పరమాత్ముని మఱచిపోవుదునన్న తలంపును త్రోసివేయుదునుగాక!

... ఓమ్ ...

# వ్యక్తిగతమగు సమాధి స్వార్థపూరితము.

* తే. దైవచింతా దరిద్రులై తాండవించు
తోడబుట్టువులన్ వీడి దూరమేగి
యీ వొకండవే స్వార్థ పరైక బుద్ధి
జప సమాధులనుంట నసదు గ్రహింపు.

నీవు ఏకాంతమున నమాధిలోనికి వెళ్ళి బ్రహ్మానందము ననుభవింపగోరుచున్నావా? సన్యాసివి కాగోరుచున్నావా? సమాధియొక్క ఆనందమంతయు నీ కొఱకే దాచిపెట్టబడినదా? అంధకారమందుండిన కోటాను, కోట్ల మంది నీ సోదర సోదరీమణులనుకూడ నీవెంట తీసుకొనిపోయి తరింపజేయ గోరుట లేదా? ఎందరో ప్రాణాధారమగు భోజన ద్రవ్యములు లేక ఆకలి దప్పికలతో తపించుచుండ నే నొక్కడనే దివ్యానుభవము అను భోజన ద్రవ్యమునంతను అనుభవింతునా? నీ సమాధి అందరి శ్రేయస్సు కొఱకును ఉపయోగింపుము.

... ఓమ్ ...

# శ్వాస - జీవసూత్రము

*  తే.  అఖిలజీవి మాలికను రుద్రాక్ష వ్యక్తి;
సూత్ర సంబద్ధమీ జీవయాత్ర గణన,
వ్యక్తి మాలాను సంధాన భవ్యసూత్ర
మా పరంధామ; నిలుపు తద్ధ్యానమెదను.

మానవుడొక పూస. ఈ పూస లసంఖ్యాకములు. కాని పూసలనన్నిటిని దండగ గ్రుచ్చు సూత్రము మాత్రము ఒక్కటియే! ఆద్యంతములు పరిమిత ప్రమాణులగు జీవులు అపరిమితుడగు సూత్రాత్మయందు దండగా గూర్చబడిరి. "సూత్రేమణి గణా ఇవ" పూసలయందు నీవు మగ్నము కావద్దు. ఈ పూసలకు ఆధారమగు దారమునుకూడ నీయందుంచుకొనుము. నీ దృష్టిని సూత్రమునందు నిలుపుము.

... ఓమ్ ...

# పూర్ణత్వమునకు కలుపదగినది ఏదియు లేదు. అందుండి తీసివేయగలిగినదియు లేదు.

*  తే. సర్వము సమగ్ర మేను నిస్సారబుద్ధి
ఏల కన్మూసి, తెరచి, జపింపవలయు;
అదియె, "పూర్ణమదః పూర్ణమిదమనంగ"
నుపనిషత్తు; తెలిసికొను ముచితమీవె!

కొన్ని క్షణములందు పూర్తిగా సంపూర్ణ స్థితిని అనుభవింతును. ఈ క్షణము అట్టిదే! నేను కండ్లు మూసికొని ధ్యానింపదలపలేదు. దానివలన నేను ఏమి పొందగలను? నేను కండ్లు తెఱచి బాహ్య సౌందర్యమును చూడగోరుట లేదు. అందువలన నాకేమి లాభము? ప్రతి వస్తువు ఏ లోటును లేక పూర్తిగా నున్నది. నేను కోరవలసినదేదియు లేదు. దేనికొఱకును నేను కృషి చేయనవసరము లేదు. ఇంతకు పూర్వమును, ఇప్పుడును ఇకముందు కూడను నేను సంపూర్ణుడనే. నేనీ సంపూర్ణతను గమనింపక, మౌనము దాల్చియున్నను, నేనేదైనను నష్టపోదునా? ఏమియును లేదు. శిల పాడుపడిపోయినచో దాని కాఠిన్యము కోల్పోవునా? గులాబి పుష్పము ఏ కృషి చేయకపోయినను దాని పరిమళమును, సౌందర్యమును పోగొట్టుకొనునా? మన యత్నములచేత ఒక వస్తువు యొక్క సంపూర్ణతకు హెచ్చు తగ్గులను గూర్పజాలము.

పూర్ణమదః పూర్ణమిదం - పూర్ణాత్పూర్ణ ముదుచ్యతే
పూర్ణస్య పూర్ణ మాదాయ - పూర్ణమే వావ శిష్యతే.

నీవు శాశ్వతముగానే కొఱత లేని సంపూర్ణుడవని గ్రహింపుము. పిమ్మట నీవు ఏదైనను చేయవచ్చును, మానవచ్చును.

... ఓమ్ ...

# పవిత్రమగు శ్వాస అహంకారమును నశింపజేయును

* తే. 'అహము' మూలము, లోభ మోహాద్యనర్థ
జాలమున కదియె నశింప శాంతి కలుగ;
'సోహ' ముచ్ఛ్వాస నిశ్వాసమందు నిలుపు;
'మహము' చచ్చును; సంక్షోభ మణఁగు నీకు.

అహంకారమే అన్ని అనర్థములకును మూలకారణము. దానినుండియే కామము, మోహము, అత్యాశ, క్రోధము కలుగును. అహంకారమున్నంతవరకు జీవునకు శాంతి లేదు, అహంకారమును నిర్మూలనము చేసినగాని శాంతియుండదు. అహంకారమునెట్లు నాశనము చేయుట? నీవు అనంతమగు దైవముతో తాదాత్మ్యమును పొందుము. నీవే అది అని తెలుసుకొనుము. "సోహం" లేక "అదియే నేను" అను సత్యమునే ఏకాగ్ర చిత్తముతో ధ్యానింపుము. సోహమే అస్థిరత్వమును, మార్పును నశింపజేయును.

... ఓమ్ ...

## కొన్ని పనులను నీవే స్వయముగా చేసికొనవలెను.

* తే. ఒకరు వ్రాసినవే మఱియొకరు చెప్పి
నట్టివే, నీవును వచింప నవసరంబె ?
శంకరుని శక్తి నీయందు సంగతమ్ము;
హృచ్చలిత భావముల నుచ్చరింపవలె ?

నా వ్రాతబల్ల అన్నివిధములైన వస్తువులతో నిండియున్నది; అన్నిరకముల పుస్తకములు, నిఘంటువులు, కలములు, కాగితములు దానిపై నున్నవి. ఏమైనను వ్రాయవలయుననిన, నేనీ పుస్తకములపై ఆధారపడవచ్చునా? ఈ పుస్తకములపైననే ఆధారపడి నేను వ్రాసిన యెడల ఆ గ్రంధకర్తలే వ్రాసిన వారగుదురు. అది నా వ్రాతయు నా సందేశమును నెట్లగును? నీవేదైనను చెప్పదలచుకొనిన యెడల నీ అంతరాత్మ నుండి సూటిగా చెప్పుము. నీవేది చేసినను, తలంచినను, చెప్పినను, అది స్వేచ్ఛాపూర్వకమైన నీ అంతరాత్మ యిచ్చు వెలుగువలె నుండవలెను. బాహ్య వస్తువులపైన ఆధారపడవద్దు. ప్లేటోయును? కాంటును ఏది తలంచిరో ఏది చెప్పిరో, వ్యాస వాల్మీకులును ఏమి ప్రవచించిరో ఆ సర్వమును నీలోగూడ నున్నవి. వాని నరికట్టకుము. ప్రవహింపనిమ్ము. మలినములను, పాపములను క్షాళిత మొనర్పుము.

... ఓమ్ ...

# ఏకైక విశ్వశక్తి

*  తే.  శక్తి జనకముల్ పెక్కు విశ్వంబునందు
కాని తచ్ఛక్తి మూలకమైన దొకటి !
మార్పు చెందదు పరిమితి మాసిపోదు
తెలిసి తద్ధ్యానమున నీవు మెలంగవలదె !

శక్తికి మూలములు అనేకములుగా కనపడవచ్చును. సూర్యుడు జలపాతములు, సముద్రము, విద్యుచ్ఛక్తి మొదలగునవి. అయితే చిట్టచివరకు వీని నన్నిటిని శక్తి యుతములుగ చేయునది ఒక్కటియే. సర్వశక్తి. ఆ శక్తియే నయాగరా జలపాతములోను, సముద్రములోను ఉండునది. ఆ శక్తియే నన్నీవిధముగా వ్రాయించుచున్నది. దానియొక్క సహాయము అనుమతిలేనిదే ఏదియు జరుగనేరదు. నీవు తలంచునపుడును, ప్రణాళిక నిర్మించునపుడును తత్ అనునదియే నీలోతలంచునది, ఆ ప్రణాళికలను పన్నునది. కావున బాధపడుటగాని, విచారించుటగాని ఏమియు అవసరము లేదు. వ్యాపార నిర్వ్యాపారములందు, ఆటుపోటులందు, సుఖదుఃఖములందు ఆరోగ్యానారోగ్యములందును "ఆ విశ్వశక్తిని" గుర్తింపుము. నీవు మార్పులమధ్య మార్పులేని దానిని తెలిసికొనినప్పుడే, శాంతియును సమిష్టి సంతోషమును పొందగలవు. సర్వలోక సామాన్యమైన ఆనందమును గాంతువు

... ఓమ్ ...

# ఆత్మ ఆలోచనకతీతమైనది

*    తే.    'ఆత్మ' శక్యనూహ్యమ్ము ప్రత్యక్షమెందు;
ధ్యాన జప హోమములకునై వ్యవధి లేమి
చింత నీవేల పొంద; తచ్చిత్స్వరూప
మెల్ల వేళల నీలోన నుల్లసిల్లు.

నీకు ప్రార్థించుటకును, ధ్యానించుటకును సమయము దొరకుటలేదని చింతించుచుందువా? ఎంతయో తలంచవలెననియు, ఎన్నియో పనులు చేయవలెననియు బాధపడుచుందువా? నీవు తలంచునపుడును, ఏదైనను చేయునపుడును, తలంచునది చేయునది ఏది? నీలో పనిచేయునది భగవత్తత్త్వము కాదా? అంతమాత్రమున నీకు న్యూనత ఎట్లు కలుగును? అట్లు కాకున్న నీకు ఆధిక్యతకలుగునా? సముద్ర తరంగములు నూరు అడుగులు ఎత్తు లేచినను, లేవకపోయినను, అది అంతయు మహాసముద్రమే కదా! ఈ ప్రకారముగానే నీవు గుడిలో ప్రార్థన చేయుచున్నను, ఆఫీసులో పనిచేయుచున్నను ఒకటియే కదా! భగవంతుడే సదా నీలోను, నీ ద్వారా పనిచేయుచున్నాడు.

... ఓమ్ ...

# వేయి మైళ్ళ ప్రయాణమైనను మొదటి అడుగుతోనే ప్రారంభమగును

* తే. అర్హ కాలాన వచ్చు యోగ్యతనుబట్టి
సర్వ సుగుణౌఘములు వ్యక్తి శక్తి కొలది
దివ్య భగవద్విభవమన్ని దిశల గలదు;
వలయు విశ్వాస మెద భగవానునందు.

వేయి మైళ్ళ ప్రయాణముకూడ మొదటి అడుగుతోనే ప్రారంభమగును. ఈనాడు హఠాత్తుగా ఒక డాలరు బిల్లు నాకు లభ్యమైనది. దీనితో గొప్ప ఐశ్వర్యవంతుడ నైనట్ల నిపించుచున్నది. కోటి డాలర్లు కూడను ఒక డాలరుతోనేకదా ఆరంభమగును? అట్టి ఒక డాలరు ఇప్పుడు నావద్ద నున్నది. నాకు లభించినది నేనుపయోగించి నట్లయిన అదియే వృద్ధియగును. నాకవసరమైనదంతయు దీనికి సకాలమునందు చేరుచునే యుండును. శక్తి సామర్థ్యముల నుపయోగించవలెనేగాని యణచివేయరాదు. అపరిమితమైన దైవత్వము మనలందరి నావరించియున్నది. అజ్ఞాతమయిన సంపత్తు మన చుట్టును కలదు. దైవకృపయందు పూర్తియగు నమ్మకమె మనకు ఉండవలసినది. మనకు అవసరమైనదంతయు సకాలమున అనుగ్రహింపబడును. భగవంతునిపై ఆధారపడుట మనము నేర్చుకొందముగాక?

... ఓమ్ ...

# చిట్టచివరకు సహజసమాధి భగవత్సాక్షాత్కారము.

*    తే.    భగవదేక చిత్తమునఁ దా పరిధ విల్లు
ఈ సహజ సమాధిస్థితి యెట్టి దగునొ!

*    తే.    కలహముండదు; విషయానుగుణము లేదు;
యోగ ముపవాస దీక్ష వియోగ భయము
సర్వము నశించు; స్వాతంత్ర్య సరణి కలుగు;
భగవదారూఢ బుద్ధి సంభవమునందు.

చిట్టచివరకు సహజ సమాధి. అది శాశ్వతము కాకపోవచ్చును. ఏల? అది అనిత్యమా? లేక క్షణభంగురమా? వచ్చుచు పోవుచుండునట్టిది గాక శాశ్వతముగా నుండు స్థితి ధన్యమైనది కాదా? సమాధిలో వైషమ్యములన్నియు నశించును. అట్టి వ్యక్తికి వాటి ప్రసక్తి ఉండదు. అన్ని విషయములనుండియు విముక్తుడగును. విద్యుక్త ధర్మములు అంతర్ధానమగును. అటువంటి వ్యక్తి స్వతంత్రముగా ఎండిన ఆకువలె తేలికగను, బాధ్యతలేనివానిగను ఉండును. అతడు ఎండు కొబ్బరికాయ నుండి వేరుపడిన కురిడీ వలె అన్ని విషయములకు దూరమగును.

... ఓమ్ ...

# ఆత్మ ఒక మహాసముద్రము

* తే. ఆత్మ జలనిధి; నిరవద్యమైతనర్చు;
అందొక తరంగ మీజగమందు జీవి
నీటిబొట్టు; సర్వము భ్రాంతి - "నేనొనర్చు
చుంటి; ఇది నా శరీరమై యొసఁగు" ననుట.

* తే. బిందువు తరంగ భాగము; పెల్లుబుకు కె
రట మనంతాబ్ధి భాగము; ప్రతికణమ్ము
తత్స్వరూపైక దేశము; తత్త్వమరయ
లేదు కణమొకందు పృథక్కరించి చూప.

నేను (ఆత్మ) అనునది ఒక సముద్రమువంటిది. పూర్ణమైన సత్యమనెడి మహాసముద్రములో ఈ ప్రపంచము ఒక చిన్న తరంగమువంటిది. ప్రతి జీవియు ఆ తరంగములో ఒక చిన్న బిందువు. సామాన్య మానవుడు పనిచేయునపుడును, తలంచునపుడును, బిందువువంటి ఈ శరీరమే చేయుచున్నట్లు భ్రమించును. కాని జ్ఞానికి ఈ బిందువు అలలో ఒక భాగము మాత్రమనియు, ఈ అల సముద్రములో ఒక భాగము మాత్రము అనియు తెలియును. ప్రతి బిందువు ఎంత అల్పమైనను సంపూర్ణమైన సాగరముకంటె భిన్నమా? తన గుండె యొక్క ప్రతిస్పందనమును జ్ఞాని విశ్వస్పందనముగ భావించును. తన ప్రతి ఆలోచనను, పనిని, విశ్వమంతకు జెందు కర్మగా చూచును.

... ఓమ్ ...

# అవిభక్తమైన శ్వాస

*  తే.  ఇంద్రియమ్ములు ద్వారముల్; ఈక్షణ శ్ర
వణ రసా స్వాదనంపు వ్యాపారమెల్ల
జరుగునది యాత్మచే సర్వసాక్షిచేత
భ్రాంతి "నేనే" కర్తననుచు పల్కుచుంట.

నేను చూచునప్పుడు కన్నేనా చూచునది? నేను వినుచునప్పుడు చెవియేనా వినునది? నేను తినునప్పుడు నాలుకయేనా రుచిచూచునది? ఆ కార్యముల నాత్మయే గావించును. చూచునట్టిదియు, వినునట్టిదియు, రుచిచూచునట్టిదియునగు నాత్మ నాలోనున్నది. అదియే నీలో నున్నది. అదియే విశ్వమందున్నది. నీ వ్యాపార నిర్వ్యాపారతా దశలయందీ విశ్వసాక్షిని జ్ఞప్తియందుంచుకొనుము. అహంకారము మమకారములను మరచిపొమ్ము. శ్వాస, వాక్కు, దృష్టి, స్పర్శ, శబ్దము వీని అన్నిటి యొక్క మూలమగు ఆత్మను సదా జ్ఞప్తియందుంచుకొనుము. మనము చేయు ప్రతి కార్యమందును పరమాత్మయే స్వయం వ్యక్తమగుచుండును. ఆ సత్పదార్థమే ఈ ప్రపంచ వస్తువుల రూపమున సఫలమగుచున్నది.

... ఓమ్ ...

# అగాధము నుండి నూతన శక్తి

*  తే.  అంధకార తమో ధ్వాంతమందు నుండి
జ్యోతి యుదయించు జ్ఞాన సంస్ఫోరకమ్ము
కారు మొయిళులు లేని యాకాశమేది
ముండ్లు లేని గులాబుల మొక్కయేది?

*  తే.  కష్టసుఖ మిశ్రమైనదీ కాయ జన్మ
ఆటుపోటులు కల్గు; లక్ష్యంబుచెడక
విఘ్నముల త్రోసి రాజని పెనగవలయు
దృఢ మనస్కత; సిద్ధి సిద్ధించు నిజము.

లోతులయందు నూతన శక్తి
చీకటియందు నూతన తేజస్సు
నిశీథమునందుకూడను మార్గమందే యున్నాము.

"అబ్రహామ్ లింకన్" ప్రవచించిన యీ వాక్కులందలి భావము ఉత్సాహపరుచుచున్నది. మనమీ శరీరములో నున్నంత కాలము ఏదో యొక కష్టము ఉండును. అది తప్పదు. మేఘములు లేని ఆకాశమును, ముండ్లు లేని గులాబి పుష్పమును చూపుము. అట్లే శోధనలు, బాధలు లేని జీవితము లేదు. జీవితము బాధలు, కష్టముల ద్వారా గమ్యస్థానమునకు నిశ్శబ్దముగా, నిదానముగా క్రమేణ నడచు విధానము మార్గమధ్యమునగల ముండ్లను, రాళ్ళను, గోతులను, బంధములను లక్ష్యపెట్టవద్దు. నీ దృష్టిని, శ్రద్ధను గమ్యస్థానమందు స్థిరపరపుము. ఎన్ని అడ్డంకులయినను గమ్యస్థానమును జేరనున్న నిన్ను ఆటంకపరుపజాలవని మనసు నందుంచుకొనుము. నీవు దృఢ సంకల్పుడవైన యెడల ఆ గమ్యస్థానము నీకు విధిగా లభించును.

... ఓమ్ ...

# అహంకారము

* తే. "అహము" చెడ్డది; చంపశక్యము గాదు;
గుప్తమై యుండియు, పొడుచుకొనుచు వచ్చు;
వానపడినంత మొల్కలు వచ్చినట్లు.

* తే. స్వీయదోష పర్వతముల చిన్నపరచి
అన్యదోష లేశంబుల నధిక పరచు;
"అహము" తొలఁగిన నాఁడె మహత్వముఁ
పూర్ణశాంతి; యహంకృతి, పునుగువద్ద

అహంకారమును పెల్లగించుకొనుట కష్టతరమైన పని. అది లేనట్లే తరచుగా కనిపించును. కాని సమయము వచ్చినప్పుడు, వేసవియంతయు భూమిలోనే యుండి వర్షములు కురియగనే మొలచు కొన్ని విత్తనములవలె, అహంకారము కూడ పైకి వెల్లడియగును. ఈ అహంకారము తన లోపములను కప్పిపుచ్చి ఇతరులయందలి దోషములను వెదకుచు బయలుదేరును. అది తనలోనున్న కొండవంటి దోషములను గమనింపక, ఇతరులలోనున్న చిన్న నలుసులను చూచును. నీవు యదార్థమగు శాంతిని కోరెదవేని అహంకారమును పూర్తిగా త్యజింపుము.

... ఓమ్ ...

# ప్రపంచమంతయు బ్రహ్మమే

*   తే.   బ్రహ్మమే సర్వము; జగము బ్రహ్మమదియ
సాక్షికాని రూపమ్ము విశ్వమున లేదు;
క్రూరునందు నికృష్టైక ఘోరకర్మ
నందు; పుణ్యునందు, సుజనునందు, నొక్క
డే పరబ్రహ్మ మా, జ్ఞానమే గుణంబు.

ఇదంతయు బ్రహ్మమే. ప్రపంచమంతయు భగవంతుడే మనము చూచునదంతయు పరమాత్ముని వ్యక్తరూపము. మన జ్ఞానమున కతీతమైన శాంతియుత, సమస్త జీవులను, వస్తువులను, ఏకాత్మ భావముతో చూచు అరుదగు మహాత్ములకే చెందును. వికార రూపులయందును, పాపులయందును భయంకరాకారులయందును, క్రూరులయందును, భగవంతునిగాంచుట కష్టతరము. అయినను భగవంతుడు సుందరులయందును, ఘనమైన బుద్ధిగలవారియందును, పవిత్ర హృదయులయందును, యున్నట్లే దుష్టులయందును, మరణించినవారియందును, పునరుద్ధరణ పొందినవారి యందును అద్వితీయుడగు భగవంతుని చూడగలుగుటయే మిగుల ఉచ్ఛస్థితి.

... ఓమ్ ...

# అష్టావక్రగీత : జ్ఞానమే నీవు

* తే. నీవు కాదు శరీరము; నీదెయో
రీరమును కాదు; సార్వకాలికపు సాక్షి
నీవు; చిద్ఘనం బీవు; తద్ధేతువునను
ముక్తుండవయి సుఖంబుండు మోదమలర!"

* తే. ఇది యుపనిషదర్థనిచిత; మిదియెగీత
వ్రాసె దీని నష్టావక్ర పరమహంస.

కొన్ని సంవత్సరముల నుండి బ్రహ్మ ముహూర్తమున నిద్రనుండి లేచి అష్టావక్రగీతను పఠించుటతో దినచర్య ప్రారంభించుట నా యభ్యాసమైయున్నది. "నీవు శరీరము కావు. శరీరము నీదియు కాదు. నీవు శుద్ధ చైతన్యమవు సర్వసాక్షివి కావున స్వేచ్ఛగాను, ఆనందముగాను ఉండుము." అను శ్లోకమును నిన్న ఉదయమే చదివితిని. అది ఎంత అద్భుతమైన భావన! కాని దానినవలంబించుట ఎంత కష్టతరము! విచారమైనను, సంతోషమైనను, సంపదయైనను, దారిద్ర్యమైనను, ఆరోగ్యమైనను, అనారోగ్యమైనను ఈ దశలనన్నింటికి దూరముగా నుండ సాక్షివలె మాత్రము చూచుచుండుమని అష్టావక్రుడు నుడువుచున్నాడు. ఏది ఎట్లు జరిగినను, ప్రకృతిలోనే ప్రకృతి మార్గముగానే, ప్రకృతివలననే జరుగుచున్నది. నేను శాశ్వత ద్రష్టను-సర్వసాక్షిని. నాకీ ప్రకృతితో నేమి సంబంధము కలదు? ఈనాడు నేను అష్టావక్ర గీతను చదువలేదు. దాని నికమీదట యేల చదువవలెను? సత్యమంతయు పైనుదహరింపబడిన శ్లోకములోనే యిమిడియున్నది. ఆ సత్యమునే ఆచరణలో నుంచిన చాలును.

... ఓమ్ ...

# క్లిష్ట పరిస్థితులలో గూడ నీవు ఆత్మవే

* తే. క్షణము సూర్యునాచ్ఛాదించు ఘన చయంబు
సర్వతేజః ప్రపూర్ణ భాస్కరుఁడ వీవు,
జ్ఞానపుంజము చీఁకట్లు సదలి వీఁగు
నీవు భాసించెదవుగ; నిర్నిద్ర కాంతి

నీవు విచారముగానున్నావా? నీ నమ్మకము, ప్రేమ, తగని తావున? నీ కరుణ ఆతిధ్యము దుర్వినియోగమైనవా? నీ పైని అసత్యములుంచితివా? నేరారోపణలు, దూషణలు మోపబడినవా? విచారింతుము. సమస్తమును అనుకూలముగా నున్నపుడు, ప్రతి వ్యక్తియు ఉల్లాసముగను తృప్తిగను ఉండగలుగును. దుఃఖమును జయించి తట్టుకొనువాడే ధీరుడు, నీవే ఆత్మవు. తేజోమయమైన సూర్యుడవు. నీవు ఈ జడమగు శరీరమవు కావు. మేఘములు సూర్య భగవానునెట్లు కప్పునో, అట్లే కష్టములను, విచారములను వాటి నీడలను నీపై వేయవచ్చును. సూర్యభగవానుని అమిత ప్రకాశవంతమైన తేజస్సునందు ఎంత దట్టమైన మేఘములు కూడ దాటిపోవుచు అదృశ్యమైపోవును.

... ఓమ్ ...

# నీవే ఆత్మవు మాధుర్యముగ నుండుము

* తే. పరహితం బీవుచేసి తాపమ్ము నొంద
వలదు; ఇనుపకాళుల త్రొక్కఁబడియునైన
గరువపోతులు, క్రూరులు, కఠినులు కడు
బాధవెట్టగ నిమ్మనివారితముగ
ప్రేమ, వాత్సల్యములను వర్షింపు మీవు!

* తే. విరిగులాబీల పోలిక విరుగ కొట్టి
త్రొక్కఁబడికూడ వాసన మొక్కవోక
మధురముగ జిమ్ము విధము, సన్మాన్యముగను,
సాధు పతనమ్ము చూడ నుచ్చంబుకొఱకు.

మంచి చేసితినని యెన్నడును పశ్చాత్తాపపడవలదు; నీ కపకారము జరిగి యుండవచ్చును. దెబ్బలు తగిలి యుండవచ్చును. నీవు నిర్దయగా ఇనుప మడమల జోళ్ళతో తన్నబడి, త్రొక్కబడి యుండవచ్చును. అయినను సత్కర్మనే విడువక చేయుచుండుము. హింసింపబడినవారును, హీనదశకు వచ్చినవారును, ఉన్నత దశకు లేవనెత్తబడుదురు. గాన వారే ధన్యులు, గర్విష్టులు, అహంకారులు, అజ్ఞానులు, దుర్మార్గులు క్రూరముగ హాని చేయనిమ్ము, గాయపరచనిమ్ము, నిన్ను కనికరము లేకుండ అణగద్రొక్కనిమ్ము. కాని వారియందు నీ ప్రేమను, జీవితమును ప్రకాశమును వెదజల్లుట మానకుము. నలిపి త్రొక్కివేయబడినను పరిమళమునిచ్చు గులాబి పువ్వువలె నుండుము. అది పరిమళము నెట్లు యిచ్చుచుండునో అట్లే నీవును యుండవలెను. దానిని జ్ఞాపకముంచుకొనుము. నిజమునకు మంచి పని చేసి ఎవరును పశ్చాత్తాపపడనక్కరలేదు.

... ఓమ్ ...

# ఈ క్షణము

* తే. క్షణము వ్యర్థము చేయకు; ఘనము కాల
ధనము; చెడిన కూడదు; పట్టిదాచుకొమ్ము
ఎట్లు వినియోగమందువా! ఎల్లవేని
స్మరణకిమ్ము; త్వద్ధనము సన్మాన్యమొందు.

ప్రస్తుత క్షణమును వృథాచేయకుము. దానిలోనే ఉత్కృష్టమైన నీ సంపదగలదు. ప్రస్తుత క్షణమే నీకు అత్యుత్తమమైనది. కావున దానిని వ్యర్థపుచ్చక భద్రముగ వినియోగించుకొనుము. అయినచో దానిని ఎట్లు వినియోగింపగలవు? నీవు భగవంతుని శరణుజొచ్చి ఆయనతో తాదాత్మ్యమును పొందినయెడల ఈ క్షణమును పూర్తిగా ఉపయోగించినవాడవగుదువు.

... ఓమ్ ...

# ప్రేమయే దివ్యౌషధము

*　ఆ.　వ్యాధి అధి నింద బాధ ననుభవించి
విజయ మొంది సౌఖ్య విధముఁగఁటిః
కామ లోభ మోహ గుణము విడిచిపుచ్చి
వ్యాజ రహిత ప్రేమ వశత నుంటిః

*　తే.　శత్రువే లేఁడు; లేఁడసజ్జనుఁడు నెందు
నెల్ల వారీశ్వర ప్రతిమేధ్యతనులు
ఆత్మ రక్షణకై బాధ యణఁగి పోయె
స్వామి సాక్షాత్కరించు నే ప్రక్కజూడ.

నాకు భగవద్దర్శనము అయినది. భయంకరమగు మనో వేదనను, బాధను అనుభవించిన పిమ్మట నేను జయమును పొంది నాకు సాక్షాత్కారమైనదని చెప్పుటకు చాల సంతోషమైనది. ఇప్పుడీ శ్రమనంతను విడచుచున్నాను. నేనిక పొందవలసినది, కోరవలసినదేదియు లేదు. విశ్వ ప్రేమకు వశుడనగుచున్నాను. నాకు శత్రువుగాని, అపకారిగాని ఎవరును కాజాలరు. అందరును భగవంతుని ప్రతిమలె. ఇపుడు అంతయు ప్రేమ, సమృద్ధి, క్షమ, ద్వేషము, రాగము ఇకలేవు. ఏ వాదములతోను సమర్థించుకోనక్కర లేదు. సర్వము భగవంతుడే. కావున ప్రతిస్థలమునను భగవన్ముఖారవిందమునే చూచుచున్నాను. ప్రతి ముఖము నుండియు భగవంతుడు ప్రకాశించుచున్నాడు.

... ఓమ్ ...

# భగవంతుని మరచుట అసంభవము

* తే. ఏదియాచరించినను నూహించుచున్న
చూచుచున్న నిద్రించుచు సొక్కుచున్న
నే సమాధిలోనున్న ఈక్షింతు నతని
స్వామి విస్మరింపగ నసంభవము సుమ్ము

* తే. వలదు వలదను కొనుచున్న కొలఁది నాదు
చూపులతని రూపించు నే వైపుచూడ
నతని స్ఫూర్తి నన్ వలగొను; అతనిగూర్చి
పల్కు ప్రతి శబ్ద మహిమిక భావమూని,

ఎప్పుడును నే నాలోచించునదియు, చేయునదియు భగవంతునిగూర్చియే. కావున పరమాత్మునికి దూరముగా నేనెట్లుండగలను? నేను నిశ్చలముగానున్నను ఆయనయే. నేను కదలికతోను, సందడిగానున్నను ఆయనయే, నే నారోగ్యముగానున్నను అనారోగ్యుడనైనను ఆయనయే. అన్ని పరిశోధనలలోను, పరీక్షలలోను, సంకటములలోను ఆయనయే. ఆ పరమాత్మ నా నుండి దూరముగానున్న క్షణము లేదు. మరుగుగానున్న క్షణము లేదు. సుషుప్తావస్థలో, జాగ్రదవస్థలోను, స్వప్నావస్థలోను ఆయనయే, సమాధిలో కూడ ఆయనయే. ఎంత అద్భుతము! ప్రతిధ్వనియు ఆయననే తెలుపుచున్నది. ప్రతి దృశ్యము ఆయననే వివరించుచున్నది. ప్రతిదర్శనము ఆయననుండియే ఉదయించుచున్నది. నేను ఆయన మహిమతో నిండి ఆవరింపబడుట నా అదృష్టము.

... ఓమ్ ...

# పరాపర తత్త్వములు

*    తే.    మానవుని తత్త్వమే ద్వైత మార్గగామి
దైవతాసుర భావ పథాన్వితమ్ము
దైవభావము స్వర్గము, దైత్యభావ
మే నరకము; దైవ రతి కాంక్షింపవలయు.

మానవునియందు రెండు తత్త్వములు కలవు. అధమమైనది పశుతత్త్వము, ఉత్తమమైనది దైవతత్త్వము. ఈ రెండు తత్త్వములు మనుజుని తమవైపునకు త్రిప్పుకొనుటకై ఎడతెగని ప్రయత్నము చేయుచుండును. పశుతత్త్వము ఇంద్రియముల ద్వారా మనుజుని పతనమునకు లాగును. దైవతత్త్వము వివేకము ద్వారా మనుజుని ఉత్తమ ప్రాప్తికి దారిచూపును. ఉత్తమ తత్త్వము నంగీకరించి దానితో సహకరించుటయే జ్ఞానము.

... ఓమ్ ...

# దైవ సాన్నిధ్యము మరపున కతీతము

*	తే.	కొన్నివేళల దేవతా గుణము తోచి
కొన్నివేళల తన్మూర్తి కన్ను తొలఁగు
ఏల సాక్షాత్కరింపదో! యెల్లవేళ?

*	తే.	భక్తి భావనలోని లోపంబుగాని
అతని సుస్థితి కంతరాయంబు లేదు;
ఈవతనివీడి వేరు స్మరింప లేవు;
ఏల దేవురింపగ దైవమెచటి కేగు.

కొన్ని సమయములందు మనుజుడు భగవత్ సాన్నిధ్యము ననుభవించుచుండును. ఇతర సమయములయందు ఆ యనుభవముండదు. అందులకు కారణమేమి? మనుజుడు సదా ప్రతి క్షణమును భగవత్ సాన్నిధ్యము నేల అనుభవింపడు? ఈ అనుభవము కలుగుటయు కలుగకపోవుటకు చంచలమగు మానసిక భ్రాంతియే కారణము. దైవభావము జ్ఞాపకశక్తికిని, మరుపునకును అతీతమైనది. భగవత్ సాన్నిధ్యము ఎల్లప్పుడును ఉండునది. అది సర్వోత్కృష్టమైన సత్యము. అది యద్వితీయము. కాన నీవు దానిని మఱచిపోయి మరియొక దానిని జ్ఞాపకముంచుకొనలేవు. భగవంతుని సాన్నిధ్యమును జ్ఞప్తియందుంచుకొనలేదను భీతి ఎవరికిని అవసరము లేదు.

... ఓమ్ ...

# కేంద్రమును లోపలనే యుండనిమ్ము

* తే. సర్వనిగమోపనిషదర్థసార మెల్ల
నాల్క తుద నిల్పుకొన్న విజ్ఞానివైన
కొన్ని పట్ల నిరుత్సాహమెన్న కల్గు
ఆత్మ కేంద్రము నీకు పరాస్తమగును.

* తే. ఎల్లపుడు నీకు నానంద ముల్ల సిల్ల
ధ్యానమున నాత్మ కేంద్రము తత్పరతను
నిల్చి, బాహ్య కేంద్రమును విదల్చి నిల్వు,
శాంతి యలవడు సర్వ ప్రశాంతి యుతము.

అన్ని మతములయొక్కయు, అన్ని తత్త్వముల యొక్కయు సిద్ధాంతములను తెలిసికొనినను, విచారముతో కృంగిపోవు క్షణములను నీవు తప్పించుకొనలేవు. నీ గ్రహణ శక్తులు, భావములు ఆత్మలో స్థిరపడని కారణముచేత అటుల జరుగుచున్నది. నీకు తెలిసియో తెలియకయో నీ గ్రహణశక్తి కేంద్రమగు ఆత్మయందుండి వెలుపల పడినది. అది లోపల నుండి వెలుపలికి మారుటచేతనే ఈ నిరాధారత, తీవ్ర వేదన, బాధయు సంభవించుచున్నవి. నీవు శాశ్వతముగా ఆనందముతో నుండవలెననిన దానికి ఒకే మార్గము కలదు. నీవు ఆత్మలో లీనము కావలయును. ఆత్మలోనే నీ కేంద్రము స్థిరపడవలయును. కష్టసుఖములయందు ఆత్మనే దృఢముగా అంటిపెట్టుకొనుము. నిన్ను వెలుపల నుండి ఆకర్షింపగలిగినవి, ఎంత గొప్ప విషయములైనను, ఎంత గొప్ప మనుష్యులైనను, ఎంత గొప్ప వస్తువులైనను నీవు లొంగకుము. నిశ్చలమగు శాంతి ఆత్మలో కేంద్రమునందు బుద్ధి నిలుపుకొనువారికే కలుగును.

... ఓమ్ ...

# కారణము నీలోపలనే యున్నది

* తే. నీవు సుఖమున్న లోకమ్ము నిండు సుఖము
దుఃఖమున మున్గ జగమెల్ల దోచు తమముః
దుఃఖమును సుఖమును లోన తోచు నవియె
పదార్ధ కలన సంభవము కావు;

* తే. ఆత్మ హృత్కేంద్ర బాహిరమైన శక్తి
కొఱకు దేవురించిన మేలు కూడిరాదు
"సర్వమిచ్ఛా జనక" మను-సత్యమెఱిఁగి
ఎల్లవేళ సుఖమునే వహింపగలవు.

సూర్యుడు తన తేజస్సునెట్లు ప్రసరింపజేయునో అట్లే నీవును ఆనందముగను, ఉత్సాహముగను ఉన్న యెడల నీ యానందోత్సాహములను నీ చుట్టుప్రక్కల ప్రసరింపజేయుదువు. నీవు విచారముగను దైన్యముగను ఉన్న యెడల విష వృక్షము తన విషమును చుట్టును పంపునటుల, నీ విచారమును దైన్యమును వ్యాపింపజేయుదువు.

అయినచో నీ సంతోష విచారములు, బహిర్విషయముల ననుసరించి వచ్చినవి కావని తెలిసికొనుట కొంత తృప్తిగను, శాంతికరముగను ఉండును. నీ ఆనంద విచారములకును, ఆరోగ్యానారోగ్యములకును నీవే ముఖ్య కారణము. నీవు ఏ వెలుపలి శక్తినిగాని దేవతనుగాని ప్రార్థింపవలసిన అవసరము లేదు. నీవే ఆత్మ స్వరూపుడవనియు ద్వంద్వములకు, భావములకు అతీతుడవనియు, సమస్త విషయములు నీ యిచ్ఛా మాత్రములనియు తెలిసికొన్నజాలును. అందుచేత నీ ప్రతికూల సంకల్పములను అనుకూలములుగ మార్చి అన్ని పరిస్థితులయందును నీ యౌన్నత్యమునే నిలబెట్టుకొనుము.

... ఓమ్ ...

# సహజస్థితిలో నుండుము

* తే. కఠిన చాంద్రాయణాది దుష్కరనియతిని
నిత్రుపాసముల తపస్సు నెరపి; ఏల
యీ శరీరమునెల్ల బాధింపవలయు?
ప్రత్యణువులోన పరమాత్మ పరగుచుండ !

* తే. యోగముల సమాధులను శుష్కోపవాస
దీక్షలనెగాని మేల్కొని తిరిగిరాడె!
పూర్ణ నిశ్శబ్దమున స్వామి పొలుపుగనక
కంఠమెత్తియొఱు మొఱ పెట్టఁ గానఁగలమె!

* తే. అనునిమేష మా దివ్యుని యందెయునికి
సర్వ చైతన్యమతఁడు నైశ్శబ్దమతఁడు
కృచ్ఛ్ర చాంద్రాయణంబులు కృత్రిమములు
సహజమాతని తోడి వాసంబు మనకు

అప్పుడప్పుడు కఠినమైన తపశ్చర్యలతో నన్ను నేను బాధపెట్టు కొనుచుంటిని. కొన్ని సమయములయందు నాశరీరమును దయారహితముగ మిగుల కష్టపెట్టితిని; అపరిమిత బాధ్యతలను వహించితిని, అయిన ఇది అంతయు అవసరమేనా? భగవంతుడు లోపలను, వెలుపలను, శరీరమందు ప్రతిఅణువునందును ఆవరించి యున్నప్పుడు, నేను విరామములేని సాధనలతో ఏల బాధపడవలెను? నాకు సమాధి స్థితి, పరవశత సహజముగానే తటస్థించిన యెడల సరియే, లేని యెడల నేనెందులకు ఆ స్థితిని బలాత్కారముగా తెచ్చి పెట్టుకొనవలయును? భగవంతుడు సమాధియందువలెనే జాగ్రదవస్థయందు కూడా లేడా? భగవంతుని మౌనమునందు కనుగొనలేని యెడల శబ్దమునందు కనుగొనగలను. ఈశ్వర మహిమను ధ్యానమూలమున నేను వెలిబుచ్చ లేని యెడల క్రియారూపమునందు అట్లు చేయుదును. నేను భగవంతునిలోనే, ఆయన మూలముననే నడచుట, మాట్లాడుట, వ్రాయుట చేయుదును. అట్టి అవ్యక్తమగు ఆయననుండియే సమస్తము ప్రత్యక్షము వ్యక్తము అగుట జరుగుచున్నది. అది కర్మ అయినను, ధ్యానమైనను, రెండును ఒకటియే, అది మాత్రము సత్యము, విడదీయుటకు అలవికానట్లు నేను శాశ్వతముగా ఆ భగవంతునిలో ఐక్యము చెందియున్నాను.

... ఓమ్ ...

# ఇక మఱపునకు తావులేదు.

*  తే.  అతఁడు కానిది లేని కార్యంబునందు
అతని గూర్చిన విస్మృతి యనఁగ నెట్లు?
భ్రాంతికాని, యదార్థ సంభవము కాదు
మరచి పొమ్మతనిని నీవు మరచుటెల్ల.

భగవంతునిగాని లేక లోపలి తేజస్సునుగాని, క్షణములో కోటి సహస్రాంశమైనను మఱచినచో నాకెంతయు దైన్యముగను నిస్సహాయముగను, విచారముగను ఉండును. అయితే మఱపు అననేమి? జ్ఞాపక శక్తియు మఱపును భగవంతుని నుండియే కదా కలుగుచున్నవి? ఆ మహాతేజస్సు నా శరీరమంతటను, చొచ్చుకొనిపోయి విశ్వమంతను జ్ఞప్తియందుంచుకొనుటయు సాధ్యమైనపని కాదు. ఏలయనగా భగవంతుడు కానిది యేది? భగవంతుని మరచిపోవుటయను భావము కేవలము భ్రాంతియే. ఇక్కడ, అక్కడ, లోపల, వెలుపల, మీదను, క్రిందను అన్ని ప్రక్కలను ఉన్న సర్వవ్యాపకమగు తేజస్సును చూడుము. ఎటువైపు తిరిగినను నీవా తేజోమయ కిరణమునందే యున్నావు. నీవు చీకటిలో ఎన్నడును ఉండనేరవు. ఈ విషయము తెలిసికొని ఎల్లప్పుడును నిశ్చింతతో నుండుము. మఱపు అనెడి భ్రమచే మోసపోకుము.

... ఓమ్ ...

# దైవసాక్షాత్కారమైన లోకము.

* తే. ఆ పరంధాముఁడెన్నఁడో యవతరించు
నన్నమాట రవంత సహ్యంబుగాదు;
సర్వసాక్షి యహరహంబు సన్నిధిగన
సాక్షి భూతుఁడు కాదన్న సహజమగునె
జ్ఞాతముగనొ యజ్ఞాతముగానొ యతని
సన్నిధి కలుగు; గ్రహియింప శక్తివలయు.

భగవంతుడు ఎపుడో నాకడకు వచ్చునని నిరీక్షించుచునుండలేను. ఆ "భగవంతుడిప్పుడు నాలో లేడు. ఎప్పుడో మున్ముందు నాకడకు వచ్చును." అను భావములను భరింపలేను. ఆయనను పొందుటకు నేను ధ్యానమును కూడ చేయనవసరము లేదు. భగవంతుడు ఇప్పుడు నాలోను నా చుట్టును లేనియెడల ఆయన మరియెక్కడ నుండి వచ్చును? ఆ పరమాత్మ ఇచ్చటను అంతటను ఉన్నాడు. ఆయన శాశ్వతముగా నాతో ఐక్యమయ్యేయున్నాడు. నేను చేయవలసినదంతయు, సర్వత్ర వ్యాపించియున్న ఆయన దివ్యసాన్నిధ్యమును గుర్తించుట మాత్రమే! ఆయన సాన్నిధ్యముననే నేను ఉన్నట్లు నాకు తెలియకపోయినను నేనెల్లప్పుడును ఆయనలోనే యున్నాను.

... ఓమ్ ...

# భగవత్సాక్షాత్కారము ఇప్పుడే ఇక్కడనే

*	తే.	ఇచటనే, యిప్పుడే, యిందే యెల్లవేని
దివ్యసాక్షాత్కృతి ఘటిల్లు; తెల్విగనుము;
కన్నులరమోడ్చుకొదునేల - కన్ను తెరచి
అతఁడు నీకయి వెదకుట యరయు మీవు!
అతఁడు నిత్యుఁడు; సిద్ధుడునై చెలంగు.

భగవత్సాక్షాత్కారము ఇప్పుడే, ఇక్కడనే అనెదరా! అది శాశ్వతముగా పరిపూర్ణమైనట్టిది కాదా! స్థలమునకును, కాలమునకును వర్తించు మాటలు ఈ అత్యుత్తమ విషయముతో ఎట్టి సంబంధమైనను కలిగియుండునా? భగవంతుడు లేడనెడి కాలము ఒకటి యుండెనా? అట్టి సమయము ముందెన్నడైన నుండునా? భగవత్సాన్నిధ్యమునందు, భూత, భవిష్యత్, వర్తమాన కాలములలో, నేనెల్లప్పుడును, సంపూర్ణ భావముతోనే యుందును, భగవంతుడు శాశ్వతముగా నాచేత దర్శింపబడును. "నిత్యసిద్ధ" కండ్లుమూసికొని, ఆయనను నీ అంతర్యములో అన్వేషింప నవసరము లేదు. కన్నులు తెరచిచూడుము; ఆయన నీ ఎదుటనేగలడు, భగవంతుడు శాశ్వతముగా నీకొఱకే వెదకుచున్నాడు. కావున నీవు ఆయనకొఱకు నిరీక్షింప నవసరము లేదు.

... ఓమ్ ...

# ఆనందానుభవమే మతము

*     తే.     ఆత్మ యానందనిధి మహోహాస నిభము
ఆత్మ వేతృత మతము-బాహ్యవిధి కాదు;
ముక్కు మూసికొనుచు నొక్కమూల నణగి
నిండు పద్మాసనంబున నుండగాదు.

*     తే.     భగవదారూఢ సాన్నిధ్యపరతకాని
బ్రహ్మమానంద మానంద పరతబ్రహ్మ
క్రోధ మద మత్సరమ్ములు రూపుచెడిన
ఆత్మ పరమాత్మలోన సమైక్యమొందు
అదియె మతము; శాంతి; సమత్వమదియె సుమ్ము.

నా ఆత్మ జ్యోతిర్మయమై యున్నది. నేను ఆనందముతో ఉప్పొంగుచున్నాను. అవును, ఎందుకట్లు కాకూడదు? మతమే అనుభవము. ఈ అనుభవమే ఆనందము. మతమనునది యేదో మనస్సులో గొణుగుచు విచారము, దుఃఖముతో నిండిన ముఖముతో నుండుట కాదు. మతమనగా లోపలను, వెలుపలను ఉన్న భగవంతునికి ముఖాముఖిగ నుండుటయే. శోధనలు, ప్రయత్నములతో కూడిన ఈ ప్రపంచములో దైవత్వమును వెలిబుచ్చుటయే మతము.

"ఆనందో బ్రహ్మ". ఆనందమే భగవంతుడు. అహంకారమును సమూలముగ నాశనము చేసినచోటనే ఆయన యుండును. అహంకారము గర్వమును, కామమును, క్రోధమును పుట్టించును. అంతమును అనంతముతో ఏకీభావము చేసినయెడల గర్వము, కామము, క్రోధము నాశనమై హృదయములో ఆనందము, ఆత్మలో పరమశాంతిని కలిగించును.

... ఓమ్ ...

# విశ్రాంతి లేని బిడ్డ

* తే. చిరుతవాఁడు కాలహరణమ్ము సైపక
గింజనాటి మొక్కకై తపించు;
నేను కన్ను మూసి నిజము ధ్యానించుచు
ఇంత సొక్కి పల్కు లేర్చుకొందు:

* తే. పూర్ణపరమాత్మ దర్శనోద్భూతమైన
నిండుటానందమును బొందకుండ నేను
సగము రుచిచూచి సోదర జనము కొఱకు
కాంక్షచేయుదు నొక్క భాగం బొసంగ!

* తే. ఎండలో యాత్రమున నెద కుందుచుండ
నే నొకండనే లోభినై యెట్లు బ్రహ్మ
దర్శనోద్భూత మానంద ద్రష్టనగుదు:
ఇంత స్వార్థము నేను వహింపజాల.

నేను ఆటలలో నిమగ్నమైన విశ్రాంతి లేని చిన్న బిడ్డవంటివాడను. బిడ్డ విత్తనమును భూమిలో పాతిపెట్టి వెంటనే మరల త్రవ్వి మొక్క మొలకెత్తినదేమోయని చూచును. నేను దివ్యమైన అనుభూతిలో ధ్యానించి సమాధి స్థితిలో బ్రహ్మానందము ననుభవించుటకు కన్నులు మూసికొందును. కాని దివ్యానుభూతి కలిగిన వెనువెంటనే ఆధ్యాత్మిక శిఖరముల నుండి దిగి, అట్టి భావములను తగిన భాషతో వివరింపలేక అల్పమైన మాటలతో వ్రాయమొదలిడుదును. నేనాస్వాదించు ఫలముల రుచిని మీకందరకును అందచేయ కోరుచుందును. నేనా ఫలమును పూర్తిగా నాస్వాదించువరకు వేచియుండను. ఏమిచేయుదును? నాయనుభవమును మీతో పంచుకొనవలెనను తీవ్రమగు కోరిక నణచుకోలేని యసహాయ స్థితిలో నుంటిని. దినమంతయు ధ్యాన నిష్ఠతో దివ్యానుభూతిలో నుండుట నిస్సందేహముగా ఆనందముగనే యుండును. కాని నేను దానిని త్యజింతును. సంసార బాధలతో విసుగుచెందిన ముముక్షువులకు చాలమందికి నేను కొంతైనను వినియోగపడుదునుగాక!

... ఓమ్ ...

# అనేకత్వములో ఏకత్వము

*  ఆ.  కన్నుమూసి తెరచి కాంచ లో వెలుపలన్
ఆత్మరూప మొండె యంత నిండు;
దృశ్యము మరి ద్రష్ట ధ్యేయ మొకండగు
చూడకుండ నతఁడు చూచునెల్ల.

భగవద్దర్శనము కొఱకు కండ్లు మూయుదును. మరల ఆయనను కనుగొనుటకు కన్నులను విప్పుదును. ఏలయన ఆయన లోపలను వెలుపలను కూడ యుండలేదా? ఆంతర్యమున ఆ భగవంతుడు హృదయ గుహయందును. యెముకల మూలుగులోను, శరీరాణువుల లోపలను ఉన్నాడు. బాహ్యమున ప్రతి నామమునందును రూపమునందును ఆ భగవంతుడే యున్నాడు. అయినచో ఈ కండ్ల ద్వారా చూచునదెవరు? ఆయన తప్ప మరియెవరు చూడగలరు? ఏలయన ఆయనతప్ప మరియొకటి లేదు. కాన చూచునది ఆ భగవంతుడే, చూడబడునదియు ఆయనయే. అనేకములో ఏకత్వమును చూచువాడే ధన్యుడు. కాన జ్ఞానదృష్టితో చూచువాడే అదృష్టవంతుడు. భగవంతుడు దృష్టికి, శబ్దమునకు, వాసనకు, స్పర్శకు, రుచికి అతీతుడు.

... ఓమ్ ...

# మనస్సు సంకల్ప వికల్పాత్మకము

* తే. ప్రథమతః శూన్యముండె; తద్భవము నొందె
ప్రాణము; మరల తత్ప్రాణ భవము మనసు

* ఆ. ఈ మనస్సు చెడ్డ దిదియొక మర్కట
మహరహంబు శాంతినందబోదు.
సృష్టిచేయు మరల సృష్టి నాశము చేయు
పాపిఁ జేయు పుణ్యభవుని చేయు;

* తే. ఎట్టి వ్యాపృతి లేక నిష్కృతిగ మనము
నుండగారాదు; సౌఖ్యం బ దుండవలె న
టన్న మనము జీవము; జీవమరయ ప్రాణ
మును, నదియు శూన్యమును పొంది; పొసఁగవలయు.

ఆదియందు శూన్యమువలె ఉండెను. దాని నుండి జీవము, జీవము నుండి మనస్సు ఉద్భవించెను. మనస్సు తుంటరి స్వభావముగల మత్తు కలిగిన వారమువంటిది. ఎల్లప్పుడును చంచలముగా నుండును. కాని దానికి గొప్ప శక్తి కలదు. అది కల్పన వికల్పనలను చేయగలదు. మనస్సే ఒకనిని పాపిగను మరియొకనిని పుణ్యునిగను చేయగలదు. గనుక దానియెడల జాగ్రత్తగా నుండుము. దానిని చాంచల్యముతో నుండనీయకుము. దానియొక్క మూలను ప్రాణమందు లయము కానిమ్ము. ప్రాణములకు మూలము అసత్తు, దానియందు ప్రాణమును లయము చేయుము. అప్పుడే గ్రాహ్యమునకు అతీతమైన శాంతి అలవడును.

... ఓమ్ ...

# సంపూర్ణమైన సాక్షాత్కారము

* తే. దివ్య సందర్శనమది అదే యనేక
వారములు కల్గె నందు సర్వము సమగ్ర
ము; పరిపూర్ణము కర్తవ్యమ్ము కనబడదు
బాధ్యతయు లేదు కృతము సర్వమును లెస్స.

* తే. పూర్ణతా దర్శనమున నుప్పొంగె మనసు
సౌఖ్య సమ్మద కలిత హాసంబుగాక.
ఏనొనర్పగలయది కన్పింప దొందు.
అది సహజము పూర్ణము దృశ్య మందు లేని
దొండులేదు కలుప దీయ నొండులేదు:
కార్య కరణీయములు లేవుకాదె యందు.

ఈ దృశ్యము నాకు కలిగినది. పలుసార్లు ఈ దృశ్యము నాకు కలుగుచున్నది. దానిలో ప్రతి విషయమును, నిండుగాను, పూర్తిగాను చూచుచున్నాను. నేను విధిగా చేయవలసినవేమియు లేవు. చేయబడినవి ఇంతకుముందే పూర్తి అయినవి. నేను సంపూర్ణుడనగుటచేత ఆనందముతో ఉప్పొంగుచున్నాను. నేను ఆనందములో నిమగ్నమైయున్నాను. కావున నేను సదా ఆనందములో మునిగియుండుట తప్ప నాకేదియు కనపడదు. అది పరిపూర్ణ దృశ్యము. దాని నుండి తీసివేయునదిగాని, దానికి చేర్చునదిగాని యేదియు లేదు. ఒకసారి ఈ దృశ్యమును అనుభవించిన పిమ్మట చేయునదిగాని, చేయకపోవునదిగాని యేదియు లేదు. "నశ్యముతస్య కార్యం కరణంచ విద్యతే".

... ఓమ్ ...

# కష్టములు వచ్చినను నీవెందుకు ఆనందింపవు?

* ఆ. ఆడిపోసినార లాశ్రమంబునుగూర్చి
నా చరిత్ర గూర్చి నన్ను గూర్చి:
దానికేను చింత దగిలి దుఃఖింతునా
పొగడ తెగడ నాత్మ పొందునేవి?

* తే. కారు జీమూత పంక్తి యాకాశమందు
ద్యుమణి నెంతకాలము కప్పియుండగలవు:
దూషణ తిరస్కృతుల కాత్మ తోడనేమి?

* ఆ. తన్ను విస్మరించి తనువు సాగించుట
యొక్కటే విపత్తు నిక్క మపుడు
తక్క ఇతరవేళ దైవచింతనతోడ
లక్ష్యసిద్ధి చెడదు; రభసరాదు.

నన్నును, ఆశ్రమములో జరుగు కార్యములను నిందించుచు నాకు నిన్న ఒక నిష్ఠూరపు ఉత్తరము వచ్చెను. అందుకొఱకు నేను దుఃఖింపవలయునా? వ్యసనముతో కృంగిపోవలయునా? నా ఆత్మ యొక్క తేజస్సు, వచ్చుచు పోవుచున్న మేఘములవంటి పొగడ్తలకు, నిందలకు మార్పు చెందునా? మేఘములు అడ్డువచ్చినను, రాకపోయినను ఆ పరమాత్మ అనుపమానమగు తేజస్సుతోను, మహిమతోను ప్రకాశించును. నేను నవ్వుటకిదియే తగిన సమయము. కష్టములు, దుఃఖములు వచ్చినప్పుడును, పరీక్షలు, శోధనలు కలిగినప్పుడును, అదియే నవ్వవలసిన సమయము, స్తుతియందు, పొగడ్తయందు

భగవంతుని కనుగొనుట సులభమే. కాని నిందయందును, దూషణయందును అపజయమునందును, అవమానమునందునుకూడ భగవంతుని కనుగొనలేని యెడల ఆయనను కనుగొనుట పూర్తి అయినట్టిది కాదు. కావున ఇప్పుడే నవ్వుటకును, సంతోషముగా నుండుటకును నాకిది తగిన సమయము. ఇంతకు మనస్సునకు నిజముగా ఒకటే విచారము, ఒకటే కష్టమున్నది. అది ఆత్మ తన సహజ స్వభావమును మఱచినప్పుడే కలుగును. తన నిజ తత్త్వమును తెలిసికొని, అందులో స్థిరముగా స్థాపితమైనంత కాలము ఇట్టి భ్రాంతి జన్యమైన కష్టములను అది పరిహరింపగలదు.

... ఓమ్ ...

## అధిక భుజశక్తికై ప్రార్థింపుము

* తే. అమృతమొ! హాలాహలంబొ యేదైనగాని
వచ్చు నగ్ని పరీక్ష సల్పంగ నిన్ను
కష్టములు వచ్చుతరి నీరు కార్చి, యేడ్వ
నేమిపని? మోయగా శక్తి యినుమడింప
జేయుమని దేవదేవు యాచింపవలదె!

* తే. దైవఘటనలు చిత్ర విచిత్రంబు లరయ?
మోయలేనట్టి భారంబు మూపున నిడ
నతనికేమైన మనపైన నాగ్రహంబ!
శక్తి యెఱిగి పని గొను త్వచ్ఛక్తి తురగ
లింప; శాంతి తదాజ్ఞ పాలించి నిలువ.

తన కష్టములను తగ్గింపుమని కాని, విడుదల చేయుమని కాని బుద్ధిమంతుడు ఎన్నడును భగవంతుని ప్రార్థింపడు. అతడు సమస్తమైన బరువులను సంతోషముగా భరించుచు మరింత బలమును ప్రసాదింపుమని ప్రార్థించును. బలహీనుడు, అజ్ఞాని, ఇట్టి తీవ్రమైన అగ్నిపరీక్ష సంభవించినప్పుడు "ఓ ప్రభువా! ఈ కష్టములను నాకు కలుగుటకు నేనేమి చేసితిని అని ఎలుగెత్తి యేడ్చును. అవును అట్టి కష్టములను భరించుటకు అతడు అర్హుడే, అవి అన్నియు తాను భరించుటకు విధింపబడినవే. పరమాత్ముని ఆజ్ఞ లేక గడ్డిపోచ అయినను కదలదు. కష్టములు, పరీక్షలు అన్నియు నీ యొక్క మనఃస్థైర్యము, సమత్వమును పరీక్షించుటకే. ప్రతి

నూతనానుభవము నీ యొక్క మంచికొఱకే. అంతయు సరిగానున్నప్పుడు ఎవరైనను దైవచింత కలిగియుండ వచ్చును. కష్టపరంపరలు వచ్చినప్పుడే - దుఃఖములో నున్నప్పుడే నిజమైన పరీక్ష; కనుక తన ప్రభువాజ్ఞానుసారముగా నీయబడినదంతయు. సణగక, గొణగక, ఉత్తమమైన ద్రాక్షరసమైనను సరియే. మృత్యువును కలుగజేయు విషయమైనను సరియే సమానముగా బుద్ధిమంతుడు పూర్తిగా త్రాగగలడు. మరియు, ప్రభువు మనము సహింపలేని కష్టములను. దుఃఖములను మనకు ఒసగగడు. ఆయన మనమెంత వరకు భరింపగలమో. అంతవరకే ఇచ్చును. మనపై కసి తీర్చుకొనుటకుగాక మన సామర్థ్యమును పరీక్ష చేయుటకును, మనయొక్క ఆత్మ శక్తిని వృద్ధిపరుచుటకును ఆయన మనకీ కష్ట సుఖములను కలుగచేయును. ఆయన మార్గములు, అగోచరములు. గుహ్యములు, 'ఓదేవా! నా ఇష్టమేమున్నది. నీ ఇష్టమే నెరవేరనిమ్ము. అని మనస్ఫూర్తిగా నెవడు భగవంతుని ప్రార్థించునో అట్టివానిదే శాంతి.

... ఓమ్ ...

# శాంతి అంతర్యముననే యున్నది

* ఆ. గుడుల గోపురాల గురువుల చెంగట
వెదకి శాంతికొఱకు బేలవగుదు
వేల? జగమునిండి యేచు శాంతి లభించు
నే? పరిమితశక్తి నిలుచు చోట్ల!

* తే. శాంతి నాలోనె కలదు; విచారమేల?
చిత్తశుద్ధికలిగి, లోనచేర్చి చూపు
చింతమాని వెదుకవలెచే వహింప; నే
బైటనెంత వెదుక కనబడదు శాంతి

నీవు శాంతికొఱకు వ్యర్థమైనట్టియు, నిస్సారమైనట్టియు బాహ్య చిహ్నములయందు వెదకుచుంటివా? అయినచో నీ యత్నము లాభము లేనిది. శాంతియన యపరిమిత శాంతి పరిమిత శక్తులగు గురువులు, మతములు, దేవాలయములు, సంఘములు, స్నేహితులు వీనియందు లభ్యము కాదు. నీవు వెదకుచున్న శాంతి నీలోపలనే, నీయొక్క నిశ్చలమైన పవిత్ర హృదయమందేగలదు. నీవు దానిని కోరునెడల బాహ్య విషయములపైని ఆధారపడుటమాని, నిశ్చలముగా నుండుము. నీ చంచల మనస్సును అరికట్టి నీలోనున్న నిశ్చలత్వములో మునిగిపొమ్ము. నీవు నీ అస్థికాంతరాళపర్యంతము అంతఃశ్శాంతియందు నిమగ్నుడవై యున్నప్పుడు శాంతిని లోపలనేగాక బాహ్య వస్తువులయందు కూడ కనుగొనగలవు. అప్పుడు ప్రతి స్థలమునందును శాంతిని చూడగలుగుటయేగాక అన్ని దిక్కుల నుండియు వచ్చు శాంతి ప్రవాహమందు ఉండగలదు.

... ఓమ్ ...

# సాన్నిధ్యము అనుభూతి

* ఆ. నీరముల పాణితలముల నేను గడిగి
యంగవస్త్రమ్ముతో దడియార తుడవ
కరముల ద్రిప్ప నిటునటు కండ్లయెదుట
సర్వచైతన్య నిధి నిల్చు జూడ నెగడు.

* తే. ఎవ్వరేమనుకొన్న నాకేమిగాని
తత్ప్రభుని దివ్యసాన్నిధ్య ధామ మీయ
నంత చైతన్య కారణమగును కాదె!
వాఙ్మనః కాయవృత్తి తద్భావ కలన,

చిత్రముగా కాన్పించవచ్చుగాని నేను ప్రతిసారియు చేతులు కడుగుకొని తువ్వాలుతో తుడుచుకొనునప్పుడెల్ల ప్రతియణువునందు చొచ్చియుండు భగవత్సాన్నిధ్యమును తీవ్రముగా అనుభవించుచుందును. కావున కొన్ని సమయములందు ఆగకుండ చేతులు తుడుచుకొందును. చలనములో భగవత్సాన్నిధ్యమేల అనుభవింతునో నాకు తెలియదు. బహుశః (ఫ్రాయిడ్) అను తత్త్వవేత్త యొక్క అనుచరులు దీనిని చిత్రముగా వివరింపవచ్చును. అట్లు చేయనిండు. అయితే నేను చేయు ప్రతి విషయములలోను ఈ అనుభవమునే నేను కోరునది. ఉదాహరణము – నేనిప్పుడు వ్రాయుచున్నాను. నా చేతిద్వారా వ్రాయునదేది? నా మెదడులో ఆలోచించునదేది? అది అంతయు ఏకైకా విచ్ఛిన్న శక్తియే యిన్ని విధములుగా వెలిబుచ్చుచున్నది. అదియే సర్వచలనమునకు మూలమైనది. మానసిక చలనముయందును శారీరక చలనముయందును, తలంపుల యందును, క్రియలయందును, ఈ మూలమును జ్ఞప్తియందుంచుకొందుముగాక!

... ఓమ్ ...

# పరిమితములో అపరిమితి

* తే. ఈశ్వరుని యేక దేశమీ యెడద దాగు
దేహ మావరణంబయి తేజరిల్ల!
కలుగదు "విదేహ కైవల్య" ఘటన; జీవ
కాయ తాదాత్మ్య భావనా కలన చేసి.

* తే. ఈశ్వరుం డెన్నడైన బంధింపబడునె
భిన్నకాయ పంజరమున; చిలికి జీర్ణ
మై నశింప జీవుడు చేరు నయ్యనంత
శక్తిమంతుని జగదీశ్వరుని మరల,
తత్త్వవిదులీ రహస్యవేత్తలు జగాన.

నేను స్వతంత్రుడననియు, పూర్ణుడననియు నాలో నేను భావింతును. ఈ భావన, శరీర సంబంధమగుటచే, భ్రమయే అయినప్పటికిని, ఆంతర్యమున మాత్రమే యున్నది. పరిమితిలోని అపరిమితియే నా యొక్క ప్రస్తుతానుభవమును వెల్లడి చేయుచున్నది. ఇది విదేహకైవల్యమనెడు చరమస్థితి కాకపోయినను, ఈ స్థితియే నాకు శాంతిని స్థిమితమును ఇచ్చుచున్నది: అయితే ఎంతకాలము ఈ అపరయాప్తమగు శరీరము అనంతముయొక్క అపారమైన బరువును మోయగలదు? దాని కర్మ పూర్తి కాగానే శరీరము ఎండిన ఆకువలె అప్రయత్నముగనే రాలిపోవును. అప్పుడు ఆత్మ శరీరము నుండి బయటకువచ్చి తన సర్వవ్యాపకత్వమునందును. సర్వశక్తిమత్త్వమునందును, సర్వజ్ఞత్వమునందును మగ్నమైపోవును. కూజాయందలి ఆకాశము కూజా పగిలిపోయినప్పుడు వెలుపలనున్న మహాకాశముతో ఒకటి అగును. నిజమునకు అంతకుపూర్వము కూడ ఒకటియే, ఈ రహస్యములన్నియు ఆత్మ జ్ఞానులకే తెలియును.

... ఓమ్ ...

# ఉత్సాహ నిరుత్సాహ సమయములు

* తే. యౌగికానంద మగ్న సమాధియందు
పూర్ణ నీరూప నిశ్చల భూములందు
క్షణము లనుభవింతురు మునిగణ ముదాత్త
మున్నతమునైన స్థాయి, నిరుపహతి-నఁట.

* తే. శాశ్వతంబిదిగాదు; విచార దుఃఖ
మనుభవింతురు మఱికొన్ని క్షణములందు;
క్రౌర్యమును జూచి, యన్యాయగతులఁగాంచి,
నీతిఁదొలఁగుట గమనించి - నెవ్వగలకు
ములుగుదురు మనవలె నెద - మునులుగూడ

* తే. కష్టనిష్ఠురమైన చీకట్లు నిండు
చిన్మయానందమయ తపః సిద్ధకాంతి
వెల్గు చీకట్లవోలె జీవితమునందు
సహజమై యొప్పు నెట్టి సజ్జనులకైన,

* తే. కాని ఋషులకు లౌకికులైన వారి
కిని గలదు భేదము ఋషి యకించనుండు
ఆత్మ సాక్షాత్కృత స్థితియందు నిల్చి
సర్వ సమదృష్టిచూచి, విచారణమున
స్వప్న సదృశంబులు సుఖ విషాదములని
మనసు పట్టించుకొని బాధ గనఁడు సుంత

* తే. తత్త్వ చింత సంతర్ముఖత్వమొంది
కూర్మ మంగముల ముడుచుకొని, భయంబు
వీడి సంచరించు విధాన వెలయునతఁడు
"యదా సంహరతే చాయం - కూర్మో౽ఙ్గానీవ సర్వశః"-భగవద్గీత

తత్త్వజ్ఞులు, యోగులు బ్రహ్మసాక్షాత్కార క్షణములయందు నిరాకార ప్రపంచములో అంతరిక్ష ప్రపంచమున కెగయగలరు. కాని వారెల్లప్పుడును అచ్చటనే యుండజాలరు, అలసినప్పుడు దిగిపోయిన వారుకూడ విచార దుఃఖ సమయముల ననుభవింతురు. క్రూరము, అన్యాయము, లంచగొండితనము, దుఃఖము మొదలగునవి వారి యెదుట జరుగుచున్నప్పుడు వారు కూడ బాధపడుచుందురు. ఈవిధముగా ప్రతిజీవితమందును, ఆరోహణోద్రేకములేగాక అంధకార దుఃఖ క్షణములు కూడ ఉండును. అయితే జ్ఞానికిని సామాన్య మానవునికిని భేదమున్నది. జ్ఞానియన్ననో ఆత్మ పరిపక్వమనెడి ఉన్నత పీఠము నుండి సమదృష్టితో ఈ జీవతత్త్వమును వీక్షించుచుండును, దుఃఖము, కష్టము తన్నెదుర్కొనినప్పుడు వానిని క్షణిక మాత్రములగు ఛాయలుగా మాత్రము గ్రహించి పాటింపక విడిచిపెట్టును, తాబేలు ఆపదవచ్చినప్పుడు తన అవయవములను ముడుచుకొని విపత్తు తొలగిపోగానే విప్పునట్లు జ్ఞాని కష్టములు దుఃఖములు సంభవించినప్పుడు తన ఆత్మస్థానమగు అంతః కేంద్రములోనికి వెడలిపోయి బాహ్య ప్రపంచ సంబంధము లేక అచ్చటనే యుండిపోవును. "యదాసంహరతే చాయం, కూర్మోఽ౦గా నీవసర్వశః".

... ఓమ్ ...

# పని వ్యాకులతను పారద్రోలును

* ఆ. ఏల దుఃఖమొంద! నేలరోదింపంగ!
దుఃఖమన నెఱుంగుదువె! కుమార!
ఎచట నుండి వచ్చు; ఎట్టులేర్పడునద్ది
వెల్గునుండి యుద్భవింప జగము?

* మం. "పని లేకపోవుటన్ బ్రభవించు బాధ;
బాధ చంపును పని వట్టి జనముల"
ఎఱుఁగవే యీ బాస నెల్ల రాడంగ
ఇంతకున్ బరమాత్మ యంతరింపదుగ!
ఎందాకనుండు విశ్వేశ్వరుం డిచట
నందాక ధర్మ న్యాయ్యమ్ము లుండుగద!
అర్థరహితము దుఃఖార్తి మునుగుట;
జ్ఞాన సూర్యోదయకాంతులు నిండ
క్లేశ జీమూతపంక్తి తొలంగి పోదె!!

బిడ్డా! ఏల విచారముగ నుండి బాధపడెదవు? వ్యాకులపడుటకే మున్నది? మానసికబాధ అననేమి? అది యెక్కడ నుండి వచ్చును? అదియేమి అని వేర్వేరుగా విభజనచేసి చూచిన యెడల శూన్యమగును. ఏలయనగా? మూలమునందంతయు తేజస్సు, ఆనందమే, నీపక్షయ కారకము కాదు. వ్యాకులత క్షయకారి అన్న మహావాక్యము నీకు జ్ఞాపకము లేదా? విచారముచేత మిగుల పీడింపబడినపుడు పనిచేయుటకు ప్రారంభింపుము. ఏలయన పని వ్యాకులతను పూర్తిగా పారద్రోలును. భగవంతుడింకను అంతరించి పోలేదు. పరతత్త్వమున్నంత కాలము తేజస్సు, ధర్మము ఉండనేయుండును. కావున ఎందులకీ వ్యాకులత? లెమ్ము. తేజస్సులో నుండి ధర్మము ననుసరింపుము.

వ్యాకుల మనునది భయంకరమైనదేగాక ఊహాజనితమైన పిశాచము. గాన ఈ భయంకరమైన మానసిక వ్యాధికి ఎన్నడును లొంగవలదు. తేజస్సులకు తేజస్సగు నాత్మయందు విచారమను ఈ నల్లని మబ్బు ఎటుల ఉండగలదు?

... ఓమ్ ...

# ఆనందము బ్రహ్మైక్యమునందే కలదు

* ఆ. లేచి లేవక మును తేపకడనె నీవు
నిర్ణయించి కాలనియతి పూను;
మెల్లతేని సేవనే ప్రొద్దు చేయుము
క్షణ మమూల్యమైన కణము నట్లు

* మం. బహ్వాశ్వ నాగాది ప్రకరంపుఁగల్మి
సంతోష సౌఖ్యముల్ సమకూర్పగలదె:
అన్నింట పరమాత్మ యంద్యైక్య మొంది
యుండుట యొసఁగును నిండు సౌఖ్యంబు.

ప్రతి దినమునను మేల్కొనినపుడే నీ జీవితములో ఆ దినమే మిక్కిలి ఆనందదాయకమగు దినముగ చేసికొనుటకు నిశ్చయించుకొనుము. దినమునందలి ప్రతిక్షణము అల్పమయ్యును. విలువైనది. క్షణములు కలసిననే దినమగును. గాన ప్రతిక్షణమును సద్వినియోగము చేయవలయును. వాటి నన్నింటిని భగవత్సేవయందును, ఆయనతో తన్మయత్వము పొందుటయందును వినియోగింపుము. ప్రతిక్షణమును అట్లు సౌఖ్యవంతమగు, దినమంతయు ఆనందదాయకమగును.

నిజమైన ఆనందము, అనేక పశువులు, ఏనుగులు, గుఱ్ఱములు, కారులు, బంగారము, సుందరమైన వనితలు, ఇండ్లు మొదలగునవి కలిగియుండుటలో లేదు. "బహూన్ పశూన్ హస్తి హిరణ్యం అశ్వాన్ రామాస్సరథాస్సతూర్య" అది అంతయు ఆంతర్జ్యోతియగు భగవదైక్యములోనే యున్నది. మానవుడు ఆంతర్యమునను బాహ్యమునునుగల తేజస్సుతో ఐక్యము ననుభవించుటకు ప్రయత్నించిన యెడల తాను పనిచేయుచున్నను, ధ్యానించుచున్నను, ఆనందమును, తృప్తిని అనుభవింపగలడు. భగవత్సాన్నిధ్యము పనియందును, నిశ్శబ్దమునందును ప్రతిక్షణమునను అనుభవించుటయే ప్రతి దినమును అత్యుత్తమమైదిగాను, ఆనందకరమైనదిగాను చేయుటకు మార్గము.

... ఓమ్ ...

# యదార్థమగు సర్దుబాటు లోపలనేయున్నది

* ఆత్మోద్ధరణ వీడి ఆలసట చెంది
బాహ్య సంస్కరణ పని వట్టి చేయ
చేకూరునే శాంతి! చేటు కాకుండ!
ఆత్మ సంశోధనం బగు ప్రధానంబు:
చిన్న చేటొకండు చేకూరెనన, వ్యస
నంబు నొందు కారణంబు వెదుక
ఆత్మ శోధనంబు నాచరింపదు సుంత
పెనచుకొనుచు పడును పెరల పైని
తన్నుదా పరీక్ష తగ నొనర్చు కొనుచు
ఎలమి తప్పు సంస్కరింపవలయు.

మానవుడు సదా బాహ్య ప్రపంచములోని ప్రతి వస్తువును సర్దుటకును, మార్చుటకును, పునర్నిర్మాణము చేయుటకును కోరుచుండును. కాని తనను సర్దుబాటు చేసికొనుటకు మాత్రము ప్రయత్నింపడు. అయినను నిజమైన సర్దుబాటును, సరిగా చూచుటయు తన ఆంతర్యము నుండి తనతోనే ప్రారంభింపవలెను. మానవుని అంతః కేంద్రమునందెన్నడు సర్దుబాటు ఏర్పడునో అప్పుడే బాహ్యమున కూడ సర్దుబాటు కాన్పించును. లోపల తన హృదయములో శాంతి యెప్పుడు కలుగునో అప్పుడే బాహ్యమున కూడ అంతయు శాంతిగనే యుండును. కావున సమస్త సర్దుబాటు అమరిక లోపల నుండియే ప్రారంభింపవలయును. కాని అయ్యో! లౌకిక దృష్టిగల వ్యక్తి ఎక్కడనైనను తప్పును కనిపెట్టిన యెడల, తనను విడిచి తక్కిన ప్రతివస్తువును సరిచేయుటకు యత్నించును. మానవుడు ఈ వ్యక్తిని, ఆ వ్యక్తిని సరిదిద్దుటకు ప్రయత్నించునేగాని, పాపము తనకు తాను మాత్రము చక్కబడలేదు. ఆయా విషయములను సాఫీచేయుటకును, సర్దుబాటు చేయుటకును ఒకనికి ఉత్తరము వ్రాయును. ఇంకొకనికి సలహా చెప్పునుగాని మూలమునకు వెళ్ళి తనను మాత్రము సరిదిద్దుకొనడు. శాంతిని అపేక్షించు వ్యక్తి మొదట తన అంతరంగమందు మార్పును, దిద్దుబాటును చేసుకొనవలెను.

... ఓమ్ ...

# మానవుడు సహజముగా సింహమే

* తే. మానవుడు దేవ ప్రతిబింబమైనవాఁడు;
సింహ మతఁడు నైజమున గర్జింపమానె
"మాయ" యను ముసుంగున మూఢుఁడై యతండు;
స్వీయ తేజోగుణంబుల విడిచెనయ్యొ!
దాని ఫలితంబుగా నయ్యె దైహికముగ
మానసికముగ దుఃఖాయ మానజీవి;
దేహ సభ్రాంతి, నిత్యజించు ధీరతగ న
పూర్వ కంఠీరవత్వ విభూషితుడగు.

భగవంతుని జీవిత ప్రతిబింబమైన మానవుడు తన సహజతత్త్వముచేత సింహమువంటివాడు. అజ్ఞానావరణలను తొలగించుకొనుటయే అతని జన్మహక్కు. అయితే చెడుసహవాసముచేతను, అజ్ఞానపు భ్రమచేతను, ఘర్జించుట మఱచి గొఱ్ఱెవలె అరచుట నేర్చుకొనెను. ప్రతిమానసిక చలనమునకును అతడు భయముచే వణకుచుండును. నిజస్థితులు తారుమారయ్యెను. పరమాత్మస్వరూపుడైన మానవుడు తన సహజ ప్రకృతిని మరచి అవివేకియై ప్రపంచ విషయములలో మునిగియుండును. తత్ఫలితముగ మనుజుడు దుఃఖము, బాధ మొదలగు చెప్పనలవికాని శారీరక మానసిక బాధల ననుభవించుచుండును. అతడు దేహాత్మబుద్ధిని వదిలి, నిరాధారమైన భయభ్రాంతులను, కోరికలను విడచిన యెడల తన సహజ స్వరూపమును తిరిగి పొందును. అతడు తన యదార్థ స్థితిలో ప్రతిష్ఠింపబడును.

... ఓమ్ ...

# భ్రమ వట్టి రెల్లుపుల్ల వంటిది

* తే. భ్రాంతి సంకల్పితమయి తద్భావి ప్రగతి
కడ్డు తగిలెడు నీ యెండు గడ్డిపరక
వెల్ల నిచ్చెదవా, రాజవీధి, నిలిచి?
లేద, అరకాలమట్టి రూపేద, దగ్ధ
పటల మొనరింతువా దైవ భావ కలన?

* తే. ఇది సమయమగు నీలోని యాశు నెగడి
నిశ్చలాత్ముండవై నీకు నీవు నిలువ;
వట్టి యూహల వలకట్టి పడగనేల
"తత్త్వమసి" మహావాక్య సక్తత వహింపు.

అసత్యమైనట్టియు, కేవలము భ్రాంతి జన్యమైనట్టియు, వట్టిరెల్లుపుల్ల నీ పురోగమనమును అడ్డగించుచుండ నంగీకరింతువా? లేక నీ యడుగులతో ఈ అల్పమైన రెల్లుపుల్లను అణగద్రొక్కి సమస్తమును దగ్ధముచేసెడి జ్ఞానాగ్నిలో కాల్చివేయుదువా?

నీలోని సహజమగు ఉచ్చస్థితిని వెలిబుచ్చి నిర్ధారణ చేయుటకు కాలమతిక్రమించుచున్నది. ఈ సత్య రూపములకును, విపరీత భ్రాంతులకును ఆహుతిగాకుము. సత్యమును, బ్రహ్మమును, గుర్తించి అందులో స్థిరముగా నుండుము.

# క్రీనీడలకు భయపడుట

* తే. "తత్త్వమసి," "అహం బ్రహ్మాస్మి" "తద్ధితవ"ము;
మొదలుగా మహావాక్యములను జపించి
వేదసూక్త పారాయణ వెలుగజేసి
నట్టి జ్ఞానైక నిధియు భయపడు నహహ

* తే. బింబ సదృశలోక విషాద భీతులగని
ఏల? తత్త్వయదార్థ్య ముంతయేని
అనుభవ పురస్సరం బాత దరయ కునికి

* ఆ. తత్త్వబోధకుండె తడబడు నొక్కచో
జ్ఞాన సత్య భువి పునాది లేక;
కామ లోభ క్రోధ గణముల పెన్లడి
నిల్వ గలవు జ్ఞాన నిష్ఠ నిలువ :

సమస్త మతములు, వేదాంతములు తెలిసినను, "అహం బ్రహ్మాస్మి" "తత్త్వమసి" అను వైదిక మహావాక్యములను ఎన్నిసార్లు మననము చేసినను, పండితుడు, ఇంకను విచారములు, భయభ్రాంతులవంటి ప్రపంచమందలి నీడలకు భయపడుచునే యుండును. ఎందుచేత? తనదైనందిన జీవితమునందు సత్యమును గూర్చిన స్వానుభవము అతనికింకను లేకపోవుటచేత.

కొన్ని సమయములందు తత్త్వవేత్తలు, ఆరాధకులు కూడ ఇట్టి క్షణికమగు చిన్న బాధలకు లోనగుదురు. దిట్టమైన పునాది లేకపోవుటయే దీనికంతటికి కారణము. స్థిరమై, లోతైన రాతిపునాది మూలమై యుండిన యెడల అత్యాశ, భయము, అజ్ఞానము మున్నగు క్షణికములైన తుపానుల తాకిడిని నీవు తట్టుకొనగలవు.

... ఓమ్ ...

# అదృష్టము

*     ఆ.     ఒక్క పర్వమందు మిక్కిలి చెలికాడు
కాన్క నిచ్చె గాజు కనుల పిల్లి;
మెడను వ్రేలగట్టె మెఱుగౌను త్రాటిని
కల్గు శుభమటంచు కాగితమును!

*     తే.     ఆత్మ సర్వ సౌభాగ్య భాగ్యైకమయిన
పెర శుభాకాంక్ష యేల? యే నెఱుఁగజాల!
ఆత్మ పర గవేషణల కహరహమగు శు
భంబు; అదె యదృష్టము: దైవపరత గనుట.

శుభము కల్గునట్లు అభినందించు నల్లపిల్లి బొమ్మగల ఒక క్రిస్మస్ కార్డు నా బల్లమీద నున్నది. పిల్లి కండ్లు రెండు గాజుపూసలతో అమర్చబడియున్నవి. దానితోక దూదివలె మెత్తని వస్తువుతో గూర్చబడినది. నేను దానివంక చూచినప్పుడెల్లను, "అదృష్టము" అని చదువుదును. నిజముగ నదృష్టమే. నా ఆత్మయే అదృష్టము కాదా? అంతకంటె ఇతరాదృష్టము సౌభాగ్యము, ఆత్మకు ఏమి కావలసి యున్నది.

ఆత్మ జ్ఞానులకును, భగవత్సాక్షాత్కారము కలిగినవారికిని అదృష్టముతో పనిలేదు. వారే అదృష్టరూపులు. వారి సమగ్రమగు దైవ జ్ఞానమే వారి అదృష్టము - అందేవారికి సర్వమును గలదు.

... ఓమ్ ...

# దివ్యక్షణమును శాశ్వతముగా నిలపుకొనుము

* తే. అక్షయానంద సాక్షి ప్రత్యక్షమగు క్ష
ణంబు లుదయమగు, నిరంతరంబు లోన
వెలుపల, వరగొనుచు ముంచి పేరు గొనగ
గడ్డకట్టి; తదనుభూతి ఘనత చెంద.

* తే. క్షణికమైనట్టి యనుభవ క్రాంతికాదు
శాశ్వతం బిది - కాదేల సత్య మిద్ది?
సర్వ తేజోమయుండొండె, సత్యమగుట:
మాయ, తాత్కాలికపు భ్రాంతిమయ మసత్తు
"మాయ" తొలగింప తేజోక ప్రమేయ మబ్బు.

భగవత్ సాన్నిధ్యమును లోపలను, వెలుపలను అంతటను నే ననుభవించు క్షణములు గలవు. నేను భగవత్సాన్నిధ్యముతో నింపబడి చుట్టబడి యుండుటయేగాక సంపూర్ణముగా దానితో ఐక్యమైనట్లు అనుభవించుచుందును.

అయితే ఈ దివ్యసాన్నిధ్యము తాత్కాలికము. క్షణభంగురము అయినదికాదు. అది శాశ్వతము. సదా యుండునది. కాని యేదో భ్రమచే మానవుడు దానిని మఱచి దుఃఖితుడగుచున్నాడు. ఎప్పుడైతే జ్యోతులకు జ్యోతియగు సత్యము ఒకటే కలదనియు, దీనికి మించినది మరియొకటి లేదనియు గ్రహించునో అప్పుడు భ్రమయనునది యెక్కడ నుండి వచ్చును? అదియే పరమ గోప్యమును, మాయ యొక్క అసత్యతయు. అయితే మనుజుడు అంతర్ముఖియై గాఢముగా అంతరంగమున ఆలోచించినయెడల ఈ భ్రమకు స్థానమే లేదనియు, యదార్థముగా అది అంతయు సారము లేనిదనియు. సమస్తము తేజస్సే గనుక భ్రమయనునది లేనేలేదనియు, అతడు తెలిసికొనును.

... ఓమ్ ...

# నన్ను (నా ఆత్మను) నేను మరువలేను

* ఒక్క దివ్యానుభూతి నా కుదయ మయ్యె
"ఎన్నడును మరువఁగ లేను 'నన్ను' నేను"
అన్న విషయంబు: ఏల సాధ్యమగు నద్ది
సత్యమును శాశ్వతము నాత్మసత్త్వ మెఱిఁగి
లోన తలఁచు నట్టిది చూపులోన మెలఁగి
పలుకు నట్టిది, చైతన్యపరత నెల్ల
నిల్పునట్టిది యాత్మయై నెగడ - నెట్లు
మరచిపోవుదు నెట్టి ప్రమాదమందు;
నన్ను ప్రేమించువారిని నన్ను తెగడు
వారి నొకట మరువగల కోరియైన
నద్వితీయమై నాకంటె నన్యమేది
కాని నన్ను నే మరువంగ గలనె యెపుడు.

ఈమారు సత్యము యొక్క మరియొక ముఖము వివరముగా తెలిసికొంటిని. మరల నాకు దివ్యదృశ్యము కలిగినది. ఈ మారా దృశ్యము దేనిని గురించి? నా ఆత్మను నేను మరువజాలను. అది సత్యము. దేనినైనను మరువగలను, మరువవచ్చునుగాని నన్ను నేనెట్లు మరువగలను? నన్ను నేను జ్ఞాపకముంచుకొనుచున్నాను. ఆ సత్యమును శాశ్వతమైన వస్తువును నేనే. అనగా శాశ్వతమైనదానిని జ్ఞప్తియందుంచుకొనుచున్నాను. నాలో ఆలోచించుచున్నది అదియే నా ఆత్మయే, నిజముగా ఆ మహిమ అంతయు ఆలోచనయందుగాని, క్రియయందుగాని బహిర్గతమగుట లేదు. అయినను నేనెట్లు దానిని మరువగలను? నన్ను ప్రేమించువారిని నాతో భేదాభిప్రాయము గలవారిని మరువగలను. కాని వాస్తవముగా ఏకమై అద్వితీయమైన నా యాత్మను మరువజాలను.

... ఓమ్ ...

# విశ్వదృశ్యము

*  తే.  "లేరు శత్రువులును విరోధులును లేరు:
బాధ నిడువారు లేరు; ఏ ప్రక్కజూడ
దైవమయ మద్వితీయ మాత్మ మఖితక్క:
సత్య శాశ్వత దర్శన సారమిదియ

*  తే.  అందరిని కౌగిలింపగా నాశగొందు
మిత్రుడఁగు గాక, దా మని శత్రువగును
గాక, ద్రోహి యగునుగాక, కష్టశీలు
డగునుగాక-యేల? యభేద మగునుగాదె

*  తే.  ఆత్మకారయ నెందు! మహాబ్ధి నొదిగి
రూపరి యదృశ్యమై పోవె! రూఢ తాంగ
భంగముల్ నీరమై చన: వ్యాపకత్వ
సర్వ చైతన్యనిధి - ఆత్మసార మొకఁడె.

ఈ నవీన దృశ్యములో నాకెవరును - విరోధులుగాని. దూషించువారుగాని లేరు. హింసించువారుగాని, పీడించువారుగాని నాకు గోచరించుట లేదు. నా ఆత్మ అంతయు భగవంతుడు - ఆ ఏకైక ఆత్మ. ఎవరుగాని, ఏ వస్తువుగాని ఈ అనుభూతికి వెలుపలలేదు. ప్రపంచమంతయు అదృశ్యమునందలియొక భాగము. కావున అందరు అందే ఇమిడియున్నారు. నిన్ను ప్రేమించువారినేగాక, ప్రేమించలేనివారిని, మంచివారిని. పవిత్రమైనవారినేగాక దుష్టులను, దుర్మార్గులనుకూడ, ఆలింగనము చేయగోరుచున్నాము. ఏలయన వారు నిజముగా దైవ స్వరూపములే. వారందరు ఒకే మహాసముద్రమునందు అసంఖ్యాకములగు అలలు, ఆత్మ ఏకమై అవిభక్తమైన మూలమునందు అన్ని స్పందనలు లీనమైపోవుగాక!

... ఓమ్ ...

# ఖండమైన ఏర్పాట్లకు పరంజ్యోతి అతీతము

* తే. శాశ్వతంబనంతము కాంతిసారమేను
విస్ఫురద్దివ్య కాంతి యావిర్భవింప
కాలము, లయించు కాంతి సంక్రాంతిలోన
సర్వచైతన్య మందు ప్రశాంతినొందు.

* తే. ఆ పరంజ్యోతి, తరుగులే కట్లె నిలుచు
వృద్ధి పొందదు; సర్వ సమృద్ధితోడ
నెల్ల దేశకాలంబుల నుల్లసిల్లు
నొక్కరీతి; ఒండెవిధము పిక్కటిల్లి.

* తే. స్థలమునకు కాలమునకు ప్రధానకార
ణంబునకు పైనివర్తిల్లు : నవ్యమగుచు;
ఆ పరంజ్యోతికి నచలమైన సకల
కాంతి ధామమునకు నమస్కారమగుత

స్వయంప్రకాశమానమైన కాంతివంతమైన తేజస్సు నేనే అయియున్నాను. అదియే శాశ్వతమైన అనంతమైన తేజస్సు. నా ఏర్పాట్లు యేమి? ఏమియు లేవు. ఈ సర్వత్ర వ్యాపించియున్న తేజస్సునందు కాలము లీనమగుచున్నది. ఈ ఆప్తకామమగు ఈ ప్రకాశములో అన్ని చేష్టలు ఉండును. ఈ తేజస్సు సదా ప్రకాశవంతముగానే యుండును. కొంచెమైనను తగ్గుటగాని, హెచ్చుటగాని లేదు. అది అందరియెడలను సమస్త పరిస్థితులయందును సమానముగా ప్రకాశించును. అది శాశ్వతమగు జ్యోతి. అది దేశకాల నిమిత్తముల కతీతము. ఆ దేదీప్యమానమైన దివ్యతేజస్సునకు సర్వ ప్రణామములు.

... ఓమ్ ...

# శుభశుక్రవారము -పాడుచున్న పక్షులు

* తే. అది మహాశివరాత్రి:పర్వదిన మెవడు
పరమశివుడు? తద్ధ్యానైక పరుడు జనుఁడు;
ఉదయ మాది శకుంతము లుప్పరమున
చెట్లనీడ నతని ప్రశంసింప దొడఁగె.

* తే. ఏను ముని నయియుందు, నన్నీ ద్విజాళి
యెల్లరేని ప్రశంసింపనెంచు; పాడు
కొందు నిశ్శబ్దమున నా యెదంద లోన
పక్షులకు పోలి యతని దీవెనలుఁగోరి.

* తే. నిండు టారోగ్యద కుసుమ నిచయ మెచట
చూడ నోంకార లింగ విస్ఫూర్తి దనరి
పరమ శివమూర్తి ప్రత్యక్షభావ మొసఁగు
జీవ సంఘము దేవత్వ సిద్ధినొంద.

ఈనాడు శుభశుక్రవారము. క్రైస్తవులందరకు పవిత్రమైన దివ్యమైన సుదినము. అయితే క్రైస్తవుడెవ్వడు? క్రీస్తు మార్గమున సంచరించువారందరు క్రైస్తవులు. ఈనాడు వేకువజాము నుండియు, అనేక తెగల, రంగుల, చిన్న పెద్ద ఆకారము ఆదిగాగల పలురకముల పక్షులు ఎడతెగక గానము చేయుచున్నవి.

భగవంతుని స్తోత్రగానములతో నన్ను కూడ తమతో చేరుమని అవి కోరుచున్నవి. ఈనాడు నా ఉపవాస మౌనదీక్షలో 38వ దినమగుటచే నేనట్లు చేయలేకున్నాను. మిగిలిన రెండుదినములు నాలో నేనే పాడుకొనగలను. అటుపిమ్మట ఈ పక్షులవలె నేనును ఆ ప్రభువుయొక్క దివ్య ఆశీర్వాదములకు ఆయనను స్తుతించుచు గానములో చేరగలను.

ఈష్టరు పండుగ లిల్లీ పుష్పములతో సంబంధించియున్నది. పాశ్చాత్య దేశములలో వీనిని ఈష్టరు లిల్లీ పుష్పములందురు. ఆశ్రమమంతయు వందలకొలది లిల్లీలు వికసించి తమ హృదయములను వెలిబుచ్చుచు పునర్జీవితుడైన క్రీస్తు ప్రభునకు ప్రణామముతో స్వాగతమిచ్చుచున్నవి.

... ఓమ్ ...

# ధన్యమగు ఈష్టరు పండుగ

*　తే.　ఈ మహాశివరాత్రి సంస్కృతి వసింప
సర్వచైతన్యమున శివసాక్షి కందు;
అతని మరచుటయే లేదు; అస్తి నాస్తి
భ్రాంతి యింక లేదు; కాంతికిన్ గాంతియగుచు
లోన వెలుపల నైశ్వర్యమూని వెలుగు;

*　తే.　మోసమున కార్య నిచయ సంధాన కరణి;
మనసునన్, గాయమున, సంచలనకలన, వి
లసనము వహించు తచ్ఛక్తి; రాత్రివేళ
పగలు నిశ్శబ్దమున శబ్ద వార్ధి సాక్షి.

ధన్యమైన ఈష్టరు అనగా శుభ శుక్రవారము జ్ఞాపకార్థము నా జీవితమందలి ప్రతిక్షణమునను ఆ భగవానుని వ్యక్తపరచుటకు కోరుచున్నాను. ఇక ఆ పరమాత్ముని మరచుటయును లేదు. భ్రమయును లేదు. జ్యోతులకు జ్యోతియై లోపలను, వెలుపలను భగవానుడు ప్రకాశించుచున్నాడు. మౌనమునందును, పనియందును, నా మనస్సు యొక్కయు, శరీరము యొక్కయు ప్రతి క్షణమునను, భగవంతుడే వ్యక్తమగుచున్నాడు. జాగ్రదవస్థయందేగాక, స్వప్న సుషుప్తావస్థలయందును కూడ, ఏ జ్యోతిర్మయుడు ప్రపంచమునకు సాక్షిభూతుడై యున్నాడో, ఆ జ్యోతిర్మయుడే ఈ ప్రకృతియందంతటను మౌనసాక్షిగా ప్రకాశించుచున్నాడు.

... ఓమ్ ...

# పునరుజ్జీవితుడగు క్రీస్తు ప్రభువు

* తే. అది మహాశివరాత్రి: హృదంతరాభి
లాష మొదవు: భౌతిక శరీరమ్ము పోయె;
స్థాపితము భూమిలో కాని - సర్వలోక
మావహిల్లె నోంకార మేకాక్షరమ్ము

* తే. సర్వ జాగ్రదవస్థ విశ్వంబు నేలు
శంకరస్వామి నిర్వ్యాజ శాంతి కలిత
మౌన మోంకార లీనమై ప్రాణికోటి
బ్రహ్మ సాయుజ్యమున పరిపాటి నొసగు.

శుభ శుక్రవారము యొక్క జ్ఞాపకార్థము ఓంకార స్వామియొక్క శరీరము అనగా స్థూలశరీరము నశించి పాతిపెట్టబడినదనియు ఆయన అజ్ఞానాంధకార గోరి నుండి క్రీస్తు యొక్క ధన్యమగు తేజస్సు లేచినదనియు చెప్పుటకు నా ఆత్మ యెంతయు కోరుచున్నది.

పూర్వాశ్రమములోని తాను మరణించి పాతిపెట్టబడి, నూతన ఆత్మ అనగా ఉన్నత ఆత్మ. క్రీస్తు జ్యోతితో నిరంతరము ప్రకాశింపనిచ్చుట చాల ఆశ్చర్యకరమైనది. క్రీస్తు తేజస్సు ఈ ఆకారములో పనిచేయుచు, జీవించుచు, శ్వాసవిడుచుచు ఉండుననుట చాల తృప్తిగను ఆనందముగను ఉన్నది. ఆ క్రీస్తు యొక్క శక్తికొద్ది గొప్పకార్యములలోదేగాక సాధారణ దినచర్యలగు, చూచుట, వినుట, ఆలోచించుట, వ్రాయుట మొదలగు కార్యములలో సహితము వ్యక్తము కానిమ్ము. ఈ పవిత్రమైన స్వర్గారోహణ దినమున పునర్జీవితుడైన క్రీస్తు ప్రభువునకు జోహారు లర్పించుదము. ఇప్పుడు ఆయన యొక్క పరిశుద్ధమగు శాంతి, ప్రేమ, సౌందర్యము, కరుణ మొదలగు సుగుణములను గురించి ధ్యానింతము.

... ఓమ్ ...

# పునరుజ్జీవితుడగు క్రీస్తు ప్రభువు

*   తే.   అది మహాశివరాత్రి: హృదంతరాభి
లాష మొదవు: భౌతిక శరీరమ్ము పోయె;
స్థాపితము భూమిలో కాని – సర్వలోక
మావహిల్లె నోంకార మేకాక్షరమ్ము

*   తే.   సర్వ జాగ్రదవస్థ విశ్వంబు నేలు
శంకరస్వామి నిర్వ్యాజ శాంతి కలిత
మౌన మోంకార లీనమై ప్రాణికోటి
బ్రహ్మ సాయుజ్యమున పరిపాటి నొసగు.

శుభ శుక్రవారము యొక్క జ్ఞాపకార్థము ఓంకార స్వామియొక్క శరీరము అనగా స్థూలశరీరము నశించి పాతిపెట్టబడినదనియు ఆయన అజ్ఞానాంధకార గోరి నుండి క్రీస్తు యొక్క ధన్యమగు తేజస్సు లేచినదనియు చెప్పుటకు నా ఆత్మ యెంతయు కోరుచున్నది.

పూర్వాశ్రమములోని తాను మరణించి పాతిపెట్టబడి, నూతన ఆత్మ అనగా ఉన్నత ఆత్మ. క్రీస్తు జ్యోతితో నిరంతరము ప్రకాశింపనిచ్చుట చాల ఆశ్చర్యకరమైనది. క్రీస్తు తేజస్సు ఈ ఆకారములో పనిచేయుచు, జీవించుచు, శ్వాసవిడుచుచు ఉండుననుట చాల తృప్తిగను ఆనందముగను ఉన్నది. ఆ క్రీస్తు యొక్క శక్తికొద్ది గొప్పకార్యములలోదేగాక సాధారణ దినచర్యలగు, చూచుట, వినుట, ఆలోచించుట, వ్రాయుట మొదలగు కార్యములలో సహితము వ్యక్తము కానిమ్ము. ఈ పవిత్రమైన స్వర్గారోహణ దినమున పునర్జీవితుడైన క్రీస్తు ప్రభువునకు జోహారు లర్పించుదము. ఇప్పుడు ఆయన యొక్క పరిశుద్ధమగు శాంతి, ప్రేమ, సౌందర్యము, కరుణ మొదలగు సుగుణములను గురించి ధ్యానింతము.

... ఓమ్ ...

# ప్రేమకొఱకు భగవంతుని ప్రేమింపుము

* ఆ. ఏల యభిలషింతు వీవు! ఓయి! కుమార!
దేవుఁజూడ నాత్మ, తివిరి! తివిరి;
అతఁడు నీదు జీవ మతఁడె నీ లక్ష్యము;
అతఁడె నీకు సర్వమయిన కతన?

* ఆ. లేద యేని, కష్ట మేదేని నేతెంచ
కష్టములు తొలంగ గాఁ దలచియు!
అదియె కారణంబెయైనచో తొలఁగగా
కష్టములు మరువగ గలవు దేవు!

* ఆ. కాన నేర్చికొమ్ము కమ్ర ప్రేమంబున
ప్రేమకొఱకు నతని ప్రీతిఁదలఁప:
అతఁడు లేక యున్న అంధ తమస్సగు
అతని కొఱకె ప్రేమ సతము గఱపు.

నా బిడ్డా! నీ యొక్క ప్రాణము. నీ ఆత్మ, నీ పరమావధి సర్వస్వము దైవమే. కాబట్టి నీకు భగవంతుడు కావలెనా? లేక తాత్కాలికముగా వచ్చెడి మేఘములవంటి కష్టములనుండి తప్పించుకొనుటకు తాత్కాలికోపశాంతిగా ఆయనను ప్రేమింపగోరుచుంటివా? నీదైనందిన జీవితములోని బాధలు. పరీక్షలు, దుఃఖములు తప్పించుకొనుటకు మాత్రమే భగవంతుని పొందదలచిన యెడల ఆ కష్టములు అంతరించినవెంటనే భగవంతుని మఱచి ఆయనను విడిచిపెట్టుదువు. మరల క్రొత్త ఆపదలు కలిగిన తోడనే భగవానుని స్మరించెదవు.

ఓ నా బిడ్డా! ప్రేమ కొఱకే భగవంతుని ప్రేమించుట నేర్చుకొనుటకును. ఆయనకొఱకే పనిచేయుటకును, శ్వాసించుటకును, ఆయన కొరకే జీవించుట నేర్చుకొనుటకును కాలము సమీపించినది. ఏలయనగ భగవానుడు నీ శ్వాసకు శ్వాసయై, జీవమునకు జీవమై, ఆత్మకు ఆత్మయై యున్నందున భగవంతుడుగాక ఇతరమంతయు అల్లకల్లోలము, అంధకారము, మృత్యువు. అందుచే భగవంతుని కొఱకే భగవంతుని ప్రేమించుము.

... ఓమ్ ...

# స్తుతికిని, నిందకును అతీతముగా నుండుము

* తే. చిదిపి చీమంత బెల్లమ్ముచేతఁబెట్ట
పరమ సంతోష మొందును బాలకుండు;
ఎదురు గొప్పు తగుల వెక్కి యేడ్చు - అట్లె
లౌకిక జనంబు బాలశ లక్షితంబు:

* ఆ. బ్రతుకు బాటయందు గతుకులు కల్గినన్
కుమిలి యేడ్చు జగము కూలినట్లు
చిరుపొగడ్త యొకటి చెవిబడ్డ యంతనె
బ్రహ్మరథములో సవారి సల్పు:

* తే. సుఖము దుఃఖము నొక్కటే చూపు చూడ
యశము దుర్యశంబుల నొక్కయట్లు చూడ
ద్వంద్వముల కభిన్నుఁడయి వర్తనము సల్ప
శాంతి తనయంత తానె నిజంబు కలుగు.

ప్రాపంచికములోని మనుజులు పసిబిడ్డల వంటివారు. బిడ్డలు కొంచెము మధుర పదార్థము దొరికినప్పుడు ఆనందింతురు. వారికి కొంచెము దెబ్బలు తగిలినప్పుడు ఏడ్చెదరు. స్తోత్రము చేయుచు పొగడుచు, సహాయమును ఇచ్చునట్లు ఉత్తరము వచ్చిన యెడల మనుజుడు అమితానందమును పొందును. అతడు అంతర్జ్యోతి అయిన భగవంతుని గూడ మఱచి మరల మరల తనకొనగబడిన సానుభూతి పలుకులను స్మరించి, ఆనందించుచు దినములకొలది కాలమును వ్యర్థపుచ్చుచుండును.

మరల దోష విమర్శగల జాబు నిందించుచు వచ్చిన యెడల దినములేగాక నెలల తరబడిని విచారించుచు, జీవితములోని విలువైన కాలమును వృథా చేయుచు, తనకెంత మాత్రము వర్తింపని ఖండన గురించి తలపోయుచు కాలము గడుపుచుండును. జ్ఞాని స్తుతులకు, నిందలకు అతీతుడై యుండవలెను. ఈ నిందను సహించుటకు మరియొక సహాయకరమైన మార్గమేదియన - నీవు విచారముగా నున్నప్పుడు నీవు అనుభవించుచున్న మంచిని, సుగణముల నన్నింటిని జ్ఞప్తికి దెచ్చుకొని విచారమును సంతోషముతోను, చెడును మంచిచేతను జయింపుము. ఈ ద్వంద్వ భావములకతీతమైన వారికే శాంతి చెందును.

... ఓమ్ ...

# భగవంతుని నిష్కామముగా ప్రేమింపుము

* తే. ఆ పరంధాము కొఱకు ప్రత్యహము నీవు
పరితపింతు వీతడు దయావార్ధి యనియ?
లేక-త్వత్క్లేశ మెల్ల హరింపఁబడుట
కొఱక! సౌఖ్యమ్ము నీకిచ్చు కొఱక! చెపుమ

* తే. పూర్ణమౌ ప్రేమకై తత్త్వబోధ కొఱకు
నైన - ఇది విను: మతడు నీలోనఁగలడు
తత్తనూగత రోమ కూపంబులందు
నెల్లెడల నిండి త్వద్యోగ మేచికొనఁగ,

* తే. ఛిద్రములు క్లేశముదుప వాంఛింతు వేని
దేవునిం జూడ; నాకేమి తెలియరాద
తని నిలుకడ; కష్టముల నాతనిఁదలంచు
నట్టివారి నడుగుము, వారతని గూర్చి

* తే. చెప్పగలరు: తద్దైవంబదప్పుడును, ప
సింప నేరఁడు పో స్వర్గసీమయందు
ఆయురారోగ్య భోగ భాగ్యంబు లొసఁగ
నెచటనో యుండు వారి పాలించు కొఱకు

* ఆ. వెఱ్ఱితండ్రి! యొండు ప్రేమమ్ము కొఱకునే
అతని గోరు దేని - యరుగు దెమ్ము
నా సమీపమునకు - నలుగడల్ చూడుము
కలఁడతఁ డిట సర్వకాలమందు.

భగవంతుడు ప్రేమమయమే కావున ప్రేమకొఱకే భగవంతుడు కావలెనా? లేక నీ జీవితములోని కష్టసుఖములను సర్దుబాటు చేయుటకు మాత్రము భగవంతుడు కావలెనా? ఫలాపేక్షలేక ప్రేమ సత్యములకొఱకే నీవు భగవంతుని ధ్యానించిన యెడల ఆయన ఆది నుండియు నీయొక్క ప్రతి అణువునందును ఆవరించి నీలోనే యున్నాడు. నీకును భగవంతునకును ఎడబాటుగా నున్నది ఒక క్షణమైనను లేదు. నీ కష్టములను తొలగించుటకు, నీకు వరములు ప్రసాదించుటకును మాత్రము భగవంతుడు నీకు కావలసిన యెడల అతడెచ్చటనున్నాడో నాకు తెలియదు. కష్టములను తొలగించుటకొఱకే భగవంతుని వెదకునట్టి మనుజుల దగ్గరకే మీరు కూడ వెళ్లుడు. వారికి సేవచేయుట కొఱకును, వారికి ఆరోగ్యము నిచ్చుటకును, గొప్ప ఐశ్వర్యము లొసంగుటకును, ఇంకను ఇతర ప్రాపంచిక సౌఖ్యములొసంగి వానిననుభవించుటకును, దీర్ఘాయువు నిచ్చుటకు, దూరముగా పరలోకములో యున్న తమ భగవంతుని యొద్దకు వారు మిమ్ములను పంపుదురు.

ప్రేమాస్పదుడా! ప్రేమకొఱకే నీకు భగవంతుడు కావలసిన యెడల నావద్దకు రమ్ము, చూడుము, అతడు నీయొద్దనే, నీలోనే అప్పుడును, ఎల్లప్పుడును ఉన్నాడు.

... ఓమ్ ...

# సమస్తమును లోపలనుండియే వచ్చును

*　　తే.　　సర్వ మావిర్భవించు ప్రశాంత హృదయ
కుహరమున నుండి – నీయూహ కొమరు ప్రాంత
ఆశ్రమము; నిరాకృతిని రూపజాల మమరు;
ఏది నీవాచరింప నూహింప తలంపు
పూనెదొ అది నిశ్శబ్దాన పుట్టు; బుద్బు
దంబు వార్కు ఉదధిని జన్మంబు గనవె.

*　　ఆ.　　పువ్వు మొగ్గనుండి పుట్టు; మొగ్గ పొడము
చెట్టునుండి; కార్య ముట్టి పడును
పలుకు నుండి, పలుకు లొలుకు భావంబున,
భావ ముదయ మొందు బ్రహ్మ నుండి:

సర్వము లోపలనుండియే వచ్చును. ఈ ఆశ్రమము, ఈ ప్రపంచము, ఆలోచనలు, వ్రాతలు అన్నియు లోపలనుండియే వచ్చును. నిశ్శబ్దము నుండియే శబ్దము వచ్చును. అరూపమునుండియే రూపము, వర్ణము వచ్చును. నీవు ఆలోచించినది, మాటలాడినది, చేసినది అంతయు లోపల నుండియేవచ్చును. నీవికముందు ఏమి ఆలోచించునది, మాటలాడునది, చేయునదికూడ ఆ మూలము నుండియే అనగా ఆ మహా మౌనము నుండియే వచ్చును, నీటి బుడగ అల నుండి వచ్చును. అల మహాసముద్రము నుండి వచ్చును.

పుష్పము మొగ్గనుండి వచ్చును. మొగ్గ మొక్కనుండి వచ్చును. కార్యము పలుకు నుండి వచ్చును. పలుకు ఆలోచన నుండి వచ్చును. ఆలోచన ఆ మూలము నుండి అనగా ఆంతర్యము నుండి వచ్చును. చరమముక్తిని లేక అనంతశాంతిని పొందుటకు వ్యక్తమగు ప్రతీ వస్తువు బ్రహ్మాండమున అంతరంగమున లీనము కానిమ్ము.

... ఓమ్ ...

# ప్రతిక్షణము అమూల్యము

* తే. వ్యర్థమైనట్టి వ్రాంతల వ్రాసి వ్రాసి
పుణ్యకాలమ్ము వ్యర్థమ్ము పుచ్చుకంటె
ఆత్మ సాక్షాత్కృతిని నంద నభిలషింతు
అతని సన్నిధి కాల మనర్ఘ మగుట

* తే. లోన వెలుపల వెల్గు చిద్రూపు దర్శ
నమ్ము సర్వచైతన్యమ్మునకును మొదలు:
నలుబది దినాల యుపవాసములకు నేడు
చరమ దివసంబు: మది చరాచరములైన
జీవకోట్ల తద్రూప సంసిద్ధిగాంచి
ద్వైత రాహిత్యమున నుండ దలంతు నేను.

ఈ సందేశములను వ్రాయుటలో విలువయైన కాలమును వ్యర్థపుచ్చుట కంటె ప్రతి అణువునందుచొచ్చియున్న ఆ దివ్య సాన్నిధ్యమును పొందుటకే పూర్వముకంటె హెచ్చుగా కోరుచున్నాను. అయితే ఆ దివ్య సాన్నిధ్యమును అనుభవించుచున్నంత కాలము విలువయగు కాలమును నేనెట్లు వ్యర్థపుచ్చి నట్లగును? తత్ అను ఏకైక సత్యము అనగా అంతర్జ్యోతి యందే యెవరైనను లగ్నమై యున్నంతకాలము క్షణమైనను వృధా అగుటలేదు. కార్యకలాపములోను, నిశ్శబ్దములోను అదియే పనిచేయును.

అయినను ఉపవాస దీక్షలో ఇది నలుబదియవ దినము కావున ప్రతిక్షణము విలువగలదిగా భావించుచున్నాను. ఉపవాసదీక్షయందలి ఈ కడపటి దినమును నేనెట్లు వినియోగింపవలెను? సహజముగా ఈనాడు ఆ దివ్యసన్నిధిని, లోపలను, వెలుపలను నాలోనేగాక ఇతరులలోను, ఆయేకైక భగవంతుని అజ్ఞానులైన బిడ్డలలోను, శత్రువులనంబడెడి వారియందును గాంచుచు గడిపెదను. ఓ ప్రభువా? లోపలను, వెలుపలను, మీదను, క్రిందను, అన్నివైపులను, ప్రతిదిక్కునకును, ప్రతి ఆకారములోనున్న ఘనత అంతయునీదియే!

... ఓమ్ ...

## ఈష్టరు - భానువారము

*	తే.	నాదు దీక్షా సమాప్తియు నళిన నాభు
క్షీర సాగరోత్థానమ్ము చేయు పుణ్య
కార్తిక ద్వాదశి యును నొక్కండె యగుట
చిత్రముగ సమాపతితమ్ము; క్షీరజలధి.

*	తే.	విశ్వ విశ్వంభరుని మూర్తి వేఱుగాక
నన్ను తోడి నానావస్తు సన్నిధాన
వంతముగ నొక్కడై వెల్గు: వ్రత ఫలంబు
ఇంతకును మించి యొండు వేఱేమి నాకు.

ఈనాడు ఈష్టరు భానువారము. క్రైస్తవులందరికి నీ దినము పవిత్రమయినది. క్రీస్తు ప్రభువును ప్రేమించువారలకును; వారి అనుచరులకును భక్తులందరకును ఈ దినము అత్యంత పావనమైనది. ఇది చాల అద్భుతముగా కలసి వచ్చినది. ఇది ముందుగా ఏ ఆలోచన, ఏర్పాటు చేయకుండగనే, ఈ పవిత్ర ఈష్టరు ఆదివారము నా నలువది దినముల ఉపవాసదీక్షయొక్క కడపటి దినమగుట అద్భుతముగా తలవని తలంపుగా, కాకతాళీయ న్యాయముగా సంభవించినది.

అన్ని దినములకంటెను నేడు ఎక్కువగా క్రీస్తు ప్రభువునకు ఈ భూలోకమందు ఈ దేహము కంటె అన్యముగా, మరియొకటిలేదను భావము ఎక్కువ ప్రభావముగ నా భావ ప్రపంచములో నేడు పొడచూపుచున్నది. ఈ నలువది దినములలోని ఉపవాసము యొక్క ఫలితముగా ఈశ్వర ప్రేరితమై ఆత్మానుభవము కలిగించు ఈ ఒక్కభావము చాలదా?

ఈనాడు స్థూల దేహమునకూడ, ఏవిధమైన మార్పులుగాని, రూపమునందు పోలికలుగాని ఉన్నవా? యని తదేక దృష్టితో, ఆ దివ్యమైన క్రీస్తు ప్రభువు యొక్క విగ్రహమువంకను, పటములవంకను, బాహ్యమున గూడ చూచుచుంటిని, అయినను, క్రీస్తునందుగల పరిశుద్ధాత్మయే నాయందుకూడ ఉన్నదనుటయే నాకు ఆనందము, ఓదార్పు, బలము. అది నీలో గూడ శాశ్వతముగా ఉన్నది.

... ఓమ్ ...

# ఎన్నడును ఫిరియాదు చేయకుము

*　　తే.　　"అతని" తోఁ బూనిక వివాదమాడ వలదు;
ఆడితివ యేని, దూరంబెయగు.　నతండు:
దేవ తాదాత్మ్య భావ సందీప్తి విధికి
ఇది "యుపాసన" ఋషులాచరించినారు;

*　　ఆ.　　పరమవైరి గళము పట్టి పీడించినన్
హృదయమిచ్చి మిత్రుఁడేపుఁజూడ
నపుడు నిపుడు కూడ ఆత్మ సాక్షాత్కృతి
నొందగల్గ చరిత మొందు జన్మ,

*　　తే.　　ఈతి బాధల వేర్వేర నెన్ను కొనుచు
దైవమును దూరిపోయగాఁ దగదు: ద్వంద్వ
భిన్నుడవయి ఆంతర్య దీపితుఁడవగుచు
ఋషుల పోలిక వెల్గి రాణింప వలదె!

"నీవు భగవంతునితో ఐక్యపడదలచిన యెడల ఫిరియాదు చేయవద్దు. ఫిరియాదు చేసిన యెడల ఆయనతో ఐక్యమును పొందజాలవు" అని ఒక మహమ్మదీయ మహాత్ముడు తన పరీక్షలలోను, శోధనలయందును పలికిన ఈ పై విజ్ఞాన పదములు నేడు నాకంటపడెను. భగవంతునితో తాదాత్మ్యము నొందునప్పుడు ఇది చరమ పరీక్ష. ఎవరైనను నిన్ను చంపుటకు రెండు చేతులను నీ మెడకు చుట్టి నులిపిన యెడల, నీవు భగవంతుని మనోహర ముఖారవిందమును మాత్రమే వానియందు చూడవలసియుండును. ఎవ్వరైనను ఒక చేతితో నిన్ను ప్రేమతో ఆలింగనము చేసికొని రెండవ చేతితో నీ వీపుమీద కత్తితో పొడిచినను ఆ చేతి స్పర్శలో కూడ భగవంతుని దివ్యసాన్నిధ్యమును నీవు అనుభవింపవలెను.

అప్పుడే నీలోగల తేజస్సు దివ్య ప్రభలతో ప్రకాశించును. పూర్వము, మహాత్ములు, మహాఋషులును ఈవిధముగానే చేసిరి. వారెన్నడును వారి బాధలను, కష్టములను గురించి మొఱపెట్టుకొనలేదు. నీవుగూడను భగవంతుని గుర్తించుట కిదియొక మహదవకాశము. ఇతరులు చేసినది నీవేల చేయజాలవు? నీవిప్పుడే ఆ పద్ధతిని అవలంబించి మానవ ప్రపంచమునకు వరప్రసాదముగా నుండుము.

... ఓమ్ ...

# మౌనము బంగారము, వాక్కు వెండి

* తే. మౌన సద్ర్వతమూని యీ ప్రొద్దుదనుక
నిందు నిశ్శబ్దమున బ్రహ్మ నియతి గంటి;
తేపకడ నుండి బ్రహ్మ నర్చింతు శబ్ద
మున మధుర మార్దవ క్షమా స్ఫూర్తి వెలుగ

* తే. పదములెల్ల వజ్రమ్ములు: భావరాజి
వార్షుకాభ్ర శంపాలతా భాస మాన
దివ్యతేజః ప్రపూర్ణ సందీపితంబు
గళిత మరణ నాశమ్ములై గ్రాలవలయు,

* తే. "మాట వెండి; నిశ్శబ్దము మౌనమరయ
పసిడి" యన్నది యెంతటి పరమసత్య
మో! మహర్షిగణము మౌనమున ప్రపంచ
శుభ సమారంభులైరి: విశుద్ధ వాక్కు
శాంతిదము శక్తిదము పూర్ణ కాంతిదమ్ము:

ఈ నలుబది దినముల నుండి నేను మాటలాడుటలేదు. నలుబది దినముల మౌనపు విందు ఈ రాత్రితో ముగియును. రేపటి నుండి నేను మాటలాడు దినమున మరల గడబిడతో గూడిన జీవితము ప్రారంభమగును. అయినను అత్యవసరమైనప్పుడు మాత్రమే మాటలాడి, మిగిలినకాలము మౌనముగా నుండ గోరుచున్నాను. నేను మాటలాడునప్పుడు, నా వాక్కులు మాధుర్యముతోను, ప్రేమతోను, కరుణతోను, క్షమతోను నిండియుండుట నాకు మిగుల వాంఛనీయము. అవి శక్తివంతము, తేజోవంతమునగు పిడుగులవలె నుండవలెనుగాని నాశనము, మరణముతో కూడినవిగా నుండరాదు. నా యాలోచనలు కూడ మెఱుపులవలె నుండవలెనని ఇచ్ఛగించుచున్నాను. నిజముగా మౌనమునందు శక్తి కలదు. "మౌనము బంగారము, వాక్కు వెండి" అను మాటలు యెంత నిజము! ప్రపంచమునకు మేలుచేసిన గొప్ప మహానుభావులందరును మితభాషులే అయియుండిరి. పలుకులే శక్తితో కూడిన పిడుగులుగాను, భావములే శాంతి, తేజస్సుతో కూడిన మెఱుపులుగాను ఉండనిమ్ము.

... ఓమ్ ...

# తనమీద తానే యాధారపడుట

* తే. "స్వాత్మ విశ్వాస మాత్మ తేజః ప్రకాశ"
మగు మహోపదేశము-నిత్యమైనదొకటి:
ప్రాచ్య పాశ్చాత్య దేశ విపశ్చితాళి
ద్రష్టృజన మైక కంఠ ప్రస్తావితమ్ము

* తే. ఆత్మ విశ్వాసమున మత మవతరించు
ఆత్మ విజ్ఞానమున మతమంతమొందు:
ఆత్మ విశ్వాసమున వినా, భయ ప్రరూఢ
దైన్యరోగ విషాద దిగ్ధంబు తనువు

* తే. ఆత్మ విశ్వాసి యొకఁడె సౌఖ్యంబు నొందు:
స్వాత్మ నాధారపడుటయే బలము: నేన
తండ - యంతర్బహిశ్చ యత్సర్వగతు డె
వండొ - పరమాత్మ యనెడు భావంబు కలిమి.

స్వశక్తి స్వప్రకాశముల యొక్క ఉపయోగము తూర్పుపడమరల దేశమందలి యోగులు, మహాత్ముల జీవిత సందేశమైయున్నది. మతము స్వశక్తితో ప్రారంభమై ఆత్మసాక్షాత్కారముతో పూర్తియగుచున్నది. ప్రారంభములోను, మధ్యను, చివరను స్వశక్తియే యదార్థమగు జీవితము. స్వశక్తిపైని ఆధారపడని జీవితము, భయములు, విచారములు రోగములకుప్పగాక మరియేమి?

తన సుఖము కొఱకును, శాంతము కొఱకును తదితరమైన వ్యక్తిపైని ఆధారపడక తన శక్తిపైనే ఆధారపడియుండు మనుజుడు అత్యంతసుఖి. దివ్యశక్తి యెచ్చటనైనను యున్న యెడల అది స్వశక్తిలోనే యున్నది. అప్పుడు మానవుడు లోపలను, వెలుపలను శాశ్వతముగా అనంతముగా సర్వత్ర వ్యాపించియున్న ఆత్మయని తెలిసికొనును.

... ఓమ్ ...

# తన అపజయము నొప్పుకొనినవాడే యోడిపోయినవాడు

* తే. తానె పరమాత్మ : సృష్టికర్తయును దానె:
ఆర్ద్ర జీవ రూపము : పరమాత్మ కతఁడె:
ఏల తాఁ బరాజయము గ్రహింపవలయు?
అపజయం బెట్టులగు నతఁడాత్మయైన ?
అతఁడు పతితుఁడగు పరాజయమ్మునెంచ.

* తే. ఇనుప కాళుల దుర్జనుఁడెంత మట్టి
గద్ది కరిపింప: హృద్దీప కలిక వెల్గు
నంతదాక పరాజయం బంట లేదు;
సర్వశక్తి మంతము సర్వసాక్షి, వ్యాప్త
సర్వలోక మాత్మయె: అలజడు ల వెన్ని
రావు నగుదు వీవు సాక్షి మాత్రంబు సుమ్ము.

అపజయమును అంగీకరించినవాడు ఓడిపోయినట్లే. అపజయమనునది యేమి? అది ఓడిపోతినని యొప్పుకొనుట. బలహీనతయే భగవంతుని జీవిత విగ్రహమైన మనుజుడు ఏల బలహీనతను, అపజయమును అంగీకరింపవలయును? సృష్టికర్తయైన భగవంతునితో ఐక్యముననుభవించని మనుజుడు వ్యాధిని, బలహీనతను ఎట్లు అంగీకరింపగలడు, ఆత్మలకు ఆత్మ అయిన ఆత్మను కలిగియున్నవాడు నిస్సహాయుడుగను, ఆత్మహీనుడుగను ఎట్లగును? ఆంతర్య తేజస్సును నిరాకరించినంత కాలము ఎంత పీడింవబడినను చివరకు హింసావరుల కాలిక్రింద త్రొక్కబడి నలిపివేయబడినను, అపజయము నంగీకరించ నవసరము లేదు. అందుచేత నీవు ఆ శక్తి యుతమైన ఆత్మవై యుండుటచేత సర్వవ్యాపకము, సర్వజ్ఞత్వము, సర్వశక్తి యుతమైయున్నావు. కాబట్టి జీవితములో నొదుదుడుకులెన్ని వచ్చినను నీవెల్లప్పుడును సాక్షి స్వరూపుండవే!

... ఓమ్ ...

# అంతరంగము నుండి సూర్యోదయము

* తే. ఏల సూర్యోదయము నిరీక్షింతు నేను;
ఈబహిః ప్రపంచము ప్రకాశింపఁజూడ
సూర్యులకు సూర్యుడై వెల్గు, సూర్యుడాత్మ
శాశ్వతుండయి లో ప్రకాశమ్ము జిమ్ము

* తే. ఎవ్వరీ యాత్మ సూర్యదీప్తిద్యుమతులో
వారలాత్మ ప్రకాశ సంజ్వలితమతులు;
అదియె "ఆత్మ" దీపములకు, నదియె దివ్వె
అద్వితీయ మనన్య మనంతమరయ;

తరచు నేను సూర్యోదయమునకై యెదురు చూచుచుందును. మిణుకుమిణుకుమను ప్రకాశము నెమ్మదిగా నిశ్శబ్దముగా జగత్తంతయు తేజస్సుచే నింపబడి యుండుట చూచుటకు చాల రమణీయముగా నుండును.

ఈనాడు సూర్యబింబము దిక్చక్రము నుండి వెలికి వచ్చుటకు నేను చాలసేపు వేచియుండవలసి వచ్చినది. పిమ్మట ఈ క్రింద నుదహరింపబడిన భావము తట్టినది - నీలోపలనే సూర్యబింబములోకెల్ల సూర్యబింబము శాశ్వతముగా ప్రకాశించుచు తెలిసికొనబడుటకు వేచియుండగా ఇప్పుడు నీవు ప్రపంచ తేజస్సైన బాహ్య సూర్యుని కొఱకు ఎందులకు నిరీక్షింపవలయును? ఎవరైతే తేజస్సులలో కెల్ల తేజస్సైన అంతర్యమున గల సూర్యబింబముపై ఆధారపడియుందురో అట్టివారు బాహ్య సూర్యుని రాకకొరకు ఎదురుచూడ నవసరములేదు. అద్వితీయమైన స్వప్రకాశమగు ఆత్మయొక్క తేజస్సుచేత అట్టివారు సదా నింపబడియున్నారు.

... ఓమ్ ...

## ప్రకృతితో ఏకత్త్వము

* తే. "వృక్ష గుల్మ లతాది సంప్రీతి సౌమ
నస్యము: మధుర వాసనా భరితము సుమప్ర
భూత పరిమళ ప్రీతి సమ్మోద కలిత
విహగ కూజితము నను‌భవించు నేను

* తే. అచలమై నీలమై యున్న అద్రి శిఖర
మరసి తద్భంగి ధైర్యహేమాద్రినగుదు:
నెగడు నక్షత్ర గోళమ్ము నింగిచూచి
వానితో బాంధవము సముద్భవము నాకు

* తే. ఇవియు నవియననేల వీరిందరంద
రరయ నాకు నాత్మీయులే యగుదు-రేల
మౌఢ్యమూర్తి: స్వార్ధపరుడు మంకువాడు
మానవుం డొండు ప్రత్యర్థియైనవాడా!

* తే. తన్ను ప్రేమించువానికి తల్లి ప్రకృతి
ప్రీతి నొలికించు ఎవ్వరీ రీతి ప్రకృతి
పూజ సల్పి ప్రేమింతురో పుణ్యమతులు
వారు : తలపోయ పరమాత్మ ప్రకృతికాదె

ఈ పొడవైన వృక్షములను, చిన్న మొక్కలను, ప్రాకునట్టి తీగెలను, తదేక దృష్టితో చూచుచుండిన - వానియొక్క యేకీభావమునకును, సానుభూతికిని నాకు చాల ఆనందముగా నుండును. ఆ ప్రేమ యొక్క పరిమళమును పుష్పముల సువాసనలో అనుభవించుచుందును. చిన్న పక్షులయొక్కయు, పెద్ద పక్షుల యొక్కయు, మృధుమధుర గానస్వరములు వినుచుండిన వాని సహవాస ప్రేమకు నాకానందము కలుగుచున్నది. నేను అన్నివైపులను చూచునపుడు నీలమగు పర్వతముల అచలత్వము నుండి ఒకవిధమైన శక్తి నాకు కలుగుచుండును. మరల రాత్రి సమయమందు ప్రకాశవంతమైన ధగ ధగ మెఱయు నక్షత్రములుగల ఆకాశమువైపు చూచుచుండ నాతో వానికిగల బాంధవ్యమును గుర్తించుచుందును.

ఇవన్నియు నావై యున్నప్పుడు ఒక మనుజుడు అజ్ఞానియై, స్వార్థపరుడై గర్వియై నన్నెదురుకొనినను నాకేమి? దైవమును తప్ప అన్యమును జూచుట దుర్బలత్త్వము అజ్ఞానము. ప్రకృతి తనను ప్రేమించువానికి ధన్యవాదము లర్పించుచున్నది. ప్రకృతిని ప్రేమించువారు ధన్యులు, నిజముగా ఇదంతయు భగవంతుడే!

... ఓమ్ ...

# మిక్కిలి భాగ్యవంతుఁడెవఁడు?

* తే. సర్వ సర్వజ్ఞతా శక్తి సంకలితము
స్వల్ప కాలాంశముల ప్రయోజనమొనర్చి
పుడమిలో భాగ్యవంతుల మొదటివాడ
నగుచు తులలేని సిరితోడ నెగడఁదలఁతు:

* తే. ఈ యమూల్య స్థితి కలుగ దింత వ్యర్థ
మౌ, వ్యయంబున, నవివేకమౌ వ్యయాన:
ఎవఁడు భాగ్యవంతుఁడు, వా డహీనబలుఁడు
శక్తిమంతుఁడతండు విరక్త భయుఁడు:

* తే. అభయుడు నవన్యశక్తి యుక్తార్యుడొందు
స్వర్గము పరమ శాంతియు సద్గతియును
అల్పునకు నాత్మ దైన్యున కందులౌదు
తావు భాగ్యశాలివికమ్ము - తత్పరమతి
అర్థమగు రీతి కాలవ్యయమ్ము సల్పి

ఈ ప్రపంచమంతలో ఈ చిన్న అమూల్యమైన క్షణములను సద్వినియోగముచేయుచు నేను గొప్ప ధనవంతునిగా నుండుటకు కోరుచుంటిని. ఈ ప్రతీక్షణము యొక్క హృదయములో సర్వవ్యాపకత్వము, సర్వశక్తి మరియు సర్వజ్ఞత గలిగియుండును. నాలో యున్నదానిని నేను సద్వినియోగము చేసినప్పుడే అది వృద్ధి అగును.

అమూల్యమైన క్షణములతో కూడిన నా సంపత్తును ఏదో యొక పేరుతో దుర్వ్యయముచేసి వ్యర్థము చేయకుందునుగాక? మిగుల భాగ్యవంతుడు మిక్కిలి శక్తిమంతుడు అగును. మిక్కిలి శక్తిమంతుడు మిగుల నిర్భయుడు కూడను అగును. అట్టివారికే స్వర్గలోకము శాంతియుత స్వర్గము చెందును. కాని భయముతో కూడినట్టియు, ఆత్మహీనులైనట్టియు బలహీనులకు ఆ స్వర్గలోకము లభింపనేరదు.

ఈ ప్రశస్తమైన క్షణములను మంచి ఉపయోగములోనికిపెట్టి మనము సదా భాగ్యవంతులుగా యుందుముగాక!

... ఓమ్ ...

# ఉపవాసదీక్ష పూర్తియైనది

* తే. పూరమయ్యె నిరాహార పుణ్యదీక్ష:
షడ్రసోపేత మృష్ట భోజనము ముగిసె;
తద్వ్రతోద్యాపనము దరిద్రార్చనముల
అన్నవస్త్ర దానంబుల నయ్యెనంత:

* తే. నాల్గుపదుల రోజుల వెన్క నాల్క పెదవి
మౌనముద్రా భంజకమొకమాటరాదు:
అశ్రులురలు; గాద్గదికమై యలరు గళము :

* తే. మౌనవ్రత దీక్ష ఇటు సక్రమమ్ముగాను
జరుగ సహకరించిన సాధుజనుల కేను
నా కృతజ్ఞతతో దీవనల నొసంగి
కొల్తుపరమాత్మ వారిమేల్ కొఱకు నేను:

చిట్టచివరకు స్వాతంత్ర్యము! ఉపవాసము పూర్తి అయినది. విందు ముగిసినది. పరమానందముగా ముగిసిన ఉపవాస దీక్షయొక్క జ్ఞాపక చిహ్నముగా భగవంతుని అమూల్య ఆశీర్వాదములకు పరమాత్ముని స్తుతించుచు వస్త్రహీనులకు వస్త్రములను, బీదలకు అన్నదానమును చేయబడెను. ఆశ్రమమునందు ప్రత్యేక ప్రార్థనలు ధ్యానములు జరుపబడెను. ఒక భక్తసోదరుడు మద్రాసు నుండి ప్రత్యేకముగావచ్చి ఈ కార్యమునందు సహాయభూతుడై ఆనాటి సమావేశమున కధ్యక్షత వహించెను.

నలుబది దినముల మౌన వ్రతము పిమ్మట మొదటిసారి నన్ను మాటలాడమని కోరిరి. అయ్యో! వాక్కులు వెడలలేదు. కాని ఆనంద భాష్పములు ప్రవహింపసాగెను. నేను మాటలాడుటకు ప్రయత్నించినపుడు నా కంఠస్వరము బొంగురుపోయి మిగుల బలహీనముగా నుండెను. నేను మాటలాడలేకపోతిని. దూరమునుండియు, దగ్గర నుండియు వచ్చిన భక్తుల ద్వారా ఈ ఉపవాసమును పరమానందముగా ముగింపజేయుటకు భగవంతుడు నాకు అన్నివిధములను తోడ్పడెను. పరమాత్మ వారిని,మిమ్ములను, అందరిని ఆశీర్వదించుగాక?

... ఓమ్ ...

# అతిశయోక్తి

* తే. అతిశయోక్తిగ యొకదోషమనఁగ రాదు;
అదియు సర్వత్ర జీవితమందు నణగు:

* * * *

* తే. మాకుటీరాంగణమున నిమ్మయొకటి ప్ర
తిదినము పదికాయలొసఁగి దీక్షసలుప
సహకరించె నటంచతిశయపు వ్రాఁత
వ్రాసి యుంటిని: లెక్కింప - వరలెనందు

* తే. కాయ లైదుమాత్రమె: సత్యకామినగుట
దిద్దుకొంటిని నా వ్రాఁత - తిరుగ నేను:
ఆత్మ వృద్ధికి చిరుత, పెద్దనఁగ లేదు:
జ్ఞానమమరు నన్నింట జిజ్ఞాస కలుగ

అతిశయోక్తి సాధారణముగా తప్పు క్రింద పరిగణింపబడుటలేదు. మనము వానిని సామాన్య విషయముగ విడిచి వేయుదుము. అది సాధారణ మానవుని జీవిత దినచర్య, కొంచెమును గొప్పగాచేసి జెప్పుట నేరము కాకపోయినను, మచ్చ, అసత్యము కూడనగును. నా దీక్షకాలములో వ్రాయబడిన తెలుగు సందేశములలో ఒకదానియందు, నా స్నానపు గది సమీపమున నున్న నిమ్మచెట్టు, నిమ్మకాయలు దొరకని వేసవిలో సుమారు 10 నిమ్మపండ్లను నిచ్చుచు నాకు సహాయకారిగా నుండెనని వ్రాసియుంటిని.

ప్రతి దినము ఆ నిమ్మ చెట్టును చూచినప్పుడెల్లను "నీవు నిమ్మకాయల సంఖ్యను పెంచి చెప్పుట లేదా" అను ప్రశ్న నాకు తోచుచున్నది. పిమ్మట లెక్కపెట్ట మొదలిడితిని, 1, 2, 3, 4, 5 బహుశ 10 నిమ్మకాయలు లేకపోవచ్చును. తక్కువ నిమ్మకాయలే యుండవచ్చును. ఆవిధముగా ప్రతిదినము నాకు తెలియకనే లెక్కపెట్టుచుందును. చెట్టు నిండుగా ఆకులుండుటచేత కాయలు ఆకులలో దాగిపోవుచున్నవి.

అయినను నా ఆత్మశాంతి కొఱకు నా సందేశములలో రూఢిగా చెప్పవలెనన్న నిమ్మకాయలను 1 నుండి 5కు మార్చితిని. మానవుడు ఈవిధముగా చిన్న విషయములందును, పెద్ద విషయములందును మార్చుకొనుచు అభివృద్ధి నొందవచ్చును.

... ఓమ్ ...

# చరిత్ర మరల మరల సంభవించుచుండును

*  తే.  సిలువ క్రీస్తును నాఁటిన చెనటు లచట
కలహమాడిరి తత్కంచుకమ్ము కోరి:
త్రాగి తందనాల్ త్రొక్కి మోదంబు గనిరి:
ఎద జలదరించు తద్ఘోర కృత్యమరయ
వారికొక క్రీడ యయ్యె సంబరము నయ్యె:

*  ఆ.  స్వార్థ మౌఢ్యమూల బాధాచరణ లిప్పు
డప్పుడనగ నేల నెప్పుడుండ్రు :
సజ్జనాళి ద్రుంచి సంతసం పడెదరు
కూళలతని తెలిసికొనరు ముప్పు:

*  *  *  *

*  తే.  ఈ మహా కృత్యమును నాచరించినట్టి
క్రూరులాత్మ హత్యను చేసికొనిరి పిదప:
ఎట్టివారైన చేసినదెంతొ యంత
యనుభవింపక తీరదటండ్రు బుధులు:

శిలువమీద క్రీస్తు ప్రభువును, అతని పాదములదగ్గర కూర్చుండి పేకను ఆడుచు, త్రాగుచు, ప్రణామములు చేయుచున్న కఠినహృదయులగు క్రూర సైనికులుగల పటము ఈ దినములలో తరచు నా దృశ్యములో కనబడుచుండును. ఆ దివ్యమైన క్రీస్తుప్రభువు ధరించిన అంగీని యెవరికి చెందవలెనని చీట్లు వేయుచున్నట్లు కూడ కనబడుచున్నది. క్రూరముగ, హృదయ విచారకముగ, బాధాకరముగ క్రీస్తును శిలువవేయుట వారికి పెద్ద హాస్యముగా నుండెను. ఈ దినములలో కూడను ఇటువంటి విషాద నాటకములెన్నియో అమాయక ప్రజలపై గర్విష్టులును, స్వార్ధపరులునగు అజ్ఞానులచేత ప్రయోగింపబడుచున్నవి. అమాయకులను హింసించుటలో తాత్కాలికముగా కనిపించు జయముననుసరించి వారొక విధమైన ఆత్మసంతుష్టిననుభవించెదరు. వారెన్నడైనను క్రీస్తు ప్రభువును శిలువ వేయించిన రోమన్ సైనికుల భవిష్యత్తు గతిని గూర్చి ఆలోచించుదురా?

క్రీస్తు ప్రభువును శిలువవేసిన క్రూర సైనికులలో ఒకడు ఆత్మహత్యను గావించుకొనెననియు, మరియొకనికి మతి చెడెననియు, ఇంకను జీవించియున్నవారలు అవమానస్థితిలో అంతమొందిరనియు చరిత్ర చెప్పుచున్నది. అమాయకులను హింసించునట్టి, తాత్కాలికమైన జయమును చూచి సంతసించు, ఆధునిక రోమన్ సైనికులు ఎవరిని రక్షింపక, విడువక "ఎంత విత్తితే అంతే ఫలిత" మను లోకోక్తి ప్రకారము ఎవరి కర్మఫలమును వారు అనుభవించి తీరవలసినదే అను భవిష్యత్తును జ్ఞప్తిలో నుంచుకొని జాగ్రత్తపడెదరుగాక!

... ఓమ్ ...

## భగవంతుడొక్కడే ఆశాభంగము చేయడు

* తే. విశ్వమడియాసలకు పుట్టవేశ్య; మెవని
విశ్వసించి, సర్వాత్మనా – “వీఁడు నాకు
నరయ నాత్మీయుఁ” డని భావమందు నెంతొ
అతఁడు – పరీక్ష వేళ, నిన్నాదు కొనఁడు !:

* తే. ఒక్కఁడే యొక్కఁడాత్మయుఁడొప్పు: అతఁడు
దైవము పరమాత్మ! మఱెంత తడవు నీవు
బాహ్య వాచా ప్రభావ సంపత్తుచేత
వ్యర్థ మర్త్యుపై నాధారపడినగాని
ఒందుగా దడియాస, మఱొందుగాదు;
వంద వే లడియాశల నందఁగలవు.

* తే. ఎంత విశ్వాస పాత్రుడైఁ యొసఁగెనేని
నిన్ను నడియాసపాల్సేయకున్నె జనుఁడు,
భంగ మొందింపఁడొకఁడె దై వమ్ము సుమ్ము
““అతఁడదృశ్యుఁడై యుండు నీయాత్మలోన”

* తే. అహహ మాయ యెంతగ బలీయంబు: ప్రాజ్ఞు
లైనగాని, స్వాత్మ వసించునట్టి జ్యోతి
నాశ్రయింపరు: బడుగు మర్త్యాళితప్ప !!
అడుగడుగునకు మున్వచ్చి యడ్డుతగులు
నెల్ల యడియాస లగుత విశ్వేశు దివ్య
భవన మెగఁబ్రాక శ్రేణుల వరుసగాగ

ప్రపంచమంతయు ఆశాభంగములతో నిండియున్నది. తఱచు నీవు నీ స్వంతమని నమ్మినవారే నీ కష్టసమయమునందు నీ అండనుండక తప్పించుకొని నీకు నిరాశ గల్గించుచుందురు. నీవు నమ్మదగినవాడు పరమాత్మయగు భగవంతుడు ఒక్కడే. బాహ్యవచనములకు సులభముగా లోబడు బలహీనునిపై నీవు ఆధారపడి యుండునంత కాలము ఒకటికాదు సరికదా, వందకాదు, వేయికాదు, లక్షలకొలది ఆశాభంగములు నీకు కలుగుచునే యుండును.

మనుజుడు ఎంత నమ్మకమైన వాడైనను మనకు ఆశాభంగము కలిగించును. కాని అట్లు చేయనివాడు ఒక్కడు మాత్రమే, అతడు అగోచరమగు నీ ఆత్మలోనున్న భగవంతుడు. అంతర్జ్యోతిమీదకాక బాహ్య మానవునిపైని జ్ఞానులను కూడ ఆధారపడునట్లు చేయు మాయ ఎంత దట్టమై మోసపుచ్చుచున్నది! సమస్త ఆశాభంగములను అవరోధములను సోపానములుగా ఉపయోగింపబడుగాక!

... ఓమ్ ...

# అనంతమగు శక్తి నీలోనే యున్నది

* ఆ. ఒక్క చిన్న చేప నుదధిపై గ్రాల్తువ్వ్రె;
భయముచేత నబ్ధి వణికిపోయె:
ఇదియొక కత: ఇట్లె ఎంతటి శౌర్యస
ముద్రులైన భీతి పొందుచుంద్రు

* ఆ. అల్ప వస్తుగణము నారసి జీవిత
మను సముద్రమున నయంబు గనుము:
ఓయి! పూజ్య! చేప లుదధిలో నెంతెంత
పెద్దవున్న ఎన్ని వేలు కోటు

* ఆ. లర్బుదాలు నున్న – అజ్ఞాన తిమిరంబు
నుండి మేలుకొనుచు నున్న చాలు
జగ మనెడు రసాబ్ధి ఝషము లెన్నైన
నంటలేవు నిర్భయంబు గనుట,

ఒక చిన్న చేపకును, గొప్ప మహాసముద్రమునకును జరిగిన పోరాటమును గూర్చి ఒక్క చక్కని కథ గలదు.

ఒకప్పుడు తనలోని యొక చిన్నచేప తనను బెదిరించ జగడమాడ దలంచినందున మహా సముద్రము భయముచే గడగడ వణకజొచ్చెను. అట్టి దుఃఖకరమగు గతి, సిగ్గుపడవలసిన స్థితి, ఈ ప్రపంచములో అనేక మానవులకు సంభవించుచున్నది. తాను స్వతః అనంతశక్తి సంపన్నమగు మహాసముద్రమై యుండియు జీవిత మహాసముద్రములో నున్న చిన్న అల్పమైన చేపయొక్క తిరుగుబాటునకు భయపడి వణక వలసివచ్చెను.

ఓ భగవంతుని బిడ్డయైన మానవుడా! ఒక చిన్నచేప కాదుగదా మహాసముద్రము నందలి కోట్లకొలది చేపలు అన్నియు కలసి నీ యొక్క గౌరవమును గాని, సమత్వమునుగాని చెడగొట్టుటయు, స్పృశించుటయు, మార్చుటయు చేయజాలవు. అజ్ఞానాంధకారమగు చీకటి నుండి మేల్కొని నీ యొక్క ఆత్మశక్తిని వ్యక్తపరచి ప్రపంచములో యున్న అన్ని చేపల యొక్క పోరాటములకు అతీతుడవై యుండుము.

... ఓమ్ ...

# అందరి కంటెను భాగ్యవంతుడను నేనే

* ఆ. వ్రత సమాప్తి యయ్యె - ప్రాభాత సమయంబు
అరుణ సూర్యకాంతి యావహించె:
ఉదయమొందు సూర్యునుదరాంత రాత్మను
చూచుచును మహా విశుద్ధిగంటి:

* తే. పరవశము చెందినట్టి మద్భావమందు
పాడుకొంటి నీరీతి సంబరము తోడ

* * *

ఒందు నిశ్వాసమున భాగ్య మొప్పగంటి:
వేతొకంట మహా గుణాన్వితుడ నైతి :
భయ రమితుడ మరొక్క నిశ్వాసమునను
అద్వితీయుడ పరమాత్మ నైతి - నంత:

* తే. లోన వెలుపల మీఁద నెందైన గూడ
దివ్య తేజః ప్రభావ సందీపితమ్ము;
ఆ పరంజ్యోతి గూర్చి యేమందు నేను
అదియె నిశ్శబ్దమగు శాంతి యగును నదియె

నలుబది దినముల ఉపవాస దీక్షానంతరము కొండ సామీప్యమునకు వెళ్ళుటకు ఇదియే మొదటిసారి. సూర్యభగవానుదు అప్పుడే దిక్చక్రము నుండి పైకి వచ్చుచుండెను. నేనింక కుటీరాంతర్భాగములో నుండజాలక పోయితిని. వెలుపలికి పోవలయునని కోరిక గలిగి ఉదయించు సూర్యకిరణములలో నడచుచు, ఆ ప్రశాంతమైనట్టియు, ఆనందదాయకమైనట్టియు కిరణములయందు భగవత్సాన్నిధ్యము ననుభవించుచుంటిని. కొండ దిగువున చిన్న బండపై కూర్చొని సూర్యభగవానుని ఆత్మను చూచుచుంటిని.

ప్రపంచమంతటిలో నేనే మిగుల భాగ్యవంతుడనని తలచుకొనునట్టి పవిత్ర క్షణములలో అదియొకటి. నాకు తెలియకనే ఈ క్రింది సూత్రములను మననము చేయుచు శ్వాసను గురించి ధ్యానించుచుంటిని.

నేనీ శ్వాసతో ప్రపంచమంతటిలోను మిగుల భాగ్యవంతుడను.

నేను రెండవ శ్వాసతో ప్రపంచమంతటిలోను మిగుల శక్తివంతుడను.

నేను ఈ మూడవ శ్వాసతో ప్రపంచమంతలో మిగుల నిర్భయుడను.

నాల్గవ శ్వాసతో నేను "ఏకమే వా ద్వితీయమగు" అద్వితీయమైన దివ్య తేజస్సును. అది లోపలను, వెలుపలను, మీదను, క్రిందను గల తేజస్సు. ఆయనంత తేజస్సును గురించి ఇకనేమి చెప్పగలము?

మహిమ      శాంతి      నిశ్శబ్దము.

... ఓమ్ ...

# సముద్రముతో పక్షుల పోరాటము

* ఆ. పిట్ట జంట ఇసుక పెట్టెను గ్రుడ్లను
అబ్ధి పొంగి వాని నపహరించె:
కోపగించి "తమకు" గ్రుడ్లప్పగింపక
యున్న నబ్ధితోడ యుద్ధమనియె

* * *

* తే. సాగరుఁడు నవ్వి కలహంబు సాగనిచ్చె
పిట్ట జంట ముక్కుపుటాల పీల్చి నీరు
వెలుపలకు తోడ మొదలిడె: జలధి జలము
పొంగి పొరలాడె పరిహాస ముఖత దాల్చి

* * *

* తే. జాలిపడి యెల్ల పిట్టలు సాయపడగ
వచ్చె - గరుడుడు వచ్చె నపాంపతి వడ
కె వెను వెంటఁ తెచ్చి యొసగె కేలుమోడ్చి
గ్రుడ్ల నన్నింటి - ముదము పుల్గులకు హెచ్చు:

* తే. ఇయ్యదొక యుపాఖ్యానమే యెద్దియైన
పొందవలెనన్న నిట్టి యోర్పుండవలయు --
విజయ మెపుడు కరస్థమై వెలయుచుండు
న్యాయమగు తితీక్ష గని యత్నంబు సలుప

బల సంపన్నత గల్గిన మహా సముద్రముతో ఒక జత చిన్న పక్షులు పోరాడిన చక్కని కథ మరియొకటి కలదు. ఆడుపక్షి సముద్ర తీరమునగల జలమునకు పాటు పోటులకు లోనైన ఇసుకతిన్నెలలో తన గ్రుడ్లను పెట్టుచుండెను. ఆ గ్రుడ్లు సముద్రము యొక్క అలలచే కొట్టుకొని పోవుచుండెను. అందుచేత ఆ చిన్న పక్షులు ఆగ్రహించి సముద్రముతో యుద్ధమునకు పూనుకొనెను. తమ గ్రుడ్లను తమకు వెంటనే ఇచ్చివేయని యెడల సముద్రములోని నీటినంతటిని ఆరిపోవునట్లు చేసెదమని అవి చెప్పెను. మహాసముద్రము చిరునగవుతో "మీ యావచ్ఛక్తిని ఉపయోగించి అట్లే చేయుడని" మెల్లగా పలికెను. ఆ చిన్న పక్షులు సముద్రములోని జలమును తమ ముక్కులతో తీసికొనిపోయి భూమిమీద చుక్కలు చుక్కలుగా విడుచుచుండెను. వీటియొక్క కార్యము ధర్మమైనదని, ఇతర పక్షులును, చివరకు పక్షిరాజైన గరుత్మంతుడు కూడా వాటితో కలిసెనని యీ కథ చెప్పుచున్నది. అప్పుడు సముద్రము భయపడి క్షమార్పణలతో ఆ చిన్న గ్రుడ్లను ఇచ్చివేసెనట. జీవిత ఆశయమును పొందుటకు అట్టి ఓర్పు పట్టుదలయే కావలసియుండును. సదా న్యాయము, ఓర్పు, ధర్మము గలవారికే కడపటికి జయము కలుగును.

... ఓమ్ ...

# భావనాశక్తి

* తే. ఏది భావింతువో యగు దీవు నదియ:
"ఏను భగవానుడనని" నీవెంచినంత
దైవమగుదువు: మృణ్మయ తనువునంచు
నెంతువా: మట్టి ముద్దవై యెసఁగు దీవు:

* తే. భవ్య సృజనాత్మకమ్మైన భావమూన
శాంతి శక్తి నిదాన వత్సలత కలుగు:
నీచభావ సంభావనా నియతి నెగడ
దుఃఖ బాధా మరణములు తోచువెంట:

* తే. "స్వీయ భావసాక్షి యగుట - పెద్దగొప్ప:
స్వీయ భావ నియంతృత్వ సిద్ధి గనుట
ఇనుమడించుత తన మదృష్ట రేఖ:
భావశాంతి గనుచు పయిపై వశింప
ఆత్మ భాగ ధేయము పంటయగుట తనకు:

* తే. తత్పరమ ధామమును చేరు తాత్త్వికాళి
కమర రాజ్యము: భారమంచరయ గలరు
తెలివి నావరించిన శాంతి తెరువు; కాని
భావ దాస్యమ్ము గొన నసంభవము - నిజము
మానవుడె యాత్మ భాగ్య నిర్మాణశాలి:

సృష్టి ప్రారంభము నుండియు భావనయొక్క శక్తి శాస్త్రరీత్యా నిరూపింపబడినది. నీ ప్రస్తుత స్థితి నీ ఆలోచనల యొక్క ఫలమే, తలంపులే వస్తువులు. "నీవెట్లు తలంచుదువో అట్లే అగుదువు" కాబట్టి

దైవమును గురించి నీవు తలంచిన యెడల నీవు దైవమే అగుదువు; మట్టిని గురించి తలంచిన యెడల నీవు మట్టియే అగుదువు" అని మహాత్ములు నుడివి యుండిరి.

ఉపయోగకరమగు తలంపు శాంతికి, శక్తికి, సమత్వమునకు మార్గము. విపరీత భావన దుఃఖమునకును, బాధకును, నాశనమునకును, మరణమునకును దారితీయును. కనుక తన తలంపులను తాను కనిపెట్టి చూచుచుండవలయును. తన తలంపులకు సాక్షియగు వాడు ధన్యుడు. తన తలంపులకు నాయకుడగువాడు ద్విగుణముగా ధన్యుడు.

తలంపుల కతీతుడు త్రిగుణముగా ధన్యుడు. అట్టివారికే పరమపద ప్రాప్తి కలుగును. వారే సాధారణ జ్ఞానమున కతీతమైన శాంతి యననెట్టిదో తెలిసికొనగలరు, కాని తలంపులకు దాసులగువారు గ్రహింపజాలరు. నిజముగా మనుజుడు తన విధికి తానే కర్త.

... ఓమ్ ...

# చిన్న తుఫాను

*　　ఆ.　　సిలువపై క్రీస్తు నిడి వధించిన యపుడు స
　　　　　హస్ర వర్షములకు వెన్క - అభ్రవీధి
　　　　　వీత వృష్టి యుల్కల తోడ వచ్చెనంట
　　　　　పంచ భూతముల యతృప్తి బయలుపడగ:

*　　తే.　　కాలమానముల్ ఆవృత్త క్రమము నొంది
　　　　　వచ్చునన్నది సత్యము: వ్రత సమాప్తి
　　　　　యైన వెనువెంట అంబర ధ్యానమందు
　　　　　నురుము లురలె వర్షంబు క్రమ్ముచును నోపె:

*　　　　*　　　　*

*　　తే.　　ఎవ్వడెఱుగు నీశ్వర లీల లీశ్వరాంశ
　　　　　కలిత పరమార్థ తత్త్వ విద్వనుండుగాక;

చరిత్రాంశములు మరల మరల జరుగుచుండునని చెప్పుదురు. అనేక శతాబ్దములకు పూర్వము నడిచిన రీతిని మరల విధిగా జరిగి తీరును. రెండువేల సంవత్సరముల క్రిందట క్రీస్తు ప్రభువు శిలువ వేయబడిన కాలములో ఒక పెద్ద తుఫాను భవనములను కదలించి వృక్షములను పెకలించి ప్రపంచమంతటను భయంకరమగు అంధకారములో ముంచి కల్లోలముతో నింపివేసినదని బైబిలు గ్రంథము చెప్పుచున్నది. ఆకాశమంతయు ఉరుములతోను, మెఱుపులతోను కంపించెను.

పంచభూతములు, భగవంతుని కుమారుడును, నిర్దోషియును, మహాపురుషుడును మిగుల పవిత్రమైన సాధువునగు క్రీస్తుయొక్క మరణమునకు విచారమును, ఆక్షేపణమును చూపుచున్నావా? నమ్మశక్యముగాక విపరీతముగా తోచవచ్చును. కాని ఇటీవల జరిగిన నా ఉపవాసదీక్షా సమయములో శుభ శుక్రవారానంతరము ఉరుములతోను, మెఱుపులతోను ఒక చిన్న తుఫాను సాగెను. సృష్టికర్త యొక్క రహస్యములు పరమ భాగవతోత్తములకే తెలియును.

... ఓమ్ ...

# నిమ్మచెట్టు

*	తే.	కలదు నిమ్మ మొక్కొకటి ప్రాంగణమునందు
రోజునకు నొక్కకాయ సద్రుచుల నీన
మద్వ్రత మదెన్నినాళ్ళో సమ్మతి నొసంగె:
చాల నరుదయ్యె కాయ బజారునందు:

*	తే.	వ్రత సమాప్తి కానుండెను - పండు పండి
యొక్క కాయ నిమ్మయొసఁగ దొక్కొయనుచు
తలఁపు కల్గెను మరునాఁడు తరువు క్రింద
పండి రాలినదట నిమ్మపండొకండు

*	తే.	తృప్తి గల్గెను చెట్టు సంతృప్తి గనియె:
నెఱి కృతజ్ఞత తరు జంతు నృవరులకును
ప్రేమ పాశంబు గట్టి సంవృద్ధి పరచు:

గతించిన నలుబది దినముల నుండియు దినదినము స్నానపు గది నుండి నీటిని ప్రవహింపచేయుచు, నేను శ్రద్ధతోఁ బెంచుచున్న ఒక నిమ్మచెట్టు ఆశ్రమమున కలదు. అదినాకు కృతజ్ఞత చూపుచున్నదో యనునట్లు చెట్టు నిండుగా లేత చిగుళ్ళు సువాసనగల తెల్లని మొగ్గలతో నిండియుండెను. నా ఉపవాసదీక్షలో నాకు సహాయపడుటకా యనునట్లు నిమ్మకాయులులేని ఈ రోజులలో అది సుమారు ఆరు నిమ్మపండ్లను ఇచ్చెను. అవి ఇంకను పండనందున నేను ప్రతిదినము వానివైపే చూచుచుంటిని. నా దీక్ష ముగియ జొచ్చెను. ఆ నిమ్మ వృక్షము నా దీక్షలో ఒక ప్రత్యేక దినమున తన పండును నేనుపయోగింప వలెనని కోరినట్లు నాకు అవసరమైన సమయములో ఒక పండిన నిమ్మపండు నేలపై వ్రాలెను. ఆ నిమ్మరసము నేనారగింపగనే ఆ చెట్టు తృప్తి చెందినట్లు తోచెను. నేనును సంతష్టుడనై కృతజ్ఞత చూపితిని. కృతజ్ఞత చెట్ల యొక్కయు, జంతువుల యొక్కయు, మానవుల యొక్కయు హృదయములను అతికి ఏకము చేయును.

... ఓమ్ ...

## జడపదార్థముల యెడల అనురాగము

*    తే.    అనవరత సాహచర్య మత్యంత ప్రీతి
కూర్చు, నది జడమైనను, కుడ్యమైన
ఈ "సుశీలా" భవనమందు నేను మౌన
దీక్ష నుపవసించితి సమాధి స్థితినిగని

*    తే.    ఇదె కనుల నిల్చు ప్రార్థన లిందె చేయ
మనసు కల్గు: కృతజ్ఞత మరుపురాదు
ఏది నిత్యము? నేను ప్రార్థింపవత్తు
నే మరల? పరిచయ ప్రేమ ఎంత పటిమొ!

నా నలుబది దినముల దీక్షను ప్రార్థనలతో, ధ్యానముతో, మౌనముతో సాగించుటకు అవకాశము కలిగించిన "సుశీలా" మందిర ప్రార్థనాలయములో నేను పరుండియుండ నా దృష్టి పదేపదే ప్రేమతోడను, ఆదరణతోను గోడలపైనను, సరంబీపైకిని మరలుచుండును, ఎక్కువ కాలము ఒకే స్థలమున నుండుటచే నిర్జీవ పదార్థముల యెడల మనకు ఎట్టి అనుబంధము ఏర్పడునో తెలిసికొనుట, మిగుల ఆశ్చర్యమైన విషయము.

నాకు మౌనముతో ఉపవాసము చేయుచు తరచు అంతరంగ దైవముతో సంసర్గము అనుభవించుటకు సదవకాశము కలుగజేసిన ఈ ప్రార్థనాలయమునకు నా కృతజ్ఞతను చూపుచుందును.

ఆశ్చర్యకరముగా తోచినను తరచు ఈ క్రింది భావములతో, ప్రార్థనాలయముతో సంభాషించుచుందును:- "ఇన్ని దినములు నీ యొక్క నవావానము ఆనందముతో అనుభవించి మరల ప్రాపంచిక కార్యకలాపములోనికి పోవుచుంటిని, కావున నిన్నెప్పుడు మరల సందర్శింపగలను? నిన్నెన్నడైనను తిరిగి చూడగలనా? శరీరము అనిత్యము గనుక రేపటి విషయము లెవరు చెప్పగలరు? నిన్ను సందర్శించు భాగ్యము కలుగక పోయినను నీయొక్క సహాయమునకును, సానుభూతికిని, ప్రేమకును మిగుల కృతజ్ఞుడను.

... ఓమ్ ...

## రెండు పవిత్ర పక్షులు

* తే. మధుర భావార్థ కూజనా మంజులమ్ము
విహగ మిధునమ్ము వసియించు వృక్షవీటి
అది వసంతము మధుమాస మావహించె
శుక పికారావ మధుర మంజులము గాగ

* * *

* తే. ఆర్ద్రమై హృద్విదారకమై మనోజ్ఞ
మై వినంబడు ప్రకృతి విహ్వలత చెంద
"ఓ ప్రియా! ఓ ప్రియా" ఎటనుంటి వనుచు
తరుణ తరుణీ విలాప మెంతటిదొకాని:

* * *

* ఆ. ప్రియ యెవర్తె? కలిగెనేల వియోగంబు,
ఆ వియోగమంత ఆర్తికరమె:
ఎన్నినాళ్ళిటు విలపించు నీ ప్రియుడిట!
విహగ యుగ్మమైన ప్రేమ ఎంతొ!

* * *

* తే. పరమ నిశ్శబ్ద ప్రకృతి, నిబద్ధ మగుచు
హృత్ప్రబోధము కల్గె: బాహిరమునందు
నేల వెదకు లాడెదవు, వీక్షించుకొనుము
కలదు నీలోన త్వత్ప్రియంకరుఁడు సతము,

తోటపల్లి కొండలలో ఒక జత చక్కని పక్షులు గలవు. మామిడికాయల కాలములో వానిని చూచుచు మేము వాని మధురగానమును కూడ వినుచుందుము, వానిని "పిప్పిహ" పక్షులందురు. వానిగానము "ప్యూకహా" ప్యూ అనగా "ప్రియుడు" 'కహా' అనగా "ఎచ్చట" – ప్రియుడెచ్చటనున్నాడు? అనునదే ఆ పిట్టల గానము.

హృదయ విదారకమగు యా పిట్టల పరితాపమును ఈ చిన్న మాటలతో వర్ణింపనలవికాదు. ఆ పిట్ట తన ప్రియుని వెదకుచు "ప్యూ కహా" ప్రియుడెచ్చట? మధురమగు ప్రియుడెచ్చట అను దైన్యమగు, గంటల కొలది ఖంగుమని మ్రోగు నాదమును మీరు చెవులార వినవలసినదే.

ఎక్కడనో దూరపు కొండలలోని శూన్యస్థలము నుండి ప్రియుడు అంతరంగమున గలడు, నిశ్చలమైన నీ పవిత్ర హృదయమునందే గలడని నిశ్శబ్దముగా సమాధానము వచ్చుచుండును.

... ఓమ్ ...

# భగవంతుడు చైతన్య స్వరూపుడు, అచలుడు కూడను.

*	తే.	విజ్ఞు లిచ్చగింతురు గాక; వేరుపడి, వి
వాదమును సల్పుదురు గాక పండితులయి
సర్వ చైతన్య మూర్తియు సర్వ నిర్వి
కార నిశ్చైతన్యమును బ్రకామ మతఁడె!

*	తే.	సద్గుణమునుండి నిర్గుణ సరణినెఱిగి
కాయ మాయావరణ నావకమ్ము తెలిసి
గీతయాడినయట్లు నద్వైతబుద్ధి
అర్పణము చేయవలయు బ్రహ్మమునకెల్ల.

భగవంతుడు చైతన్య స్వరూపుడేగాక అచలుడు కూడను. "భగవంతుడు, అకర్త" యని జ్ఞాని చెప్పును. కాని "ఆయనయే సర్వము చేయునని" కార్యవాదియైన మానవుడు చెప్పును. ఇందేది సరియైన భావము! ఆయా ప్రత్యేక పరిశీలనా దృక్పథము నుండి చూచిన రెండు భావములును సరియైనవే! ఆధ్యాత్మిక దృష్టియందు వ్యక్తము, అవ్యక్తము అను రెండు స్థితులు కలవని భగవానుడు భగవద్గీతయందు చెప్పియున్నాడు. ఇంకను అగమ్యమైనదానిని అర్థము జేసికొనుట జ్ఞానులకైనను కష్టసాధ్యమని శ్రీకృష్ణ భగవానుడు గీతయందు చెప్పియున్నాడు. కాని వ్యక్తమైన దాని విషయము అట్లుకాదు, వ్యక్తమైన దానికి రూపము, నామము కలవు గనుక సామాన్య మానవుడు గ్రహించి దానిని ధ్యానము చేయగలడు.

అయితే మానవుడు దట్టమైన మాయచేత సంభవించిన స్థూల దృష్టివలన రక్త మాంసముల కట్టెయైన శరీరముతో మిథ్యా తాదాత్మ్యము కలిగించుకొన్న కారణముచేత దైనందిన చర్యలో వ్యక్తమును, అవ్యక్తమును రెంటిని తెలియక అవి లేనేలేవనుచున్నాడు. పూర్ణము, శాశ్వతము అగు శాంతి దృశ్యమగు వ్యక్తములోను, అదృశ్యమగు అవ్యక్తములోను కూడ ఒకే అవిచ్ఛిన్న జ్యోతిని చూచి గ్రహించగల శక్తి మహాత్ములకే లభ్యమగును.

యదార్థముగా భగవంతుడే అన్నిటికిని కర్త, ఏలయనగా అంతయు ఆయనయే, నిత్య పరిపూర్ణుడు ఒక్కడే. అద్వితీయుడు. మా ధన్యవాదములు వ్యక్తముద్వారా అవ్యక్తమునకు అందచేయబడుగాక!

... ఓమ్ ...

## నా ఉఱుములు మెఱుపులు

* తే. పరమ నిశ్శబ్ద పూర్ణ తపస్సు నుండి
అనుపదము నాత్మ తత్త్వ తాదాత్మ్యభావ
మగ్నచేతస్కతన్ నిర్విభగ్న హృదిని
ఉప్పరమువంక నాచూపు లొప్పియుండె,

* తే. కాఱుమేఘాలు క్రమ్మి ఆకసమునందు
ఘన ఘనాహవము మెఱుపుగములతోడ
బధిరి తాశా చయమ్ము దిగ్భ్రమ చకిత చ
కిత నయనముగానయి దివ్యకేళి నెగడె,

* తే. ఉఱుములన్ విని పల్కులం దూహ నెగడె,
భావముల్ మెఱుపులనెడు భంగి దోచె,
ఎంత వైభవమిద్ది యదృష్టమెంత,
పదములున్ భావముల్ రూపునందుచుంట

వెనుకటి అధ్యాయములలో నొకదానియందు ఈ క్రింద విధమున వ్రాసియుంటిని. "'నలుబది దినముల ఉపవాసదీక్షలో నుండుటచే నేను మాట్లాడునప్పుడు నా పలుకులు పిడుగులవలెను, నా భావములు మెఱుపుల వలెను ఉండవలెను.

ఒక సాయంత్రము మందిరపు డాబాపైని ముందునకు వెనుకకు నడచుచు ప్రతి అడుగుయందును భగవత్సాన్నిధ్యమును అనుభవింప యత్నించుచుంటిని, ఆకాశము మేఘావృతమై అంతయు చీకటిగాను, నల్లగాను యుండెను, ఆకాశమునందు ఉరుముల యొక్కయు, మెఱుపుల యొక్కయు చిహ్నములుకూడ కనిపించుచుండెను. ఉరుములు వచ్చినపుడెల్లను, మెఱుపులు కూడ నుండును. అయితే ఇచ్చటనే చిత్రమైన విషయమొకటి గలదు. ఉరుములు వినపడినప్పుడెల్లను, నాకు తెలియకనే ఆ ఉరుములు నా వాక్కులని తలంచుచుందును, మెఱుపు వచ్చినప్పుడెల్లను అదే నా తలంపని నా లోపల అనుకొనుచుందును. మనమాటలను, భావములను ఉరుములుగా, మెఱుపులుగా చేయగల్గుట యెంత భాగ్యము.

... ఓమ్ ...

# తోటపల్లి ఆశ్రమ సందేశములు

* ఆ. వ్రత సమాప్తి తోటపల్లి కొండను వీడి
ఏ ప్రబోధ తంతు వేను పూని
బయట పడవలెనను ప్రశ్న యొకటి కల్గె
భావమయ జగత్తు పరిగణింప

* ఆ. కార్యదీక్ష పొంది ఘన మహీధరము నా
రూఢ శక్తి ధైర్య రూఢ పటిమ
మధుర మధుర పుష్ప మాధుర్య వాసనల్
క్షమ తితీక్ష బోధ గఱపవలయు,

* తే. మౌఢ్య జీమూతముల దివ్యమానమైన
పరమ తాత్త్విక భావ దీపములవలన
ఆత్మ వెలిగించుకొని పరమార్థ బోధ
సలిపి వెలయింపవలె లోకసంగ్రహమ్ము

తోటపల్లి కొండలు విడిచి వెళ్ళవలెననెడి తలంపు గలుగగనే వియోగబాధ కలిగెను. కడపటి దినమున తోటపల్లి విడువవలసిననాడు ఉదయమున మేల్కాంచగానే ఆశ్రమ మందలి నా సన్నిహితులైన ఆత్మీయులతో కొండ దిగువునకు వెళ్ళి అచ్చట ఉదయించుచున్న సూర్యుని తిలకించుచు భజన, ధ్యానము చేసితిమి.

ఆనాటి ప్రశ్న యేమనగా – తోటపల్లి కొండల నుండి ప్రాపంచిక కార్యకలాపములోనికి నేనేమి తీసికొని పోవలెను? ఈ దిగువ నుదహరింపబడిన మూడు భావములు నాకు స్ఫురించెను.

1. తోటపల్లి కొండలయొక్క స్థిరత్వమును, బలమును తీసికొని పోవనిమ్ము.

2. మానవుల పాదముల క్రింద నలగ ద్రొక్కబడిన తమ పరిమళమును నలుగడలను వ్యాపింపజేయు సువాసన నిచ్చెడి పుష్పముల మాధుర్యమును, క్షమాశక్తిని లేక ఓర్పును నాతో తీసికొని పోనిమ్ము.

3. వ్యక్తమైన ప్రపంచములోనికి సూర్యకాంతిని తీసికొనిపోయి అచ్చట అంధకారమనెడి మేఘములనెల్ల పారద్రోలనిమ్ము. ఆ ప్రకాశవంతమైన కాంతినే అందరితోను పంచుకొననిమ్ము. ఇప్పుడు కార్యకలాపముతోను, అశాంతితోను నిండిన ప్రపంచములోనికి కాంతులలోకెల్ల కాంతియై ప్రజలను, స్థలములను, అనంతమైన, శాశ్వతమైన తేజస్సుతో నింపుటకు నేను పోవుచున్నాను.

... ఓమ్ ...

# వికృతి రూపమందునను భగవంతుని చూడుము

* తే. "ఆత్మ వత్సర్వ భూతాని" యనెడు వాక్కు
అనుభవంబున నిత్య సత్యంబొనర్చ
అమర రూపంబునను హేయమైన యట్టి
వస్తువునను సమంబుగా పరమ పురుషు
శివుని రూపైక్య మొకటె దర్శింపవోయి,

* తే. నిత్య సమభావనా యోగ నియతిచేత
హృదయ దౌర్బల్య మణఁగు, నీవెందు చూడ
బ్రహ్మ తాదాత్మ్య భావ సంపద వహించు,

విశ్వమంతటిని భగవంతునిగానో లేక ఆత్మగానో చూడగలిగినవాడే తన ఇచ్ఛ వచ్చినట్లు ఆనందముగా జీవింపగలడు. వికృతమైన దానిలోను, శత్రువులని తప్పుగా పిలువబడువారిలోనుకూడ, సత్యస్వరూపుడగు భగవంతుని చూడ గలిగినవారికే స్వేచ్ఛ అనునది చెందును. ఎవరైతే మనలను ప్రేమించి ఆరాధింతురో అట్టివారియందు భగవంతునియొక్క ఉత్కృష్టత, ఔన్నత్యము, సౌందర్యమును సులభముగా చూడనగును, అయితే వికృతమైన వారిలోను, వక్రమైన వారిలోను, దుష్టులయందును, మన ప్రేమాతిధ్యములను దుర్వినియోగము చేయువారియందును, సదా కుట్రలను పన్నుచు, మనలను బాధించి కష్టపెట్టుటయే పరమావధిగా గల వారియందును, భగవంతుని ఎట్లు చూడగలము?

నీ యొక్క ప్రస్తుత స్థితిని తెలుసుకొని భయమును, దౌర్బల్యమును జయించుట కిదియే భగవంతుడిచ్చిన పరీక్ష. కాబట్టి భగవంతుని ప్రతివారియందును చూచుట అభ్యసింపుము. అప్పుడే నీ ఇచ్ఛ వచ్చినట్లు నీవు పూర్ణమైన శాంతి స్వాతంత్ర్యములతో జీవింపవచ్చును.

... ఓమ్ ...

# నీ కత్యంతాప్తమిత్రుడెవరు?

* తే. ఎవడు నీలోని సౌజన్యమే గ్రహించు
ఎవడు నీలోని ఘనత బాహిరము చేయు
అతడొసంగు శాంతి సమభావ మాతడొసగు
అతడె దైవము తత్సర్వమగుదు వీవు:

* తే. వెదకి నీలోని దౌర్భాగ్య మొడిసిపట్టి
వికృత రాక్షసత్వంబును వెలికిలాగు
నెవడు - వాడవినీతుడు హేయగుణుడు:
తన్ను తాc చూచు కొనును సత్యంబు మరచు

* తే. ఎల్ల వ్యక్తుల యోగ్యతయే గ్రహించి
దివ్య సత్యత్వ మెఱుcగగా తివుర వలయు:

నీయందలి మంచిని చూచువాడె నీకు ఆప్తుడు. నీయందలి ఔన్నత్యమును ఎవడు బహిర్గతపరచగలడో అట్టివాడే నీకత్యంత ఆప్తుడు. కొందరి మనుజుల సమక్షమందు మనము నేలపై ప్రాకుపురుగులవంటి వారమనియు, అధమాధములమనియు, భూదేవికి భారమనియు మనకు మనమె తలంచుదుము, తనయందు సదా చెడుగే యుండుటచేత, ఆ చెడుగునే మనయందు సర్వదా చూచుచు, మనయందలి చెడుగునే వారు వెలుపలికి తీయుదురు. ఎట్టి వస్తువు అట్టి దానినే ఆకర్షించును. నీలో నేమిగలదో దానినే వెలుపల ఇతరులయందును చూతువు.

ఇంకను కొందరి సహవాసము చేత శాంతి సమత్వ శక్తులు పొందగలుగుదుము. అట్టివారే మనయందలి మంచిని, ఉత్కృష్టతను వెలుపలికి తెచ్చుటకు సహాయభూతులగుదురు. మనము అమృతత్త్వములోని బిడ్డలము కావున, ఉత్తమమైనట్టియు, ఉన్నతమైనట్టియు స్వభావములు కలిగి సజీవముగ మెలగుచున్న దేవతలముగా భావించుకొనునట్లు చేయుదురు. సత్యమును, ఉత్తమమును, అత్యున్నతమగు దానిని ఇప్పుడును, ఎల్లప్పుడును మనము గుర్తించుదముగాక!

... ఓమ్ ...

# రక్తము కారుచున్న మండూకము యొక్క కథ

* నడచి నడచి రామ నరపతి సీతతో
అనుజుతోడ కారుటడవియందు
సేద తీర్చుకొనఁగ చేరె గోదావరీ
తీరభూమి చల్ల తేమనేల:

* నేల గ్రుచ్చె ప్రక్క నిజ ఖడ్గమును, శ్రాంతి
తీర్చుకొనియు బయలుదేరె మరల:
ఖడ్గమూడబెరుక కానఁగనయ్యెను
ఆర్ద్రరక్తసిక్త మగ్రతలము:

* చూడ భేక మొండు శోకించు చగలిదె!
ఖడ్గ ఘాతమున సగంబుచచ్చి:
'భేకమా! ఇదేం? పేరెలుంగిడగదె!
యనిన రామచంద్రు నరసి - యనియె

* ఇతరు లెవ్వరేని నిట్లొనరించిన
నీవు కలవు చెప్పి నెగడు కొఱకు:
నీవె బాధవెట్ట నెవరితో మొఱలిడ
ఓర్పు తోడ మౌనముంట తక్క"

ఇది యుపాఖ్యాన మొండు - యోజించు కొనుఁడు
సహనశక్తి వలయు - నోర్మి చాలవలయు:

ఇది ఒక చిన్న కథ, అయితే ఇందు ఎంత గాఢమైన అర్థము కలదు! ఈ ఘట్టము శ్రీరామచంద్రుడు అరణ్యములో వనవాసము చేయు దినములలో జరిగినది. ఒకప్పుడు రామచంద్రుడు చాలదూరము తిరుగుటచేత అలసి, ఒక బురద ప్రదేశము వద్ద తన ప్రియులైన సీతా లక్ష్మణులతో కొంత విశ్రాంతిని పొందదలచి, తన చేతియందలి బల్లెమును భూమిలో గ్రుచ్చెను. కావలసిన విశ్రాంతి పొందిన పిమ్మట ఆ ప్రదేశమును విడచి పోవునప్పుడు శ్రీరామచంద్రుడు నేలను గ్రుచ్చిన బల్లెమును పైకి తీయగా దానికొనను రక్తముండుట చూచి ఆశ్చర్యపడెను. ఆ నేలను పరీక్షచేసి చూచినప్పుడు ఒక కప్ప యొక్క హృదయములో తన బల్లెము గ్రుచ్చుకొనుటచేత రక్తము కారుచుండుటచూచి దుఃఖించెను. అప్పుడు శ్రీరాముడు కప్పతో నిట్లనెను.

"ఓ దురదృష్టమైన చిన్న కప్పా! నా బల్లెముతో నీ హృదయమును ఛేదించునప్పుడు నీవు అరచుటగాని, కొంచెమైనను శబ్దముగాని ఏలచేయక పోయితివి?" ఆ చిన్న మండూకము యిట్లు ప్రత్యుత్తరమిచ్చెను.

"ఓ ప్రభువా! ఇతరులు నన్ను బాధించునపుడు, గాయపరచినప్పుడు నీ సహాయము కోరి నిన్ను పిలుచుచుందును, అయితే నీవే బల్లెముతో నన్ను పొడిచి, బాధించునప్పుడు నేనెవరికి మొరపెట్టుకొనవలయును? నాకు సహాయముచేసి రక్షించువాడవు నీవు తప్ప మరియెవరు గలరు? అది ఎంత జ్ఞానముతో కూడిన మనస్సును కరిగించునట్టి సమాధానము! భగవంతుడు ఆ చిన్న మండూకము యొక్క జ్ఞానమును, సహనమును మనకు ప్రసాదించుగాక!

... ఓమ్ ...

# మంచిని చేయునపుడు నీదే పైచేయిగా నుంచుము

*     తే.     మీఁద నీచేయి యుండ నమేయ గతిని
వాదులాడుము: నీవాద బలము కలిమి:
ఎపుడు నీచేయి మీఁదుగా, నెల్ల యోగ్య
కార్యమాచరింపుము: లక్ష్యకాండ మెపుడు

*     తే.     సత్యనిత్య సౌజన్య వత్సలత గలిగి
పరగుణోపకృతికి సాయపడుచు నుండ

స్వామి రామతీర్థుని రచనలలో జాన్సన్ అను (17వ శతాబ్దపు) ఒక గొప్ప ఇంగ్లీషు గ్రంథకర్త వాక్చమత్కృతిగల వారెల్లరిలో అగ్రగణ్యుడని చదువుదుము. వాదనలో ఆయనను మించినవారులేరట. ఎట్టి సందర్భములోనైనను ఆయనదే పైచేయిగా నుండవలయునట. ఆయన యెవరిమీదనైనను తుపాకిని పేల్చదలచినపుడు గురితప్పిన యెడల దాని మడమ చేతనైనను అతనిని చావగొట్టునని ఆయనను గూర్చి చెప్పబడియున్నది. అట్టి పట్టుదల, ఉత్సాహము ఉండుట చాల ఆశ్చర్యకరము. కాని అనేక సందర్భములలో ఇది అనుచితముగా చెప్పబడి దుర్వినియోగము చేయబడుచున్నది. పెక్కుమంది తమ వాదము తప్పు అని తెలిసియుకూడను అమాయకులకు కలుగు బాధ, నష్టమును గుర్తించక తమ నిస్సారమగు తప్పు వాదమునే నిలబెట్టుకొనుటకును, వారు పలుకునదే సరియైనదని సిద్ధాంతీకరించుటకును చూతురు.

వారు నిన్ను బాధించుటలో తమ గురి ఒక విధముగా తప్పిన యెడల తాము తప్పిన దానిలో తమ చేయియే పై నుంచగోరి, తప్పంతయు తమదేయని తెలిసికూడను, నిన్ను నిందించుటకును, హింసించుటకును, వంద మార్గములను, ప్రయత్నములను చేయుచుందురు. అట్టివారికి భగవంతుడు సరియైన దృష్టిని ప్రసాదించుగాక!

... ఓమ్ ...

# సత్యమార్గము ఎగుడు దిగుడుగా నుండును

* వారలు ధన్యులెవ్వరు విపత్పరిభూతము కంటకావళీ
దారుణమున్ ప్రయాస నిచితంబును గుట్టల మిట్ట పల్లమున్
గూరిన ధర్మ మార్గమును గోచరియింత్రు సహిష్ణులౌచు స
స్మేర ముఖారవిందములచే గనుచున్ పరమాత్మ నెమ్మదిన్

సత్యమార్గము మిగుల కఠినమైనది. అది మిగుల ప్రయాసమైనపని. అది వాడియైన రాళ్లరప్పలతోను, గ్రుచ్చుకొను ముండ్లతోను నిండియున్న మార్గము, కావున బలహీనులు, సోమరులు, దుర్బల మనస్కులు ఆ మార్గమును త్రొక్కజాలరు. సత్యాన్వేషి తన అహమును నాశనము చేసినగాని, తాను సత్యమార్గమును అనుసరింపలేడు. మరణము వంటి మానసిక వేదనతోకూడిన అంతరంగిక హింసతో పోల్చి చూచిన యెడల బాహ్య హింస బహు స్వల్పము.

“అహింస” నశించినవారు ధన్యులు. అట్టివారే సణగక గొణగక ఎట్టి కష్టమైనను నిశ్శబ్దముగా భరింపగలరు. అట్టివారికి సమస్తము భగవంతుడే కావున వారెన్నడును మొఱపెట్టరు, వారి యొక్క ఆశయము ఏమనగా - ఎవరును నా కొఱకై బాధపడరాదు. ఈ ద్వంద్వ ప్రపంచములో దుర్బలుల యొక్కయు, తప్పులు చేయువారి యొక్కయు దుఃఖములను భరించుచు ఇతరులకు బదులు నన్నే ఈ కష్టములను మరల మరల భరింపనిమ్ము అని ప్రార్థించుచుందురు.

... ఓమ్ ...

# నీకు ఏమి కావలయును?

*     తే.     ఏమి వాఛింతువోయి: నీ వెచటికిపుడ
రుగ cద లంచెదవోయి: విలోభ దృష్టి
నేదిగ్గై కొందువోయి; నిన్నెరింగికొనిన
కోర్కెలుండవు; పూర్ణ మగుదువు నీవు:

*     తే.     కోర్కె యనియెడు "కమ్మర కొలిమి" మందు
ఎంత కాలము లోనాస లెగయుచుండు:
ఎగయు కోర్కెలనీవు జయింప - నాcడు
శాంతి సౌఖ్యముల్ స్వాస్థ్య వాసంబెడంద.

నా బిడ్డా! నీకు కావలసినదేమి? కైలాసగిరికి పోగోరుచున్నావా? హిమాలయములకు వెళ్ళగోరుచున్నావా? అమెరికా ఖండమునకు వెళ్లదలచుచున్నావా? మరియెక్కడకు వెళ్ళదలచితివి? ఏమి సంపాదింపగోరుచున్నావు? నీవు మరియేమి చేయగోరుచుంటివి? నీవెవరవో తెలిసికొనుటతప్ప ప్రపంచమందుగల తక్కినదానినంతటిని తెలిసికొన గోరుచున్నావు. నీవెవరవో తెలిసికొనినపుడు నీ కొఱతలు, నీ కోరికలు మాయమగును. కారణమేమన నీవు కైలాసములోను, హిమాలయములలోను, అమెరికా ఖండమందును, సర్వత్రా నీవుండనే యున్నావు. ఆత్మ అవిభక్తమైన సత్యముగావున నీవు ఇంతవరకు లేని స్థలమేది కలదు? ఆత్మవైన నీవు చేయవలసినదేదియు లేదు. నీలో నీవు సంపూర్ణమైయున్నందున నీవు కోరికల కతీతడవు.

కనుక నీవు కోరదగినది కొఱతయను భ్రమను వదిలించుకొనుటయే. అన్నివిధములైన కోరికల నతిక్రమించినవారికే శాంతి లభించును.

... ఓమ్ ...

# నీకు నీవే మిత్రుడవు

* తే. ఊరికే నిన్ను స్తుతియించు వారికోర
నేల? ఎల్లవేళల లోపమేదొ యొకటి
వెదకి దూషించువారల వెదుకనేల?
కోరుకొనుము నీ మేలెంచు కొనెడివారి:

* తే. పరుల లోపము లెంచెడువాఁడు - స్వీయ
లోపముల చూచువాడె - ఎఱుంగు - మతఁడు
మిత్రుడగునె నీ దోష సమీక్ష చేయు
వాడు నీలోన గలదు: అవ్వాని నెఱుఁగు.

* * *

(అనఁగ నిన్ను నీ వెఱుగుట యగును వత్స)

నీ జీవిత పరమావధిని తెలిసికొనగోరితివేని, అత్యంత ఉన్నత స్థితిని పొందగోరుదువేని, నిన్ను ప్రేమించి నీ ఆధ్యాత్మికాభ్యుదయమును చూడగోరు ఎవరినైనను చేరుము. నిన్ను స్తోత్రము చేసి శ్లాఘించువారి అగత్యము లేదు. నీ జీవిత సూర్యుని మరుగుపరచునట్టి క్షణిక మేఘములను అతిక్రమించి నీ అంతర్యమునగల అఖండ తేజస్సు అయిన భగవంతునితో ముఖాముఖిగా నుండవలయుననిన, నీలోని తప్పులను, లోపములను చెప్పగలిగినవారు కావలెను.

తమలోనుండు చెడుగునే యితరుల యందు కూడ చూచుచు, తప్పంతయు నీయందే ఆరోపించి, సదా నీ లోపములను ఎంచుచుండువారు కూడ నీకు అవసరములేదు. మనలను ముఖాముఖీ పొగడుచు స్తోత్రము చేయువాడుగాక మవలోపములను చెప్పగలిగినవాడే మనకు యదార్ధముగా అత్యంత ఆప్తమిత్రుడు.

కావున అట్టి ఉత్తమ మిత్రుడెచ్చట నున్నాడు? నీ మిత్రుడెంత మంచి సత్యవంతుడైనను నీ లోపములన్నింటిని అతడు తెలిసికొనజాలడు. నీలో నేమున్నదో అతనికెట్లు తెలియును? కనుక నీ లోపములను, నీ అంతర్భావములను తెలిసికొనువాడు బాహ్యమునలేడు. అతడు నీలోపలనే యున్నాడు అతడు నీవే – ఆత్మయే నీవు.

... ఓమ్ ...

# ఎవరో ఒకరు

* తే. ఎట్టి దుర్గుణుఁడవు మతి హీనుడవు - వి
కారుఁడవు దుర్జనుఁడవైన - కలఁడొకండె
వండొ నిన్ను ప్రేమించెడివాఁడు; తండ్రి
యగును, తల్లియగును,భార్యయగును, గాక

* తే. వాని పూజింప, ప్రేమింప, వలదె నీవు!
ఆతఁడెచ్చోట, నున్నను, నహరహంబు,
ఒనరించె నెవ్వడో యుత్తమ కార్యంబు
అవసరంబున మిత్రుడయ్యె మఱియొకండు
కల మనోహర గీతికలపాడె నొకరుండు
దినమంత యొకఁడు నదీ యాత్రలో బుచ్చె
బ్రతుకు మధురమని భావించె నొక్కడు
దానమొసంగి సంతసపడె నొకరుండు
శక్తివంచన లేక సమర మొక్కడుచేసె
ధర్మ సంరక్షణాతీత బుద్ధి యొకరుఁడు
అట్టివాఁడవు కాదె - యరయంగ నీవోయి

ఎవరో ఒకరు నిన్ను ప్రేమించుచున్నారు. నీవెంత నిరుపేదవైనను, ప్రపంచములో నీవు ఎంత అనామధేయుడవైనను, నిన్ను కూడ ప్రేమించి, ఆరాధించి, పూజించువారు ఎవరో ఒకరు ఉందురు. అట్టివారికి నీవే జీవితము, ఆత్మ, గమ్యస్థానము, సమస్తమును నీవే. అట్టివారు ఎవరో ఒకరు... నీ పత్నియో, నీ బిడ్డయో, తండ్రియో, తల్లియో, కుమార్తెయో, స్నేహితుడో కావచ్చును. అటువంటివారికి సర్వస్వమును నీవే. ఆ యెవరో యొకరు నిన్ను ప్రేమించి, జీవించి, నీవే తమ ఆదర్శ జీవియని తలంచియుండువారికి ఆశాభంగము కలుగకుండ సత్యముగా నుండి ఆదర్శ జీవితము గడుపుట నీ విద్యుక్త ధర్మము కాదా!

ఈ సందేశము యొక్క సారాంశమును సంపూర్ణముగా వ్యక్తము చేయునట్టి దూరప్రదేశమైన అమెరికా నుండి ఎవరో ఒకరు – ఒకానొకరు – అను నామాంతరముతో వ్రాసి పంపిన ఒక చిన్న పద్యము దిగువ నుదహరింపబడినది.

ఒకానొకరు

ఎవరో ఒకరు ఒక బంగారమువంటి కార్యము చేసిరి,
ఎవరో ఒకరు అవసర సమయములో యదార్థ మిత్రునిగా తోడ్పడిరి.
ఎవరో యొకరు రోజంతయు నావ ప్రయాణము చేసిరి.
ఎవరో యొకరు "జీవనమే మధురమని" తలంచిరి.
ఎవరో యొకరు "నేనిచ్చుటకు ఆనందించుచున్నానని" చెప్పిరి.
ఎవరో యొకరు ధైర్యముగా పోరాడిరి.
ఎవరో యొకరు ధర్మమును రక్షించుటకే జీవించిరి.
ఆ యెవరో నీవేనా?

... ఓమ్ ...

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతి

# ప్రపంచకములోని తూర్పు పశ్చిమదేశములలోని ఆధ్యాత్మికపు మెఱుపులు (COSMIC FLASHES) చదువరులలో కొందరి అభిప్రాయములు

1. డాక్టర్ కె. సచ్చిదానంద మూర్తి గారు
తత్త్వశాస్త్ర శాఖాధ్యక్షులు, ఆంధ్ర విశ్వవిద్యాలయము, వాల్తేరు

ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** పొత్తమును నాకు కానుకగా పంపినందులకు తమకు నా కృతజ్ఞతా పూర్వకమగు అభివందనములు. ఇప్పుడే దానిని చదువటను పూర్తి చేసితిని. అవతారికలో నేను వచించినట్లు అది మిగుల అద్భుతమైన గ్రంథము. హిందూ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, మెయిల్, స్టేట్స్ మెన్, ప్రబుద్ధ, భారతి, వేదాంతకేసరి, సన్డే టైమ్స్ పత్రికా సంపాదకులకు ప్రతులను పంపుదు. వారు వారి పత్రికలలో పుస్తకమును గురించి అనుకూలముగా వ్రాసిన యెడల దాని అమ్మకము హెచ్చుగా నుండును. సంపాదకులకు ప్రతిని పంపునపుడు, లోపలి కవరు మీద "పత్రికలో దయతో గ్రంథ సమీక్ష కొఱకు – సంపాదకునికి" అని వ్రాయింపవలెను.

కాలికోగుడ్డ అట్టతోనున్న ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** ప్రతిని రెండవ పర్యాయము పంపినందులకు నా ధన్యవాదములు, పుస్తకమును గురించి **(Advertise)** ప్రకటన చేయుటగాని, పత్రికలకు పంపుటకుగాని తమకు ఇష్టము లేకపోవుటను గురించి నేను బాగుగా బోధపరచుకొని అభినందించుచున్నాను. గ్రంథమును క్రయమునకు పెట్టు భావమే తమకు నచ్చకపోవుటను తెలుసుకొని నేను చాల సంతోషించినాను. సన్యాసుల యదార్థమగు ఆంతర్యము అట్టిదే. బ్రహ్మ విద్యను వ్యాప్తి చేయుటయే సన్యాసికుండవలసిన యేకైకోద్దేశ్యముగాని, దాని నుండి ఆదాయము సంపాదించుటకాదు. తాము సన్యాసిత్వములో దృఢపడి సరియగు

పరివ్రాజకులగుచున్నట్లు కనుగొనుటకు నాకు చాల ఆనందమగుచున్నది.

2. శ్రీ ఎమ్.కె. స్పెన్సరు, కరాచి.

మన ప్రియ మిత్రుడగు శ్రీ దొరస్వామి నాకు పంపిన తమ యొక్క చక్కని గ్రంథమగు ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** మీదనే ఈ క్షణమున నా మనస్సంతయు కేంద్రీకరించియున్నది. అది అతీతముతో ఐక్యమైనట్టి హృదయ కేంద్రము నుండియే వెలువడినట్టి ప్రకాశముతో నిండిన దివ్యభావములతోను గంభీరమైనట్టియు దైవభావములో లీనమైనట్టియు ఒక గనివలెనున్నది.

తమ హృదయము శాశ్వతమగు దైవముతో తాదాత్మ్యము పొందిన ఆత్మయే అయియుండి యుండును. తమలోనున్న క్రీస్తు, కృష్ణ, ఫారసీ సమభావములకు నా వందనములు. ఆత్మ జ్ఞానమే శాశ్వతానందము పొందుటలో అన్ని సరిహద్దులను దాటగలదన్న సంగతిని జనులు గ్రహింపలేనంత మాయలోబడి పోవుచున్నారు. తాము నలుబది దినములు మౌనభావనలో ఉపవాసదీక్షను సలిపి ఆ కాలములో పూర్తిగా ప్రార్థన, ధ్యానములతో నిండియుండిరి. అప్పుడు అది నిజముగా ఉపవాసదీక్షగాక దైవముతో విందును సలుపుకొని యుండిరి. నా వ్రాత సత్యమేగదా? ఆ మూలాగ్రముగా తమ పుస్తకముతో ఆనందించియుంటిని.

3. శ్రీ యస్. తులసీదాస్ నాయుడు, బి.ఏ., బి.యల్.,
రిటైర్డు సబ్ జడ్జి, మదరాసు – 4.

తాము అత్యంత దయతో నాకు పంపిన ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** అను నూతన గ్రంథమును నేను అందుకొంటిని. అందుకు నా ధన్యవాదములు. పుస్తకము యొక్క తొలిపలుకులలో శ్రీ సచ్చిదానందమూర్తి గారు వక్కాణించిన అన్ని భావములలో వారితో నేను పూర్తిగా నేకీభవించుచున్నాను.

ఆధ్యాత్మికపు మెఱుపులు యదార్థముగా ఒకగొప్ప జీవన్ముక్తి యొక్క ఆంతర్య భావములు. అవి మనస్సునకు ఒక గొప్ప విందువలె నాకు అనిపించుచున్నవి. ఆ భావములలో మునుగుటకు నేను ప్రతిదినము కొంతకాలము ఆ పుస్తక పఠన క్రింద వినియోగించుచున్నాను. మీ రచనలకు నాలో కలిగిన భావనలు నేనుదాపజాలను. ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** చివరనుదహరించినట్టివియు "పీస్" పత్రికతో వెలువడుచున్న తమ తక్కిన రచనల నన్నింటిని, శీఘ్రముగా ముద్రింపింతురని నేను ఆశించుచున్నాను.

4. శ్రీ పరమార్థ ప్రకాశ్, ఎమ్.ఏ., మొరాదాబాద్.

మనస్సు అలసియున్నను, ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** గ్రంథమును మొదటిసారి చదువుటను ఇప్పుడే పూర్తి చేయుటచేత ఈ మాటలను వ్రాయుటకు నా హృదయము నిర్బంధించుచున్నది. ప్రపంచమునకు అందజేయుటకు ఈ పుస్తకము పిమ్మట నిక యే సందేశమైనను మీవద్దనున్నదా అని నేను ఆశ్చర్యపడుచున్నాను. దీనిలోని సందేశములతోనే నేను పూర్ణ భావమును పొందుచున్నాను. తోటపల్లి ఆశ్రమము వృద్ధి పొందవలయునని కోరుచున్నాను, యదార్థముగా తమ వద్దకు (ఓమ్) దగ్గరకు వచ్చియున్నాను.

5. డాక్టర్ హెచ్. జె. ఛత్రపతి, ఎమ్.బి.బి.ఎస్., జునాగాడ్ (సౌరాష్ట్ర)

పదునైదు సంవత్సరముల నుండి నాకు తోడ్పడుచున్న శ్రీ ఎస్.డి. అయ్యరుగారి వద్ద నుండి ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** గ్రంథ ప్రతినొకదానిని అందుకొంటిని, నా సంశయములలో చాల మట్టుకు రెండవ పఠనతో నివృత్తి అయి, ఆంతర్యము అంతయు శాంతి భావముతో నిండినది. విషమసమస్యలు **(Problems)** సాధించబడి సంశయములు తీరినవి. ఆంతర్యమునకు దారిచూపు జ్యోతిని నేను పొందినట్లు తలంచుచున్నాను.

ఇదంతయు తమ మహత్త్వమే. ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** యొక్క ప్రతి పేజీయు ప్రతిపదము నన్ను ఉద్రేకించుటచేత ఈ గ్రంథము నా కొఱకే వ్రాయబడినదని నేను భావించుచున్నాను. ప్రతిమాట ఒక మహత్తరమగు యదార్థ భావమును నేర్పుచున్నది. ప్రతి అధ్యాయము వ్యావహారిక, ఆధ్యాత్మిక సంబంధమగు అన్ని సంగతులలోను, అస్వస్థత, కష్టములవంటి పరీక్షలలోను. యుక్తముగాను, నాకు వర్తించునట్లుగాను వ్రాయబడినట్లు తోచుచున్నది. ఇదంతయు తమ అనుగ్రహమేను.

6. శ్రీ హెచ్.బి. షరీఖ్
   సూపరింటెండింగ్ యింజినీర్, మలాడ్, బొంబాయి

శ్రీ స్వామి ఓంకారుగారు ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** ప్రతిని ఒకదానిని నాకు పంపించినందులకు మీకు కృతజ్ఞుడను. అంత అసామాన్యమైనదిగాను, ఉత్కృష్టమైనదిగాను ఉన్న ఆ పుస్తకమును చదువుటకు నాకు ఎంతో ఆనందమైనది. ప్రతి పేజీయందు పూర్తియగు దైవభావన యుండుటచేత 108 సందేశములు ఒక జపమాలలోని పూసలవలెనున్నవి.

7. డాక్టర్ సి. హెచ్. స్వామి, ఎల్.ఎమ్.పి., రామచంద్రపురం

తాము అత్యంత దయతో నాకు పంపిన ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** పుస్తకము నాకు అందినది. ఆ పుస్తకమును పంపవలసిన వారి జాబితాలో నన్ను జ్ఞాపకముంచుకొనుట తమకు నాయందుగల దయకు. ప్రేమకు నేనెంతయొ కృతజ్ఞుడను. పుస్తకమును చదివితినిగాని యింకను అనేక పర్యాయములు దానిని పదే పదే పఠింపవలసి యున్నది. ఆధ్యాత్మికపు మెఱుపులు అని సమిష్టి విశ్వమునకు చెందినట్లు పేరు పెట్టబడినను అవి ధ్యానములో నిమగ్నమైనప్పుడును దైవ సామ్రాజ్యములోనికి ప్రవేశించునపుడును, దైవసాన్నిధ్యమున మనస్సు యదార్థముగా

అనుభవించునట్టి సాధకుని మనస్సు క్రమేణ సూక్ష్మమగునట్లు అనగా బాహ్య స్థూలములగు తలంపుల నుండి నివృత్తి అయి, నశించి, సమాధి స్థితిలో శుద్ధాత్మ, సచ్చిదానందమూర్తితో ఐక్యము చేయుటకు ఈ గ్రంథముపయోగించును. సాధకుని బ్రహ్మానందములో ముంచి, జీవభావమును పూర్తిగా తొలగించి బ్రహ్మైక్యమును పొందునట్లు చేయును. ఈ గ్రంథము యొక్క విలువను కట్టుటకు అలవికాదు. ఈ పుస్తకమును జాగ్రత్తతో పూర్తిగా పఠించిన యెడల జీవుని అజ్ఞానమును తొలగించి పరమాత్మతో ఐక్యానుభవమును పొందించుటకు తోడ్పడును.

8. డాక్టర్ ఎస్.కె. అత్రి, ఎం.బి.బి.ఎస్., శ్రీనగర్ (కాశ్మీరు)

ఒక గ్రామస్తుడు బంగారు వర్ణమైన తేనె పట్టును తెచ్చెను. నేను వాసనను, రుచినిగాని చూడలేకపోతిని. వీధిని నడుచుచున్నవారు అది సువాసనతోకూడిన తియ్యని వస్తువని తెలిసికొనలేకపోయిరి. పట్టు ఇంటి లోపలి గదిలో పెట్టబడెను. కిటికీ తలుపు అద్దపు ముక్క బ్రద్దలైపోయినది. దూరమునున్న తేనెటీగలు వాసననుపట్టి మైళ్ళ నుండి వచ్చి తేనెను రుచి చూచి కిటికీ ఖాళీ స్థలము నుండి గదిలోనికి ప్రవేశించి తేనె నంతను త్రాగివేసెను.

శ్రీ స్వామిజీ ఆధ్యాత్మికపు మెఋపులు **(Cosmic Flashes)** పుస్తకమును నాకు పంపిరి. నేను చదివి నా పూర్వపు అనుభవమునుబట్టి దాని విలువను నిర్ణయించితిని. నా బల్లమీద పెటతిని. ఒక ఫ్రెంచి వ్యక్తి వచ్చి అందులో "ఫ్యా కహా, ఫ్యా కహా" అని చదివి అద్భుతముగా నున్నదనెను. ఇతరులు కూడ వచ్చిరి. అన్ని ఈగలు పరిమళమును గుర్తించినవి. కందిరీగ మాత్రము తేనె విలువను తెలిసికొనలేకపోయెను.

9. శ్రీ వై. సత్తిరాజు, సామర్లకోట

ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** గురించి నా అభివందనములు. అత్యుత్సాహముతో నేను పుస్తకమును చదివి ఉద్రేకముతో నిండియుంటిని.

10. శ్రీ డి.సి. వీరతుంగ, గంపహా, డబ్ల్యు.పి. సింహళం

తమ చక్కని ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** కానుకను అతి కృతజ్ఞతతో అందుకొంటిని. రాత్రి ప్రశాంత సమయములో మా ఇంటిలోని బృందము చదివి దాని నుండి ఉత్కృష్టోద్రేకమును పొందిరి. దానిలోని భావములను చదివినప్పుడు అత్యున్నతమగు స్థలములకు మమ్ములను తీసికొనివెళ్ళినట్లు మేము అనుభవించితిమి. ఒకనాడు తమ ఆశ్రమమునకు వచ్చి తమ ఆశీర్వచనములను పొందుదమని మా తీవ్రమగు ఆశయము, ప్రార్థన.

11. శ్రీ స్వామి నిర్వాణానంద, గొల్లప్రోలు

ఈ దినమున అనేకాభివందనములతోను, హృదయపూరితమగు ఆనందముతోను ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** అను తమ అమూల్య గ్రంథమును నేను అందుకొంటిని. ఒకటి రెండు పర్యాయములు దానిని చదివినను, సందేశములను ప్రతి దినము తిరిగియు చదివి ఆ పుస్తకము యొక్క ఉపోద్ఘాతములో తాము సెలవిచ్చిన ప్రకారము వాని సారమును జీర్ణము చేసికొనుటకు యత్నింతును. ఇచ్చట బి.ఏ., ప్యాసు అయిన నా మనుమడు అవసరాల మంగపతిరావు దానిని చదివి, మద్రాసులోని అడయారు లైబ్రెరీలో అనేక తత్త్వ గ్రంథములను తాను చదివినను, ఈ పుస్తకమందుగల మహత్తరమగు భావములు వానియందు వేనిలోను తాను కనుగొనలేదని అనెను. ఆ పుస్తకమును చదివి అతడు చాల ఉద్రేకింపబడెను.

12. డాక్టరు పి. గోవిందరాజులు, శాంతి ఆశ్రమ్ - మద్రాసు.

ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** అను తమ పుస్తకమును నాకు కానుకగా పంపినందుకు నా ధన్యవాదములు. దయతో పంపిన ఈ కానుకను గురించి నా కృతజ్ఞతాపూర్వక వందనములు.

13. శ్రీ కె. కామరాజు, బి.ఎ.బి.ఎల్., పెద్దాపురం

తమ ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** గ్రంథమును నాకు కానుకగా పంపినందులకు అనేక వందనములు. నేను మీకు కృతజ్ఞుడను. దాని ఉపోద్ఘాతము చదివి అందులో సలహాచేసిన ప్రకారము సాధ్యమైనంతమట్టుకు అనుదినము దానిని పారాయణచేసి దాని నుండి పొందగలిగినంత లాభమును పొందుదునని ఆశించుచున్నాను. ఈ దేశమందుగల ఆంగ్ల భాషరాని, మీ యొక్క అనేకమంది భక్తులకు ఈ అమూల్య సంపత్తును ఎట్లు అందచేయుట అను ఆలోచన నాకు తట్టుచున్నది. కనుక మచ్చుగా మొదటి యేడు సందేశములను పద్యరూపముగా అనువాదము చేసి వ్రాసితిని. దానిని తమరు సరిచూచి అంగీకరించుటకు పంపుచున్నాను. ఇట్లు ముందుకు వెళ్ళమని నాకు అనుజ్ఞను ప్రసాదించినయెడల సాధ్యమైనంత త్వరలో దీని అనువాదమును పూర్తిచేయుదును.

14. పూజ్యశ్రీ రామదాసు స్వాములవారు, ఆనందాశ్రమము, కనన్‌గాడ్.

మీరు కానుకగా పంపించిన శ్రీ ఓంకారస్వామివారి ఉద్రేకపూరితమగు ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** మేము ఆనందముతోను, కృతజ్ఞతతోను అందుకొంటిమి.

15. శ్రీ పరమార్థ ప్రకాశ్, మొరాదాబాద్.

ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** పుస్తకమును అందుకొనుటయు, అందులో తమ ఘనమగు ఆశీర్వచనములతో కానుకగా

అందుకొనుటయు మాటలతో వెలిబుచ్చుటకు నలవికాని కృతజ్ఞతా భావముతో నన్ను నింపివేసినది. ఇది ఆత్మలలోగల, అన్యోన్యభావము బాహ్య రూపములోగాని, విషయసూచికలోగాని, తమవి ఇంతవరకు వెలువడిన వ్రాతరూపమైనట్టివిగాని, ముద్రణ రూపముగా నున్నట్టివేవియు ఈ పుస్తకముతో సరిపోలవు. తాము సెలవిచ్చినట్లు ప్రతి దినము ఏదో కొంత భాగము చదువుచు లేక దానినుండి కొంత సారమును స్వీకరించుచు ఇప్పుడు దానినే పఠించుచున్నాను. కానుకలుగా ఇచ్చుటకు నాకు ఇంకను అయిదు ప్రతులు కావలసియున్నవి. లేక తామే పంపగలందులకు వారి చిరునామా యిచ్చెదను. తాను కోరిన యెడల హిందీ శాంతిలో దఫదఫాలుగా ముద్రించి పూర్తి అయిన పిమ్మట పుస్తక రూపముగా అచ్చువేయుటకు చక్కని హిందీ అనువాదమును వారిపేర పంపుదునని ప్రభు దయాల్జీగారికి వ్రాయుచున్నాను. ఈ పుస్తకమును నాకు నచ్చినట్లుగా తొలిపలుకులు వ్రాసిన శ్రీ సచ్చిదానందమూర్తిగారికి నన్ను జ్ఞాపకము చేయగోరెదను.

16. శ్రీ ఆర్. గజపతి, రాజమండ్రి.

ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** పుస్తమును అందుకొంటిని. తమ ఆశీర్వచనములకు నేను కృతజ్ఞుడను. శ్రీ సచ్చిదానందమూర్తిగారి తొలి పలుకులు విలువైనదియు, చక్కనిదియు. ఇప్పటికాలములో ఇచ్చకముల నుండి విముక్తి అయి, స్వామీజీ వారి స్వభావమగు, ఉన్నది ఉన్నట్లు యదార్థముగా చెప్పుట బహు అరుదు. ఈ పుస్తకము మలినము తొలగించి క్రొత్త తేజమును ఇచ్చును. వేర్వేరు స్థాయిలలో ప్రతిచోటను నిలకడయగు శాంతిని నెలకొల్పుటకు యత్నములు చేయుచుండుటచేత కొంతవరకు పని జరిగినదని చెప్పవచ్చును. శాంతి విషయములో అన్ని యత్నములు శీఘ్ర కాలములో కలసి పనిచేయునని ఆశించుచున్నాను.

17. శ్రీ ఎన్.బి. ఘోషు, ఖర్గపూర్.

నా వినయ పూర్వకమగు ప్రణామములను తమకు అర్పించుచున్నాను, తాము దయతోను అనుభూతితోను నాకు తమ ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** గ్రంథమును కానుకగా పంపినందులకు నేను తమకు యెంతయొ కృతజ్ఞుడను, ఈ పుస్తకము యదార్థముగా బహు అమూల్యమైనది, ఈ సందేశములు వ్యక్తుల అంతరమును గొప్ప తేజస్సుతో ప్రకాశింపచేయునట్టి భాషలో వ్రాయబడినవి. నేను ప్రతి సందేశమును చదివి క్రమముగా వానిని నా మనస్ఫూర్తిగా ఆమోదించుచున్నాను.

18. శ్రీ యస్. పాపారావు, జమ్‌షెడ్‌పూర్.

తమ దయాపూరితమగు లేఖను, ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** గ్రంథమును వెలుతురుపైని ధ్యానమును గురించిన ప్రతులును నాకు పోస్టు ద్వారా చేరినవి. యదార్థముగా సత్యాన్వేషులకు సందేశములు మెరుపులవంటివే. చాల ఉద్రేకపూరితముగా నుండుటచేత పుస్తకమును చదివి సంతోషమును, శాంతమును పొందుచున్నాను. ఈ పుస్తకమును అనుదినము పఠించుచున్నాను.

19. శ్రీ వి. సత్యనారాయణరాజు, బి.ఏ., బి.ఎల్., పెద్దాపురం.

తమ చక్కని ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** పుస్తకమును నాకు కానుకగా పంపినందులకు తమకు నా కృతజ్ఞతను ఎట్లు నేను తెలుపవలయునో నాకు గోచరము కాకున్నది. ఇప్పటికి పుస్తకములోని సగము భాగము ఆనందముతో చదివియుంటిని. లోపలను, వెలుపలను మిక్కిలి చక్కగాను, సుందరముగాను ఉన్నది. ప్రతి సందేశము యొక్క గంభీరతను గమనించుటకు తగిన ఆతృతకును, భక్తికిని వేడుకొనుచున్నాను. పుస్తకములోని చాల సందేశములు మంచి ధ్యానమునకు ఉపయోగించును. ఈ కానుకను పొందినవారిమీద ప్రతి దినము సారమును గ్రహించుచు

అధమపక్షము ఒక అధ్యాయమైనను చదువుచుండవలెనన్న బాధ్యతను తాము నియమించిరి. పుస్తకములోని విషయము విశ్వప్రేమను పెంపొందించుట ..నక ఈ బాధ్యత స్వాభావికముగనే నెరవేరును. దోషిని సహితము విశాల హృదయముతో చూచునంత తాము కనపర్చిన ప్రేమకు నా వందనములు. ఈ మధ్యను తమపేర లేఖలు క్రమముగా వ్రాయకపోవుచుండుటచేత నా దోషమునకు నేనే సిగ్గుపడుతున్నాను. కాని తమరు మాత్రము పూర్వమువలెనే శుద్ధ ప్రేమతో మమ్ములను జ్ఞప్తిలో నుంచుకొనుచున్నారు. తమ ఉదారమైనట్టియు, పవిత్రమైనట్టియు ప్రేమ ఇతరులలోని దోషములను కనబడనీయదు. అనేకములో ఏకత్వము, ఏకత్వములో అనేకత్వము చూడగలిగిన శక్తిని కలిగియుండుటచేత, దోషులయందు కూడను ఆయేకైకమూర్తినే తాము చూతురు. తమ విశాలమగు దివ్య ప్రేమ అన్ని తప్పులను లోపములను భర్తీచేసి పూర్ణత్వము పొందునట్లు చేయును. ఆ ఆశయము విశ్వాసము నాకు తిరిగి ధైర్యము కలిగించుటచేత తమకు ఇప్పుడు వ్రాయసాహసించితిని.

తమ పుస్తకము చింతనకు మంచి విషయము, భక్తుని మనస్సు నింపి కేవలాత్మ యొక్క మహత్త్వమును గురించి ఆలోచనలలోనికి దింపును, వాక్యములలో తత్త్వ జ్ఞానముతో కూడిన కవిత కనబడును. అనగా ఈ వాక్యములు కేవలము చదువుటకు మాత్రమేగాక ఏకాగ్రతతో ధ్యానమునకు వ్రాయబడినట్లు తోచును. వానిని పదేపదే చింతన చేయుకొలది ఒక విధమైన తన్మయత్త్వమును, బ్రహ్మానందమును కలుగును. పూర్ణ జీవమునకు దారిచూపును. గ్రంథకర్త ఈ మాటల ద్వారా ప్రసాదించదలచిన భాష గంభీరతను తెలిసికొని, భావములపైని ధ్యానించి శాశ్వత పదవిని, ..నందమును పొందగలందులకు మాత్రము నేను ప్రార్థించుచున్నాను.

20. శ్రీ కె.ఎస్. వెంకట్రామన్, ఎమ్.ఏ., ఐ.సి.ఎస్., తంజావూర్.

తమచేత పంపబడిన ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** పుస్తకము చెప్పనలవికానంత శ్రేష్ఠముగా నున్నది. ఆ సాధనలోనున్నవారు తప్ప తదితరులు ఆ శ్రేష్ఠతను గ్రహింపజాలరు.

21. శ్రీ డి.వి.ఎన్.రావ్. బి.ఏ., బి.ఎల్., కాకినాడ

ఈరోజులలో తమ ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** అష్టోత్తర శత సందేశములే నాకు మనశ్శాంతిని ఇచ్చుచున్నవి. అవి సారములోను, ఉద్దేశ్యములోను అష్టావక్ర సంహితలో వానివలె ఉత్కృష్టముగా ఉన్నవి. ప్రతి దినమును దానిలోను, అష్టావక్ర సంహితలోను, భగవద్గీతలోను ఒకటి రెండు చొప్పున చదువుచున్నాను. అందులో తమవి నూతన దైవ సందేశములు. ఋషి, దైవము, సూర్యుడు, సర్వమును అగు శ్రీ ఓంకారస్వామివారి సన్నిహితములోనికి నన్ను భగవంతుడు తెచ్చినందులకు నేను ఎంతయో కృతజ్ఞుడను. ఆధ్యాత్మికపు మెఱుపులు తెలుగులోనికి భాషాంతరీకరణము చేయు తలంపు నాకు ఉన్నది. అది పూర్తిగా తమవలన ఆమోదింపబడిన ముద్రణ అయితే ఆంధ్ర లోకమునకు అతి ఉపయోగకరముగా నుండును.

22. శ్రీ ఆచార్య టి.ఎమ్.పి. మహదేవన్, మదరాసు.

నాకు దయతో తమ ఆధ్యాత్మికపు మెఱుపులు **(Cosmic Flashes)** పుస్తకమును పంపినందులకు తమకు నావందనములు, తమ భావమును ఎల్లప్పుడునువలెనే బహు మహత్తరమైనవి. ఈ పుస్తకమును పఠించిన వారు వెంటనే దాని మహత్త్వమును పొందగలరని నా దృఢ విశ్వాసము.

... ఓమ్ ...

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శ్శాంతి శ్శాంతి శ్శాంతి

.... ఓమ్ ....

# శ్రీ శాంతి ఆశ్రమము

పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు తరుణ ప్రాయముననే సన్యసించి, చాలా సంవత్సరములు హిమాలయములలో తపమాచరించి తపఃసిద్ధులై ఆంధ్రదేశమునకు తిరిగివచ్చి, తోటపల్లి కొండల మధ్యనున్న రమణీయమైన అరణ్యములో కొంతకాలము తపమాచరించిన పిమ్మట దైవ ప్రేరణచే 1917వ సం॥లో ఈ శాంతిఆశ్రమమును స్థాపించిరి.

ఆనాటి నుండియు ఆశ్రమము దినదిన ప్రవర్ధమానమగుచు నేటికి సువిశాలమై (150 ఎకరములు) ఫల పుష్ప వృక్ష సముదాయముతో నేత్రానందకరమై యొప్పచు, అనేకమంది నిరాశ్రయులకు అనాథ బాల బాలికలకు ఆశ్రయమై నిరంతరము అన్న, వస్త్ర, విద్య, వైద్య దానము లొనర్చుచు శాంతి కాముకులకు, దైవపిపాసులకు ప్రశాంతి నిలయముగా అలరారుచున్నది. పూజ్యశ్రీ స్వామిజీ పవిత్రాశీస్సులతో "PEACE" "శాంతి" మాసపత్రికల ద్వారా, ఆధ్యాత్మిక సందేశములను అందించుచున్నది.

సర్వమత సామరస్యము, దీనజనోద్ధరణ, నిస్వార్థ ప్రేమయుత సేవా జీవితము. ఆశ్రమము చూడవచ్చిన వారిని దైవోన్ముఖముగా జేయుటయే, శ్రీ స్వామిజీ జీవిత ధ్యేయము.

జాతి, మత, కుల వివక్షత లేక సర్వులకు జ్ఞాన గృహముగా నిరంత రాశ్రయమిచ్చుటే శ్రీ శాంత్యాశ్రమ లక్ష్యము.

ఈ మాతృ ఆశ్రమము వివిధరీతుల అభివృద్ధి నొందుటే గాక వాల్తేరు, కోటగిరి, కాకినాడ, విజయవాడ మొదలగు అనేక తావులలో ఈ ఆశ్రమ శాఖలు అభివృద్ధి చెందుతూ ఆయా ప్రాంతపు భక్తుల ఆధ్యాత్మికాభివృద్ధికి తోడ్పడుచున్నవి. దేశ, విదేశములందలి శాంతి కోరు భక్తులందరు మాతృ ఆశ్రమమును, శాఖలను దర్శించుచు, శాంతిని బడసి వెళ్ళుచుండిరి. ఇంతకు ముందు దర్శించని భక్తులకు, ఆశ్రమమునకు, దైవసన్నిధికి హృదయపూర్వక సుస్వాగతము.

ఓం శ్శాంతి, శ్శాంతి, శ్శాంతిః

# శాంతి ప్రార్థన

పూజనీయమైన ఓ దివ్యస్వరూపా !

మా లోపలను, వెలుపలను, మీదను క్రిందను, అంతటను నిండియున్న ఓ సర్వాంతర్యామీ! మా లోపల ప్రత్యణువు నందును ఇమిడియుండి, మా నేత్రములకు నేత్రము, కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము, మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము, ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ! నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.

ఓ తేజోమయ మూర్తీ! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక! ఓ సచ్చిదానంద స్వరూపా! ప్రతి మానవ హృదయము నందును, నానాజాతి మధ్యమునను శాంతి సామరస్యములను ప్రతిష్ఠింప జేయుము. ఓ దేవా! ఇదియే మా మనఃపూర్వకమైన ప్రార్థన.

**లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !**

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః !**